ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్‌పండ్యా**
సంపాదకులు
**బి.సి.హెచ్.వి. సుబ్బారావు**
**(అశ్విని)**
ఉప సంపాదకులు
**ముక్కామల రత్నాకర్**
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 07
**డిసెంబర్ 2016**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**
**99491 11175**

## ఇప్పుడు

వర్తమానమును స్వీకరించుట చేత **'ఇప్పుడు'** అనేది గుర్తించబడుతుంది. ఆ వర్తమానపు క్షణము **'ఇప్పుడు'**ను నిర్వచిస్తుంది. ఆ క్షణమాత్రపు కాలములోనే అద్భుత అవకాశములు ఒదిగి ఉంటాయి. అనంతానంత ఉపలబ్ధుల ఖజానా ఇందులోనే దాగి ఉంటుంది. అయినా కూడా మనం ఈ అపూర్వక్షణమును ఎందుకు విస్మరిస్తామో తెలియదు. బంగారం వంటి **ఇప్పుడు** అనే యథార్థతను విడచిపెట్టి ఎన్నెన్నో భ్రాంతులలో లోతుగా కూరుకుపోతాము. గతకాలపు స్మృతుల భ్రాంతి, జరిగిపోయిన విషయముల గురించిన భ్రాంతి మరియు రాబోయే రోజులను గురించిన ఆశలకు చెందిన భావికాలపు భ్రాంతి.... ఇలా ఎన్నో భ్రాంతులలో విహరిస్తుంటాము. ఈ భ్రాంతులన్నీ మనలను చాలా పనులు చేయకుండా విముఖులను గావిస్తాయి. పురుషార్థము నుండి మనలను దూరం చేస్తాయి.

కర్మ చేయుట కొరకు, పురుషార్థ ఫలితమును అందుకోవటానికి–వర్తమానపు క్షణములో అనగా **'ఇప్పుడు'**లో జీవించాలి. జీవితము ఎలా ఉన్నా దానిలోనే జీవిస్తూ–జీవనపోరాటం చెయ్యాలి. ఆ జీవితములో ఎదురయ్యే క్లిష్టపరిస్థితులను మరియు వాస్తవాలను స్వీకరించాలి. ఈ అద్భుతమైన జీవితము నుండి మనం పలాయనం చిత్తగిస్తే జీవితము తానిచ్చే ఉపలబ్ధుల నుండి మనలను వంచితులను గావిస్తుంది. అయితే మన మనస్సు ఈ సత్యమును అర్థం చేసుకోలేకపోవటమే కాదు; దానికి అంగీకరించదు కూడా! గతకాలపు స్మృతులు మరియు భవిష్యత్తును గురించిన కల్పనలనే ఊయలలో ఊగుతూ ఉంటుంది.

నిజానికి గతం–భవిష్యత్తు అనేవి మనస్సుకు మత్తు వంటివి. ఆ మత్తు జీవితం యొక్క యథార్థత నుండి వెన్నుచూపే ప్రక్రియకు దోహదం చేస్తుంది. **'ఇప్పుడు'** అనే సూర్యోదయములో కనులు విచ్చుకున్నప్పుడే మెలకువ వస్తుంది. వర్తమానక్షణములో జాగృతి చెందినప్పుడే మనస్సుకు పట్టిన మత్తు విడిపోతుంది. అప్పుడలా ఉంది. ఇప్పుడు అది ఏ సమయములో జరుగుతుంది? ఇటువంటి భ్రాంతుల నుండి తమకు తాము స్వేచ్ఛను పొందినవారు మాత్రమే **'ఇప్పుడు'** అనేదాని మహత్తును, మహిమను గుర్తించగలరు. **'ఇప్పుడు'** అనే క్షణం కర్మ చేయుట కొరకు; నవజాగరణ కొరకు; భ్రాంతుల నుండి ముక్తి పొందుటకు; వ్యర్థమైన వాటన్నింటినీ విడిచిపెట్టటానికి ఉన్నది. **'ఇప్పుడు'** అనేదానికొరకు ఎవరు తమను తాము సన్నద్ధం చేసుకుంటారో వారే జీవితమును అర్థం చేసుకున్నవారు, సఫలతను పొందినవారు అని తెలుసుకో!!

*– అఖండజ్యోతి, డిసెంబర్ 2015*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం:** ఇప్పుడు | 3 |
| 2. | **విషయసూచిక** | 4 |
| 3. | **యుగనిర్మాణ చిత్రావళి-20:** పన్నాదాది యొక్క కర్తవ్యనిష్ఠ | 5 |
| 4. | **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-54:** అతి చేరువగా కనిపించిన స్వాతంత్ర్యం | 6 |
| 5. | **సూక్ష్మీకరణ సాధన-13:** పరోక్ష జగత్తు యొక్క విధి వ్యవస్థ-తథ్యంతో కూడిన ఆధారాలు | 9 |
| 6. | **దత్త జయంతి ప్రత్యేకం:** దత్తాత్రేయుని 24 మంది గురువులు | 12 |
| 7. | **గీతాజయంతి ప్రత్యేకం:** మనలను పరిపూర్ణం చేసేందుకు అవతరించిన దివ్య సందేశమే భగవద్గీత | 15 |
| 8. | **కాశ్మీరు వ్యథను ఎవరు ఆలకిస్తారు?** | 17 |
| 9. | **21వ శతాబ్ది - ఉజ్వల భవిష్యత్తు:** అయోమయంలో పడేస్తున్న పరిస్థితులు | 22 |
| 10. | **సమయదానమే యుగధర్మము-1:** దానము - దాని ఔచిత్యము | 25 |
| 11. | **అంతర్యాత్ర-1:** ముందుమాట | 28 |
| 12. | **మనము - మన ఆరోగ్యం:** మందులే విషంగా మారకూడదు | 30 |
| 13. | **నిష్కామకర్మయే నిజమైన యోగం** | 32 |
| 14. | **ఇప్పటివరకు మనం పిరమిడుల రహస్యాన్ని తెలుసుకోలేకపోయాం** | 34 |
| 15. | **మహిళా జాగరణ:** మహిళ వాత్సల్యమూర్తి, మహిమాన్విత | 37 |
| 16. | **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే - 4 | 39 |
| 17. | **నా వారితో నా మాట:** నివేదన - ఈ జ్ఞానగంగ నిరంతరంగా ప్రవహించాలి | 42 |
| 18. | **ఆయుర్వేద వైద్యం-21:** నిత్య జీవితములో మంచినీరు త్రాగెడి విధానం - దాని ప్రయోజనం | 45 |
| 19. | **అశ్వమేధమహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-13) | 46 |
| 20. | **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-31** | 47 |
| 21. | **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు | 49 |



## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**డిసెంబర్ 2016**

| | |
|---|---|
| 10-12-2016 | గీతా జయంతి |
| 13-12-2016 | మిలాదున్-నబీ |
| 14-12-2016 | దత్తాత్రేయ జయంతి |
| 25-12-2016 | క్రీస్తు జయంతి (క్రిస్మస్) |
| 30-12-2016 | భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి |

**జనవరి 2017**

| | |
|---|---|
| 12-01-2017 | స్వామివివేకానంద జయంతి |
| 14-01-2017 | మకరసంక్రాంతి |
| 23-01-2017 | సుభాష్‌చంద్రబోస్ జయంతి |
| 26-01-2017 | గణతంత్రదినోత్సవం |

ప్రతి పనిని పూర్తి నిజాయితీతో నిర్వర్తించాలి

యుగనిర్మాణ చిత్రావళి-20

# పన్నాదాది యొక్క కర్తవ్యనిష్ఠ

చిత్తోడ్ మహారాణా సంగ్రామ్‌సింగ్, అతని పత్ని మహారాణి మరణించారు. చనిపోకముందు రాజ్యభారాన్ని జ్యేష్ఠ పుత్రుడైన విక్రమజీత్‌సింగ్‌కు, చిన్న కొడుకైన ఉదయసింగ్ చాలా చిన్న పిల్లవాడైనందున అతని ఆలన పాలన పన్నా అనే దాదికి అప్ప చెప్పాడు.



విక్రమజీత్‌సింగ్ గొప్ప పేరు ప్రఖ్యాతులు గల సంగ్రామ్‌సింగ్ పుత్రుడై నప్పటికీ అతని పాలన అన్యాయంతో, అత్యాచారాలతో సాగింది. జనశక్తి అనాదరణతో ఈ అత్యాచారి ఎక్కువ కాలం గద్దెపై ఉండలేకపోయాడు. ప్రజల సహకారంతో ఉదయసింగ్ పెద్ద అయ్యేవరకు రాజ్యపాలనను ఒక నమ్మకస్తుడైన సామంతుడైన బన్‌వీర్‌కు అప్పగించారు.

బన్‌వీర్ కూడా విశ్వాసఘాతకుడిగా మారి ప్రజాభీష్టానికి భిన్నంగా విక్రమజీత్‌ని, ఉదయసింగ్‌ని ఇద్దరిని చంపి తాను రాజు అయ్యేందుకు కుట్రలు పన్నసాగాడు. ఒకరోజు రాత్రి విక్రమజీత్‌ను హత్య చేశాడు. ఉదయసింగ్‌ను కూడా చంపడానికి బయలుదేరాడు.

యువరాజు ఉదయసింగ్ పన్నాదాది రక్షణలో ఉంటున్నాడు. పన్నాకు ఒక పుత్రుడు కూడా ఉన్నాడు. అతని పేరు చందన్. విక్రమజీతుని హత్య, బన్‌వీరుని కుతంత్రం తెలిసిన వెంటనే పరిస్థితులను పన్నా అర్థం చేసుకున్నది. ఆ క్షణంలో ఆమె ఆత్మ చెప్పింది– "ఇచ్చిన కర్తవ్యాన్ని, విశ్వాసాన్ని నిలుపుకోవడమే అసలైన ధర్మం. ఈ విపత్కర పరిస్థితుల్లో కూడా కర్తవ్యాన్ని విస్మరించకూడదు. ఇలా చేయనిచో ముందుతరాలవారు కూడా కర్తవ్యాలను భ్రష్టుపట్టిస్తారు, విశ్వాసం నిలుపుకోవాలనే మాట కూడా మరచిపోతారు."

పన్నాదాది ఒక్కక్షణంలో తన కర్తవ్యాన్ని నిశ్చయించుకున్నది. ఒక నమ్మకమైన నౌకరును పిలిచి, రాజకుమారుడిని ఒక చిన్న బుట్టలో పడుకోపెట్టి అడవిలోకి సురక్షితంగా పంపింది. నౌకరు ఇలా అన్నాడు – "ఇప్పుడు బన్‌వీరుని కళ్ళు కోపంతో ఎఱ్ఱగా ఉన్నాయి. వాడికి ఉదయసింగ్ కనిపించకపోతే మిమ్మల్ని మీ పిల్లవాడిని చంపేస్తాడు. అనవసరంగా ఎందుకు ఆపదలను కొనితెచ్చుకుంటారు?" పన్నా బదులిస్తూ "ఏ రోజున మనుష్యులు తమ సుఖం, సమృద్ధుల కొరకు విశ్వాసాన్ని పణంగా పెడతారో ఆ రోజు మనుష్యజీవనం సంకటంలో పడిపోతుంది. మనిషి యొక్క, సమాజం యొక్క హితం పరస్పర విశ్వాసంలోనే దాగి ఉన్నది. మనుష్యులు తమ స్వార్థాన్ని పట్టించుకోక కేవలం కర్తవ్యాన్ని మాత్రమే గుర్తుంచుకుంటే మనుష్యజాతి వికసిస్తుంది. సుఖశాంతులతో, సమృద్ధితో ఉంటుంది. నా ప్రాణం పోయినా ఆదర్శాల నుండి విముఖురాలను కాలేను" అన్నది.


పన్నా నౌకరు ఉదయసింగ్‌ను తీసుకుని వెళ్ళిపోయాడు. బన్‌వీరు వచ్చి అడిగాడు– "ఉదయ్ ఎక్కడ?" చిత్రంగా పన్నా తన పుత్రుడిని చూపింది. బన్‌వీరుడు చందన్‌ను హత్య చేశాడు. తన కంటి ముందే తన పుత్రుడి హత్య చూసి కూడా అయ్యో అని కూడా అనలేదు. ఉదయసింగ్‌ను రక్షించడం కొరకు తన అస్తిత్వాన్నే సంకటంలో పడవేసుకుంది. ఆమె చేసిన త్యాగాన్ని ఉదయసింగ్ ఎన్నడు మరవలేదు, ఆమెను మాతృ సమానురాలిగా గౌరవించాడు.

*– అనువాదం : ముక్కామల రత్నాకర్*

**ప్రేమను పంచేవారికి అపార సంతోషం కలుగుతుంది**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-54

# అతి చేరువగా కనిపించిన స్వాతంత్ర్యం



1935-37 స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను మలుపు తిప్పిన కాలం. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో క్రొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. భారతావనికి క్రమక్రమంగా స్వపరిపాలనను అప్పగించే ప్రణాళికను రూపొందించారు. దీనిని స్వరాజ్యానికి మొదటిమెట్టు, సంగ్రామానికి ఇదొక ముఖ్య విజయనీ సమీక్షకులు భావించారు. ఈ క్రొత్త విధానంలో వైస్రాయ్ మరియు గవర్నర్లకు మరిన్ని అధికారాలను ఇచ్చారు. భారతీయ సమాజం దీనిని పెద్ద విజయంగా గుర్తింపలేదు. ఐనప్పటికీ శాసనసభకు ఎన్నుకోబడ్డ ప్రతినిధులకు కొన్ని చిన్న చిన్న అధికారాలు ఇవ్వబడ్డాయి. భారతీయులను తృప్తిపరచడానికి ఈమాత్రం చాలనుకున్నారు ఆంగ్లేయులు. దేశ పత్రికల్లోనూ ఇది భారతీయుల స్వపరిపాలన వ్యవస్థ అని, ఆంగ్లేయుల పత్రికల్లో ఇది భారతదేశంలో బ్రిటిష్ రాజ్యం అని అర్థమయ్యేటట్టు ప్రచురించారు.

ప్రముఖ రాజకీయ పార్టీ ఐన కాంగ్రెస్ మొదట్లో ఈ విధానాన్ని ససేమిరా ఒప్పుకోలేదు. భారతీయులకు బాధ్యతలు అప్పగించారే కానీ అధికారాలు ఇవ్వలేదని ప్రకటించారు పండిట్ నెహ్రూ. శాసనసభ్యులను ఎన్నుకునే అవకాశం ఇవ్వబడ్డప్పుడు కూడా కాంగ్రెస్‌లో అధికభాగం పాల్గొనడానికి ఇష్టపడలేదు. ఐనా ఎన్నికలు ఆపేటట్టు లేరు ఆంగ్లేయులు. కాబట్టి సుదీర్ఘ మంతనాల తరువాత శాసనసభలో చేరి, అసమ్మతి ప్రకటించడానికైనా ఎన్నికల్లో పాల్గొనాలని కాంగ్రెసు పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో పాల్గొనకపోతే కౌన్సిల్ మొత్తం బ్రిటీష్‌వారే ఉంటారు, దేశాన్ని వారికి కావలసినట్టు చేసుకుంటారు. వారి నిర్ణయాలు దేశానికి, సమాజానికి ఘాతకంగా మారవచ్చు.

ఎన్నికలు పూర్తయ్యాయి. 1936 ఫిబ్రవరిలో ఫలితాలు వచ్చాయి. సంయుక్త ప్రాంతాలు, బిహార్, ఒడిషా, మధ్యప్రదేశ్ మరియు మద్రాసులో స్పష్ట విజయం సాధించారు. బొంబాయిలో సగం సీట్లు సాధించి, సమాన ఆలోచనలు కలిగిన దళాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ఉన్నారు. పశ్చిమం, ఉత్తరం, అస్సాంలో అత్యధిక బలంతో గెలిచారు. ప్రవేశపెట్టిన క్రొత్త విధానం ప్రకారం ఎన్నికల్లో గెలిచినవారికి కూడా పెద్దగా అధికారాలుండవు. కాంగ్రెస్ ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలా, కూడదా అనే అయోమయంలో పడింది. కాని వైస్రాయ్ లేదా గవర్నర్లు నిర్ణయాల తీసుకునేవారు. క్రొత్త ప్రభుత్వం పేరుకు మాత్రమే సక్రియ రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ గాంధీగారు తమ అభిప్రాయాలను చెప్పేవారు. వారి మార్గదర్శనం కోసం నేతలు వారిని కలుస్తూ ఉండేవారు. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నా కూడా కౌన్సిల్ రచనాత్మక కార్యాలకు నాంది పలికి ప్రజల్లో ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని గాంధీగారు ఇలా సలహా ఇచ్చారు. "గ్రామోద్యోగాలను ప్రోత్సహించడం, మద్యం నిషేధించడం, ఖాదీ, స్వదేశీయతలకు పెద్దపీట వేయడం, రైతుల భారాలు తగ్గించడం, అస్పృశ్యత తొలగించడం వంటి పనులు చేసే అవకాశాన్ని వదలకూడదు." బాపు ఇచ్చిన సలహాతో, రాజనైతిక సమీకరణాల దృష్ట్యా బొంబాయి, సంయుక్త ప్రాంతాలు, బీహార్, ఒడిషా, మద్రాస్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు.

బ్రిటిష్ రాజ్యాన్ని రూపుమాపాలనుకున్న కాంగ్రెస్‌వారి ఛత్రఛాయలోనే ప్రభుత్వాన్ని నడుపుతున్నట్టు పైకి కనిపించేది. గాంధీగారి క్రమశిక్షణను మంత్రులు సహృదయంగా స్వీకరించారు. సగటు భారతీయ జీవన స్థాయిలో, నిరాడం బరంగా ఉండాలని మంత్రులకు గట్టిగా చెప్పారు. విద్యా విస్తరణ, మద్య నిషేధంపై గాంధీగారు బాగా పట్టుబట్టారు.

రాజకీయ పరిస్థితుల విశ్లేషించి శ్రీరామ్ నిర్ద్వంద్వంగా, నిష్పాక్షికంగా, స్పష్టంగా రాసేవారు. కొంతకాలం వరకు వాతావరణంలో స్తబ్దత ఏర్పడింది. కానీ శ్రీరామ్ తన లేఖల్లో అక్కడక్కడా దీనిని 'ప్రమాదం' అని కూడా అన్నారు. కార్యకర్తలను హెచ్చరించారు. పత్రకారునిగా, స్వాతంత్ర్య సేనానిగా మొదటిలాగే సక్రియంగా ఉన్నప్పటికీ ఈమధ్య లోలోపలే ఏదో వ్యాకులతకు లోనుకాసాగారు. ఉన్నట్టుండి ముభావంగా ఉండేవారు. రాత్రి నిద్రలోంచి ఉన్నట్టుండి లేచి

**ప్రేమలో తీసుకోవాలని ఉండదు, ఇవ్వాలనే ఆతృత ఉంటుంది**

కూర్చుని ఏదో ఆలోచించేవారు. ఆయన్ని చూసి ఆయన భార్య లేచి కూర్చునేది. నీళ్ళందించి పుక్కిలించి తాగమనేది. అన్యమనస్కంగానే ఆవిడ మాట విని పడుకునే ప్రయత్నం చేసేవారు. దేనికో ఆయన లోలోపల మథనపడుతున్నారు. అది దేనికో తెలియకుంది.

### ఆందోళనను అతిక్రమించడం

1936 జూన్, రోజూలాగానే ఠంచనుగా మూడింటికే లేచి స్నానాదులు పూర్తి చేసుకుని ఉపాసనకు కూర్చున్నారు. జపం, ధ్యానం అయిపోయాక మళ్ళీ అదే పరిస్థితి. అఖండదీపాన్ని తదేకంగా ఎంతసేపు చూస్తూ ఉండిపోయారో గమనించు కోలేదు. దీపాన్ని దర్శించుకుంటుండగా చిత్తం ఏకాగ్రమైంది. ధ్యానం ప్రగాఢమైంది, భావసమాధి ఏర్పడసాగింది, ముందు ద్రష్ట లీనమయ్యాక, జ్యోతి లుప్తమైంది. ద్రష్ట, దృశ్యం రెండూ లుప్తమై చాలాసేపు అలాగే కొనసాగింది. భార్య కుదిపి లేపడం మాత్రమే గుర్తుంది. లేచి చూస్తే పూజ గదిలో కూర్చున్నట్టు చూసుకున్నారు. ఇప్పుడు అన్నీ గుర్తుకు రాసాగాయి. ఇదివరకులాగా అయోమయం లేదు. ముమ్ముందు చేయాల్సిన దేమిటో స్పష్టంగా కనిపిస్తోంది.

"రోజూ కన్నా రెండు గంటలు ఎక్కువ ధ్యానంలో కూర్చున్నారు మజ్జిగ ఇప్పుడే ఇమ్మంటారా?" అని అడిగింది భార్య. కాసేపాగమంటూ సైగ చేసి శ్వేతాశ్వతరోపనిషత్ పుస్తకాన్ని తిరగేశారు. తరువాతెప్పుడో ఆయన డైరీలో "ఒకసారి మొత్తం ఉపనిషత్తు చదివేశాను" అని వ్రాసుకున్నారు.

ఉపనిషత్తు చదివాక అల్పాహారం తీసుకుని 'దయా' అంటూ పిలిచారు. ఉత్తరభారతంలోని కులీన కుటుంబాలలో భార్యని పేరుతో పిలిచేవారు కాదు. భార్య సరస్వతీదేవి ఆయన వంక చూసింది. "ఇవాళ మనం ఊరికెళదాం. నువ్వు అక్కడే ఉండు. నేను కొన్నాళ్ళు దక్షిణభారత యాత్ర చేసి వస్తాను" అన్నారు శ్రీరామ్. వెంటనే ఆవిడ సర్దడం మొదలుపెట్టింది. మధ్యాహ్నానికి కుటుంబాన్ని ఆవల్ఖేడాలో దింపేసి దక్షిణ యాత్రకి ఏర్పాట్లు చేసుకోసాగారు. పూరీ, తిరుపతి, కాంచీపురం చూసుకుని పాండిచ్చేరి వెళ్ళాలన్న ప్రేరణ కలిగింది. దారిలోని నగరాలు, తీర్థస్థలాలలో ఆగేది లేదు. 3 వారాలలో యాత్ర పూర్తికావాలి. అన్ని ఏర్పాట్లు చేసుకుని ప్రయాణం మొదలుపెట్టారు.

### జగన్నాథుని ప్రసాదానికి చేయి చాచిన ప్రపంచం

పూరీలోని ముఖ్యమైన స్థలాలన్నీ దాదాపు చూసేశారు. జగన్నాథస్వామి ఆలయం, శంకర మఠాలపై ప్రత్యేకంగా ధ్యాస పెట్టారు. పూరీ ఆలయం 800 ఏళ్ళనాటిదని ప్రసిద్ధి. బ్రహ్మహత్యాపాతకం నుండి బయట పడటానికై అనంగ భీమసేన మహారాజు ఈ ఆలయాన్ని కట్టించాడు. ఆ తరువాత వేరే రాజులు, సామంతులు, జమీందారులు ఆలయాన్ని పెంపొందించారు. శ్రీరామ్ వెళ్ళినప్పుడు 'నవ కళేవరం' ఉత్సవం జరుగుతోంది. గుడిలో విగ్రహాలు మట్టితోనో, ధాతువు తోనో కాక చెక్కతో చేస్తారు. ఆ చెక్క సముద్రం నుండి సేకరిస్తారు. ఈ ఉత్సవం దగ్గరపడ్డప్పుడు బ్రహ్మదారువృక్షం దానంతటదే సముద్రపు అలలలో కొట్టుకువస్తుందని ప్రజల నమ్మకం. ముహూర్తం ఆసన్నమయ్యాక ఆ చెక్కతో బలరాముడు, సుభద్ర, జగన్నాథుడు కృష్ణుడి విగ్రహాలను చెక్కుతారు. తల నుండి నడుం వరకే చెక్కుతారు. చెవులుండవు.

గుడిని స్థాపించే సమయానికి విగ్రహాలు చెక్కడానికి స్వయంగా దేవతలే వచ్చారు అని నమ్ముతారు. మూడు వారాలలో పని పూర్తి చేయాలని నిశ్చయించుకుని దేవతలు తలుపులు వేసుకున్నారట. అప్పటి వరకు ఎవరు వారిని ఇబ్బంది పెట్టకూడదని, తలుపు కూడా తట్టకూడదని షరతు పెట్టారట. కాని ఆత్రుత ఆపుకోలేక రాజు 21 రోజుల లోపలే తలుపులు తీయించాడట. అప్పటికి విగ్రహాలు సగమే తయారయ్యాయి. దేవతలు పని వదిలేసి వెళ్ళిపోయారు. చేసిన తప్పుకి రాజు ఎంత పశ్చాత్తాపపడ్డా చేయగలిగిందేమీ లేక, ఆ అసంపూర్ణ విగ్రహాలనే ప్రతిష్ఠించారు. 14 ఏళ్ళకొకసారి వాటిని మార్చాలని నిశ్చయించారు. అప్పుడు కూడా క్రొత్త విగ్రహాలు మొదటివాని వలే అసంపూర్ణంగా వదిలేయాలని నిర్ధారించారు.

జగన్నాథుని ఆలయ వైభవం, పరంపర, మహిమలను చూసి శ్రీరామ్ ముగ్ధులయ్యారు. అక్కడి ప్రసాద వితరణ వ్యవస్థ అన్నింటికన్నా ఎక్కువ ఆనందింపజేసింది. 1936-37 కాలంలో తక్కువ కులస్తులను గుడి చుట్టుపక్కలకు కూడా రానివ్వని ఆ రోజుల్లో ఇక్కడ మాత్రం ఎలాంటి భేదభావాలు చూపకుండా దర్శనం చేయనిచ్చి, ప్రసాదం పంచడం చూస్తే మనసు పులకిస్తుంది. సమాజంలో ఆరోగ్యమైన పరంపరలు, అలవాట్లకు ప్రాముఖ్యతనిచ్చే కార్యకర్తలు, మనీషులకు ఇదొక ఆదర్శవంతమైన ఉదాహరణ.

గుండిచా మందిరం, కపాల్ మోచన్ చూసుకుంటూ శ్రీరామ్ శంకరమఠాన్ని చేరుకున్నారు. పూరీమందిరం బైటికొచ్చి సముద్రతీరం వైపు వెళ్ళి పక్కకు తిరిగితే శంకరమఠం వస్తుంది. ఇది ప్రపంచప్రఖ్యాతిగాంచిన మఠం. ఆదిశంకరాచార్యులు

**చదువు ఒక్కటే సరిపోదు**

స్థాపించిన నాలుగు మఠాలలో గోవర్ధనపీఠం గొప్పతనం గురించి ఆర్షసంస్కృతి కాస్తంతైనా తెలిసున్నవారెవరైనా వినే ఉంటారు. శ్రీరామ్ కూడా మఠం గురించి విన్నారు. కానీ దాని పరిస్థితి కళ్ళారా చూసి బాధపడ్డారు. రెండంతస్తుల సాధారణమైన ఇంట్లో నడుస్తున్న మఠాన్ని చూస్తే ఒకప్పుడు తూర్పు భారతంలో సనాతనధర్మ విజయదుందుభి మ్రోగించిన స్థలం అంటే నమ్మలేం.

## మఠానికి పట్టిన దుర్దశ

మఠాధిపతి భారతీకృష్ణతీర్థులవారిని కలవడానికి అనుమతి కోరారు. శంకరాచార్యుల గౌరవప్రతిష్ఠలు గురించి తెలిసిన శ్రీరామ్ ఆయన్ని కలవడం కష్టమవుతుందనుకున్నారు. ఇతర మఠాల్లో అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. అంత పేరు ప్రతిష్ఠలున్నవారు చాలా అభిమానంతో ఉంటారని అనిపించేది. ఇక్కడ పీఠాధిపతి అలా ఉండకపోవచ్చు కాని జాగ్రత్తగా వ్యవహరించాలి అనుకున్నారు. అక్కడున్న ఒక సేవకునితో వర్తమానం పంపమని కోరారు. మఠంలో పెద్దగా సేవకులు లేరు. కొందరు బ్రహ్మచారులే అక్కడ పని చేస్తూ కనిపించారు. మఠం పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నది. ఎన్నో ఏళ్ళుగా రంగులు కూడా వేయలేదనిపించింది. గోడలు ముట్టుకున్నా పెచ్చులు లేచి సున్నం రాలుతోంది.

ఈ పరిస్థితి ఏంటబ్బా అనుకుంటుండగా ఒక యువ సన్యాసి హఠాత్తుగా వచ్చి "రండి, రండి!' అంటూ ఉత్సాహంగా పిలిచారు. తనను మఠాధిపతి దగ్గరకు తీసుకుని వెళ్ళడానికొచ్చిన సన్నిహిత సన్యాసి అయి ఉంటాడనుకుని "నేను శ్రీరామశర్మ. వ్రజక్షేత్రం నుండి వస్తున్నాను. స్వామివారిని దర్శించుకోవాలని వచ్చాను" అన్నారు.

పరిచయం విని సన్యాసి ప్రసన్నులయ్యారు. నాకు తెలుసు అన్నట్టు తల ఊపారు. మీరు కలవదలుచుకున్న మనిషి మీ ముందే నుంచునున్నారు. రండి! లోపలికి రండి! అన్నారు. వింటూనే శ్రీరామ్ స్వామివారి పాదాలకు ప్రణమిల్లారు. విలక్షణమైన నిరాడంబరత, సరళత కనిపించాయి. ఆయన వెనకే వెళ్ళి ఒక గదిలో కూర్చున్నారు. మఠం యొక్క ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉందని మాటలలో అర్థమైంది. చరిత్రలో శంకరమఠాన్ని ఎంతో గర్వంగా ఉటంకిస్తారు. వారి యోగదానాన్ని పొగుడుతారు. కానీ వాటి పరిస్థితిని బాగు చేసేందుకు ఏ ప్రయత్నం చేయరు.

గోవర్ధనమఠం దగ్గర లెక్కలేనంత సంపద ఉంది. రాజులు, సామంతులు, శ్రీమంతులు ధార్మిక సంస్థలకు ఉదారంగా విరాళాలిచ్చేవారు. అలా పేరుకున్న అనంత సంపద మఠానికి ఏమాత్రం ఉపకరించలేదు. అదంతా కాగితాలకే పరిమితమైంది. వాటి నిర్వహణ బాధ్యత అప్పగించినవారే దానిని కబ్జా చేశారు. ఇప్పుడు 4 ఎకరాలు మాత్రం మిగిలింది. అది కూడా కౌలుకివ్వడం వల్ల వచ్చిన రాబడిలో సగమో, మూడో వంతో మాత్రమే మఠానికి చేరుతుంది.

అన్ని వివరాలు తెలుసుకుని, మనుష్యుల ఇష్టారాజ్యానికి కారణమేమై ఉంటుంది అని శ్రీరామ్ అన్నారు. ఆశ్రమంలో సమర్పిత కార్యకర్తల లోటు అందుకు కారణం కాబోలు అన్నారు. స్వామి–'లేమి' కాదు కదా, అసలు కార్యకర్తలే లేరు. మహా అయితే ఏడు, ఎనిమిది మంది బ్రహ్మచారులుంటారు. ఆ పిల్లలకి కూడా అధ్యయనానికే సమయం సరిపోతుంది. ఐనా అంత చిన్న పిల్లలు ఏం చేయగలుగుతారు."

శ్రీరామ్ "ఆ పిల్లల తల్లిదండ్రులను సహకరించమని మీరు అడగవచ్చు కదా" అన్నారు.

స్వామి "అది కుదరదు. వారివి పేద కుటుంబాలు. ఇల్లు గడవడమే కష్టం. ఆ బ్రాహ్మణుల శిక్షణ భారం కూడా ఆశ్రమం మీదే."

శ్రీరామ్ ''ఐతే సమాజంలోకి వెళ్ళి సహకారాన్ని కూడగట్టుకోవటం కుదురుతుందా?"

స్వామి "అందుకు కూడా కార్యకర్తలు కావాలిగా. నేనే స్వయంగా కూడా భిక్షకు వెళ్ళవచ్చు. కానీ ఆదిశంకరాచార్యుల వారు ఏర్పరిచిన క్రమశిక్షణ అందుకు అనుమతించదు. ఇక్కడికి వచ్చినవారు చేసే సహాయాన్ని స్వీకరిస్తాము. దానితో ఆశ్రమం రోజూవారీ అవసరాలు సమకూరుతాయి."

చర్చల వల్ల ఏ పరిష్కారం రాలేదు. పరంపరా గతమైన ధార్మికసంస్థల్లో ఆలోచనలు లోపిస్తున్నాయని భావించారు శ్రీరామ్. ప్రజలకు ఉపయోగపడే పనులేవీ జరగవు కాబట్టి సమాజం దృష్టి వాటి మీద పడదు. వారికి శక్తి కూడా ఉండదు. అసాధారణ తపస్సు, విద్వత్తు ఉన్నా కూడా మఠాధిపతులు, ఆచార్యులు, మహాత్ముల ప్రభావం నేరుగా సమాజంపై పడదు. శంకరమఠానికి అంతటి గౌరవప్రద చరిత్ర ఉన్నా కూడా– ఇంత దయనీయస్థితిలో ఉన్నదే అని ఆలోచిస్తూ పూరీ నుండి బయల్దేరారు. గోవర్ధనమఠం, జగన్నాథ మందిరాల పరిస్థితికి కారణాలేమిటో అని ఆలోచిస్తూ ముందుకు సాగారు.

– *అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**చిన్న విషయమే కదా అని దేనిని తీసుకోకండి**

సూక్ష్మీకరణ సాధన - 13

# పరోక్షజగత్తు యొక్క విధివ్యవస్థ-తథ్యంతో కూడిన ఆధారాలు

సృష్టియొక్క నియతి వ్యవస్థా జీవన సృజన మాత్రమేకాక వాటి నిర్వహణకొరకు అన్న వనస్పతులు, జలవాయువు మొదలగు అనేకమైన వాటియొక్క ప్రచర భాండాగారము మానవ సముదాయముల కొరకు ఉపలబ్ధము అయ్యేటట్లు చేసింది. ఏ సాధనముల ఆధారంగా మనము జీవించి ఉన్నామో, ఇంకా అనేకానేక కర్తవ్యములను నిర్వహిస్తున్నామో అవి మన పురుషార్థంతో చేయబడలేదు. దైవానుగ్రహం వలన లభించాయి. పురుషార్థము గొప్పదేగానీ, మనకు ఉన్న ఉపలబ్ధులలో పరోక్షంగా అదృశ్య సహాయకుల యోగదానము యొక్క స్థానము మరువకూడదు.

ఇది సామాన్య జీవన వ్యవస్థ విషయము. ఇంతేకాక అనేకసార్లు దృష్టిగోచరమయ్యే సంఘటనలలో అదృశ్యసత్తా యొక్క విశిష్ట సహాయం స్పష్టంగా కనిపిస్తోంది. చాలాసార్లు వాటిని అదృష్టం అని దాటేస్తుంటారు. కానీ లోతుగా పరిశీలిస్తే ఇది అదృష్టం మాత్రమే కాదు అని తెలుస్తుంది. ప్రకృతి వ్యవస్థలో తన నియమాలను కాదని విశేష వ్యక్తి కొరకు, విశేష పరిస్థితులలో, విశేష సహాయం అందజేయబడటం లాంటి అవకాశాలకు తావులేదు.

శాస్త్రాలలో విభిన్న లోకాల వర్ణన లభిస్తుంది. వాటిలో జీవన్ముక్త ఆత్మలు విచారణ చేస్తూ, శరీరధారులు అయిన పృథ్వీవాసులకు సహాయపడుటకు నిరంతరము తత్పరులై ఉంటారు. ఈ లోకాలను భౌతికశాస్త్రము యొక్క ఆయామాలు ఆధారంగా అర్థము చేసుకోలేము. సూక్ష్మమగుట వలన వాటి స్థితి చతుర్థ ఆయామము కంటే దాటి ఉంటుంది. కానీ సాధనా పురుషార్థముతో దివ్యదృష్టిని సంపాదించిన శరీరధారీ సాధకుడు స్వయంగా సూక్ష్మరూపం ధరించి, స్థూలజగత్తులో ఉన్న ఈ విభిన్న ఆయామాల రహస్యమయ లోకాలను చూడగలుగుతాడు. ఇక్కడ సూక్ష్మ ఆత్మలు తమ కర్మానుసారము ఫలాలను అనుభవిస్తాయి. ఆ ఆధారంగానే ఒక నిశ్చిత అవధివరకు అవి అక్కడ ఉండవలసి వస్తుంది. ఇది ఒక సునిశ్చిత తథ్యము.

శాస్త్రానుసారము జననమరణచక్రంలో పరిభ్రమిస్తున్న జీవుడు స్వర్గం-నరకం, ప్రేత-పిశాచ, పితర, క్రిమి, కీటక, పశు, మనుష్య యోనిని పొందుతాడు. ఈ కాలంలో జీవుడు పొందగలిగే గతులను రెండు వర్గాలుగా విభజించారు. కృష్ణగతి -శుక్లగతి. వీటినే ధూమయానం-దేవయానం అని కూడా అంటారు. ఛాందోగ్యోపనిషత్తు జీవాత్మ యొక్క విభిన్న స్థితులను గురించి విస్తారంగా వివరించింది. గీతాకారుడు కూడా ఇలా అన్నాడు.

**త్రై విద్యామాం సోమపాః పూతపాపాః**<br>
**యజ్ఞైరిష్ట్వా స్వర్గతం ప్రార్థయంతే**<br>
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోక**<br>
**మశ్నంతి దివ్యాన్ దివి దేవ భోగాన్ -** ***(భ.గీ. 9/20)***

వేదోక్త కర్మకాండలు చేసి, సకామ యజ్ఞముల ద్వారా యజ్ఞభగవానుడి పూజించి, యజ్ఞశేషం యొక్క సోమపానంతో నిష్పాపులై శ్రేష్ఠ వ్యక్తులు స్వర్గం చేరుకుంటారు. ఆ విశాల స్వర్గలోకంలో విభిన్న దేవభోగాలను అనుభవిస్తారు. పుణ్య కర్మలు సమాప్తం అయిపోయాక జీవుడు మరల ఈ మృత్యు లోకం చేరుకుంటాడు. ఇక్కడ యజ్ఞము అనే ప్రాణాగ్ని స్ఫురణం, వ్యక్తిత్వ ఉదాత్తీకరణ, భజన ప్రక్రియలాంటి కర్మకాండలు అనివార్యమైనా ప్రధానం కావు.

అధ్యాత్మికవేత్తలు, సూక్ష్మదృష్టి సంపన్నులు పృథ్వి మీద కూర్చునే ఉండి, అన్ని లోకాలను చూస్తూ అక్కడ నివసిస్తున్న సూక్ష్మ ఆత్మలతో సంపర్కము పెట్టుకొనగలరు అని తెలుపుతున్నారు. ఇంతేగాక కొన్ని'సూక్ష్మసత్తాలు' అంతరిక్ష లోకాలలోనేగాక, పృథ్వి మీద కూడా నివసిస్తూ ఉంటారు. వారు తమ వైపునుండి పృథ్వీవాసులతో సంపర్కము స్థాపించు కొనుటకు పూర్తి ప్రయత్నము చేస్తారు. కానీ సూక్ష్మజగత్తు గురించి తెలియని మానవ సముదాయము భయం వలన సంకోచించినా, సూక్ష్మదర్శనము చేయగలిగే సాధకులు, వారి పూర్తి సహకారము పొంది, స్వయంగానే కాక సమస్త జీవధారీ సముదాయాలకు పరోక్ష వైభవంతో, లాభాన్వితులను చేస్తారు.

**ఒక చిన్న రంధ్రమే పెద్ద ఓడను ముంచివేస్తుంది**

థియోసఫీ సముదాయానికి మరణోత్తర జీవితము మీద పూర్తి విశ్వాసమున్నది. వారి ప్రకారము జీవాత్మ నిరంతర వికాస ప్రక్రియకు లోనవుతుంది. ఈ బృహత్కార్య నిర్వహణలో స్రష్టకు సహకరించటానికి అతి గొప్ప సూక్ష్మశరీరధారులైన ఆత్మల సంఘమున్నది. వారుండు ఆ దుర్గమక్షేత్రంలోకి స్థూలశరీరధారులు సామాన్యంగా ప్రవేశించలేరు. కానీ తమ శ్రేష్ఠ కర్మల ఆధారంగా సూక్ష్మజీవాత్మలు ప్రవేశించగలవు. పృథ్వి మీద విపత్తు వచ్చినప్పుడు శ్రేష్ఠ వ్యక్తులకు సహకరించటానికి అవి భూమి మీదకు అవతరిస్తాయి.

ముండకోపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**ఏహ్యేహిత తమాహూతయః సువర్చసః**
**సూర్యస్యరశ్మిభిర్ యజమానం వదన్తి,**
**ప్రియాం వాచమభి వదన్త్యోర్యయం ఏషవః**
**పుణ్య సుకృతో బ్రహ్మలోకః॥**

యజ్ఞకర్మల ఫలితంగా దివ్యలోక అధికారిత్వము పొందిన పుణ్యాత్ములకు మృత్యుకాలంలో జ్యోతిష్మతి ఆహుతులు 'రండి-రండి!' అని పిలుస్తూ సూర్యకిరణముల ద్వారా దివ్యలోకాలకు తీసుకొని వెళతాయి. అక్కడ మధురవచనములతో వారికి స్వాగతం పలుకుతారు. ఇటువంటి పుణ్యాత్ములకు దివ్య లోకాలలో ప్రవేశం ఉంటుంది.

ఈవిధంగా శాస్త్రవచనాలలో పరోక్షజగత్తు, అక్కడ ఉండే అదృశ్య ఆత్మల ఉనికి యొక్క సమర్థనము చేసే ప్రతిపాదన లభిస్తుంది. పృథ్విమీద నివసించే శ్రేష్ఠ ఆత్మల ద్వారా వారితో సంపర్కము స్థాపించుకొనబడి ఇరువురి మధ్య ఇచ్చిపుచ్చుకునే క్రమము కూడా తెల్పబడినది. వైజ్ఞానికుల ప్రకారము సూక్ష్మ శరీరధారులలో Ectoplasm అనే ఒక సూక్ష్మపదార్థము ఉంటుంది. అది పదార్థము యొక్క చతుర్థ ఆయామము (Forth dimention) కంటే పై స్థితి. సంభవతః జీవాత్మ దీన్ని ఉపయోగించుకొనే భౌతిక ఆకారం గ్రహిస్తుందనేది అనేక ఉదాహరణల ద్వారా నిరూపించబడినది. దీనిని Personification అని పరామనోవైజ్ఞానికులు (Para psycologists) నామకరణం చేసి అనుసంధానం చేస్తున్నారు.

Martin Gordesser ప్రసిద్ధ భౌతికశాస్త్రవేత్త ఇలా అన్నారు. 'ఈ ప్రపంచంలో నిత్యము వేలాది వ్యక్తుల జీవితంలో ఇటువంటి చిన్నపెద్ద సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని కాకతాళీయంగా అలా (By chance) జరిగాయి అనుకొన్నా, కొన్ని విలక్షణ సంఘటనలను అలా అనుకొనలేం'.

ప్రత్యక్షవాదమునకు ప్రాముఖ్యతనిచ్చే వైజ్ఞానికుల ఎగతాళిని కూడా ఉపేక్షించి పరామనోవైజ్ఞానికులు, భౌతికశాస్త్ర కోవిదులు అనేక సంఘటనలను సంకలనము చేసి విశ్లేషించారు. దీనిని బట్టి ఒక అదృశ్యశక్తి, ఈ సంఘటనలకు ఖచ్చితంగా కారణము అవుతోందని, పరోక్షమైన సహాయములు అందివ్వబడు తున్నాయని గుర్తించారు.

బ్రిటన్‌యొక్క సుప్రసిద్ధ గణితజ్ఞుడు, భౌతికశాస్త్రవేత్త ఏడ్రియన్‌డాబ్స్ అనేక పరీక్షలు నిర్వర్తించి ఈ క్రింది నిర్ధారణకు వచ్చాడు. 'ఈ విశ్వబ్రహ్మాండములో సూక్ష్మసందేశవాహక శక్తిధారలు నిరంతరము ప్రవహిస్తున్నాయి. ఇవి మనిషి యొక్క జ్ఞానేంద్రియములతో సంపర్కము స్థాపించుకొంటాయి. వీటి తరంగదైర్ఘ్యములు సుమారు ఒకే విలువ కలిగి ఉంటాయి. ఆర్థర్ కోస్లర్ తన పుస్తకము The roots of coincidenceలో డా॥ డాబ్స్‌యొక్క పై అభిప్రాయము గురించి తెలుపుతూ ఇలా అన్నాడు. ' వేనిద్వారా బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్న అదృశ్యశక్తులు శరీరధారి మనుష్యులతో సంపర్కం స్థాపించుకొని భవిష్యత్తు గురించి తెలుపుతూ, ఆపదకాలంలో మనోధైర్యాన్ని పెంచగలిగే ఉత్కృష్ట ఆలోచనలను అందిస్తాయో; వారిని అదృశ్య సహాయకులు అనవచ్చు. సంభవతః ఉచ్చస్థరీయ సహాయము చేసే ఆత్మలు సూక్ష్మజగత్తుకి, ప్రత్యక్షజగత్తుకి మధ్య వారధిగా వాటిని ఉపయోగిస్తాయేమో.

అనేకమంది వ్యక్తులకు తమ ప్రయత్నాలకంటే మించిన లాభాలు లభించడము గమనిస్తాము. వాటిని దైవానుగ్రహంగా పూర్వపుణ్యంగా లేక వైజ్ఞానికుల భాషలో కాకతాళీయంగా జరిగాయి అంటారు. ఎందువల్లనంటే ఇక్కడ వ్యక్తియొక్క ప్రయత్నానికి, లభించిన ఫలితానికి ఏవిధమైన సంబంధము కనిపించదు. వీరుకూడా అంత ఫలితము వస్తుందని ఆశించి ఉండరు. మరి ఇటువంటి ఫలితాలకు ఏమని కారణము చెప్పగలము? ప్రయత్నానికి మించి, ఆశించని-ఊహించని అద్భుత ఫలితాలు వచ్చినప్పుడు పురుషార్థాన్ని బట్టే ఫలితము అనే సార్వత్రిక సిద్ధాంతము ఏమైనట్లు?

**తప్పు చేయని మనిషి ఎవరు ఉండడు**

నిజానికి అదృశ్యజగత్తు తనలో తాను ఒక అలౌకికమైన, విలక్షణమైన, రహస్యమైన లోకము. మన దృశ్యమాన జగత్తు లోని నీహారికలు, సౌరమండలము, బ్రహ్మాండము కంటే అద్భుతమైనది. మానవునికి తనదైన ఒక జగత్తు, ఒక సామాజిక వ్యవస్థ ఉన్నది. అదేవిధంగా జలచరులు, సూక్ష్మజీవులు, పరాన్నభుక్కుజీవులు, క్రిమికీటకాలు, Virus, Bacteria మొదలగువానికి వాటి-వాటి విలక్షణమైన లోకాలు ఉన్నాయి. కంటికి కనిపించని అదృశ్యలోకాలలో మరణోత్తర జీవితావధి (Life span) ఉన్న జీవనధారులకు కూడా ఇలాంటి వ్యవస్థే ఉన్నదనే ప్రమాణాలు, ఉదాహరణలు తరచు లభిస్తూనే ఉన్నాయి. పితరులు-అదృశ్య సహాయకులు ఇక్కడ నివసిస్తూ తమకు నిర్ధారించబడిన కాలాన్ని గడుపుతారు. సమయమాసన్న మైనపుడు సమాన గుణ, ధర్మములు గల ఆత్మలతో సంపర్కము స్థాపించుకొని స్నేహ, సౌజన్య, సహకారముల శృంఖల ఏర్పరచుకొంటారు. పితరగణాలు తమ స్థూలజీవితకాలంలోని శ్రేష్ఠతను మరణోత్తరకాలంలో కూడా ఇతరులకు ఉపయోగపడే రీతిగా గానీ, సహాయపడుటకు కానీ అనుకూల హితము చేకూర్చే పరిస్థితులు ఏర్పరచటానికి తమ సూక్ష్మశక్తులను వినియోగిస్తారు. ఆత్మకు సంబంధించిన ఈ అధ్యాయము రహస్యపూర్ణమైనదేకాక పరిశోధించవలసినది కూడా.

అదృశ్యలోకముల గురించి చర్చ వచ్చింది గనుక ప్రసంగానుసారము ఒక విషయము స్పష్టంగా చెప్పవలసి ఉన్నది. ఏ శరీరధారియైనా తన సాధనా పరాక్రమములతో కేవలము తన ప్రచండ ఇచ్ఛాశక్తి ద్వారా సూక్ష్మలోకాలలో అన్ని వైపులకు పరిభ్రమణము చేస్తూ అక్కడ నివసిస్తున్న ఆత్మలతో సంపర్కము స్థాపించుకొనగలుగుతాడు. సూక్ష్మ శరీరాన్ని సక్రియము చేసుకున్నప్పటికీ సాధకుని సామాన్య స్థూలశరీరములో ఏవిధమైన తేడా కనిపించదు. వేషభాషలలో, జీవనచర్యలో ఏవిధమైన మార్పు తీసుకురాకుండానే వారు తమ సూక్ష్మశరీరముతో విభిన్నలోకాలలో రాకపోకలు ఏవిధమైన అవరోధము లేకుండా చేస్తూ ఉండగలరు. సూక్ష్మీకరణ సాధన ద్వారా ఈ ప్రయోజనాన్ని సాధిస్తారు. సాధువుల, మహామానవుల, ఋషుల యొక్క అస్తిత్వము వందలాది సంవత్సరములు వారియొక్క ఈ స్వరూపము వల్లనే ఉంటుంది. ఆలోచనాతరంగములతో నిర్మించబడ్డ సూక్ష్మ శరీరము ఈవిధంగా అనంతకాలంతో పాటు కొనసాగుతుంది. కాలానుసారము మానవ పురుషార్థమునకు అతీతమనిపించే విషమ సమస్యలు నివారించబడుట లేక కంటికి కనిపించని వరదానాల పరంపర యొక్క మూలములో స్రష్టయొక్క ఈ విధివ్యవస్థ పనిచేస్తుంది. అవాస్తవము అని లేక కాకతాళీయము అని నెట్టివేసినా నమ్మకమున్న పరిజనులకు దైవానుగ్రహము యొక్క సహాయమును గుర్తించి దానికి కృతజ్ఞత చూపిస్తూ, అదృశ్యంగా ఉన్న పరోక్షము మీద తమ శ్రద్ధను విశ్వాసమును పెంపొందించుకొనుటకు ప్రామాణికమైన ఆధారాలు లభిస్తాయి.

(సశేషం)

## విజయమూలం ఆసక్తి

*"నాయనా! నా మాట కొంచెం శ్రద్ధగా ఆలకించు. నువ్వు చిన్నపిల్లవానివేం కాదు. మంచిచెడులను అర్థం చేసుకొనే వయస్సు వస్తోంది. స్నానం చేశావు కదా! ప్రతిరోజు స్నానం చెయ్యగానే తులసిమొక్కకు నీళ్ళు పొయ్యడమనేది మన దేశంలో పూర్వం నుండి ఆచారంగా వస్తూ ఉన్నది. చక్కగా చెంబుడు నీరు తీసికొని వెళ్ళి పొయ్యి. శుభం కలుగుతుంది" అన్నది తల్లి.*

*పిల్లవాని మస్తిష్కంలో తర్కం తల ఎత్తింది. "అమ్మా! నువ్వెంత పిచ్చిదానివి! తులసి కూడా అన్ని మొక్కలాగానే ఒక మొక్క. ఎక్కడైనా మొక్కలను పూజిస్తారా? వాటిని పూజిస్తే శుభాలు కలుగుతాయా? అన్నీ మూఢనమ్మకాలు" నవ్వుతూ అన్నాడు కొడుకు.*

*"శుభాలు కలుగుతాయా? అంటే కలుగుతాయి. ఆసక్తితో, విశ్వాసంతో చేసిన ఏ చిన్న పని వ్యర్థం కాదు. అసలు మానవుడి బుద్ధి వికసించటానికి శ్రద్ధయే మూల కారణం. శ్రద్ధతో ఏ చిన్న ఉపాసన చేసినా పెద్ద ఫలితాన్ని తప్పక ఇస్తుంది. నా మాట విని నేను చెప్పినట్లు చెయ్యి అన్నది అమ్మ.*

*కన్నతల్లి మాటలకు వశీకృతుడైన కొడుకు ఆనాటి నుండి చివరివరకు తులసి పూజను వీడలేదు. ఆ బాలుడే భారతదేశంలో మహోన్నత ఖ్యాతి గడించిన మన వినోబా భావే! శ్రద్ధయా సత్యమాప్యతే!!*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**మంచి వాళ్ళు మీకు సంతోషాన్ని ఇస్తారు**



దత్త జయంతి ప్రత్యేకం

# దత్తాత్రేయుని 24 మంది గురువులు

జగద్గురువు శ్రీకృష్ణుడు అర్జునుడిని కర్మబంధాల నుండి విడిపించాడు. బ్రహ్మర్షి అయిన వశిష్ఠుడిని శరణువేడిన తరువాతనే విశ్వామిత్రునికి బ్రహ్మజ్ఞానం లభించింది. విశ్వమంతా వ్యాపించి ఉన్న సద్గురుతత్త్వాన్ని ఎలా గుర్తించాలో సిద్ధుడు నామధారకుడికి అవధూతోపాఖ్యానంలో వివరించాడు. శ్రీ శిరిడీ సాయిబాబా వంటి సద్గురువు ఈనాటికీ తన భక్తులకు అనేక అనుభవాలు ప్రసాదిస్తున్నారు. ఈ ఉపాఖ్యానంలో అవధూత యైన దత్తాత్రేయుడు 24 మంది గురువుల నుండి జ్ఞానాన్ని సంపాదించిన వివరాలు పొందుపరచబడ్డాయి. ముముక్షువులైనవారు ప్రతి ఒక్కరు చదివితీరవలసిన అంశాలు ఇందులో ఉన్నాయి.

అది నిర్జనారణ్యం. ఒకానొక సర్వసంగపరిత్యాగి కటికనేలపై నిర్వికారంగా పడుకొని ఉన్నాడు. పురుషార్థాలలో ముఖ్యమైన ధర్మ, అర్థ, కామములు ఏవీ ఆ సన్యాసిని సమీపించడంలేదు. కానీ యయాతి పుత్రుడు యదుమహారాజు అదే అరణ్యానికి వేటకు వచ్చాడు. స్వామిని సమీపించాడు. వినమ్రంగా నమస్కరించాడు. "స్వామీ! సకలము తెలిసిన సర్వసమర్థులు మీరు. మానవ మాత్రులు లేని ఈ అరణ్యంలో ఇంత ఆనందంగా ఎలా గడప గలుగుతున్నారు? మానవ సహజమైన ఎలాంటి కోర్కెలు మిమ్మలను చుట్టుముట్టడం లేదా? మీ ఆనందం వెనుకదాగి ఉన్న రహస్యం ఏమిటి? నా సాహసాన్ని మన్నించి తగిన సమాధానం చెప్పగలరా?" అని ప్రశ్నించాడు.

అప్పుడా అవధూత - "నాయనా! నీ వినయవిధేయతలు నా మనస్సును ఆకట్టుకున్నాయి. లోకశ్రేయస్సుకై నీ సందేహాన్ని తప్పక తీరుస్తారు. శ్రద్ధగా ఆలకించు" అంటూ తన యొక్క జ్ఞానరహస్యాన్ని క్రింది విధంగా విప్పి చెప్పారు.

## ప్రకృతి నేర్పిన పాఠాలు

"నాయనా! నేను ఈ ప్రకృతిలో 24 మంది గురువుల వద్ద పాఠాలు నేర్చుకున్నాను.

**నా మొట్టమొదటి గురువు భూమి:** ఈశ్వరుని ఆజ్ఞానుసారం ఈ చరాచర ప్రకృతిలో కోట్లకుమించిన సంఖ్యలో ప్రాణులు అప్రాణులు ఈ భూమిమీద జీవిస్తున్నాయి. మానవులు తమ తమ జీవిక కోసం భూమిని దున్నుతారు. చెఱువులు, బావులు త్రవ్వుతారు. జీవులన్నీ ఆమె మీద మలమూత్రాలు విసర్జిస్తాయి. ఐనా భూమి ఏమాత్రం సహనాన్ని కోల్పోదు. తనను బాధించినవారికి, మైలపరచినవారికి అందరికీ సమానంగా పాడిపంటలను సమకూరుస్తూ ఉంది. జీవనాధారమైన చల్లని నీటిని ప్రసాదిస్తోంది. ఎవరిమీద పగతీర్చుకునే ప్రయత్నం చేయడంలేదు. వర్షాలకు ఆధారమైన అరణ్యాలు, కొండలు, సముద్రాలు మొదలైనవన్నీ భూమిని ఆశ్రయించుకునే మనగలుగుతున్నాయి. పంటలకు ఆధారమైన నదీనదాలు భూమిపైననే చరిస్తున్నాయి. అదేవిధంగా యోగి కూడా ఎన్ని బాధలు ఎదురైనా ఓరిమితో తన ధర్మాన్ని తాను నిర్వర్తించాలని నేర్చుకున్నాను.

**నా రెండవ గురువు వాయువు:** వాయువు అతి శీతలమైనవాటిని, అతి ఉష్ణమైన వాటిని స్పృశిస్తూ సంచరిస్తాడు. శుచిని-అశుచిని ఏలాంటి భేదభావం లేకుండా తాకుతూ పయనిస్తాడు. సుగంధాన్ని దుర్గంధాన్ని సమానదృష్టితో మోసుకువస్తాడు. సందర్భాన్ని బట్టి ప్రభావితుడై తాత్కాలికంగా మైలపడినా, తక్షణమే నిర్మలుడై పోతాడు. అదేవిధంగా యోగి కూడా సుఖం-దుఃఖం అనే ద్వంద్వాలలో చిక్కుపడకూడదని నేర్చుకున్నాను.

**నా మూడవ గురువు ఆకాశం:** అప్పుడప్పుడు మేఘాలు ధూళి, సంధ్యారాగాల చేత ఆకాశం ప్రభావితం అయినట్లు కనిపిస్తూ ఉంటుంది. కానీ సహజంగా ఆకాశం దేనికీ అంటనిది, లొంగనిది. అంతేకాక ఆకాశం ఆత్మవలే సర్వవ్యాపి. దానియందు కనిపించే వివిధరూపాల చేత వేరు చేయలేనిది. ఎలాంటి మలినములు అంటకుండా పరిశుద్ధమైనదని అర్థం అయింది. యోగి కూడా అదేవిధంగా సత్వరజస్తమో గుణాల వల్ల కలిగే వికారాలకు దూరంగా ఉండాలని నేర్చుకున్నాను.

**నా నాల్గవ గురువు అగ్ని:** అగ్నిదేవుడు ఒకప్పుడు విశేషాగ్నిగా, ఒకప్పుడు మందాగ్నిగా వెలుగుతూ, మరొకప్పుడు నివురు గప్పుకుని సమయం కోసం వేచి చూస్తూ ఉంటాడు. యజ్ఞం చేసేవారి పూర్వపాపాలను హరించడం కోసం ఎవరినుండైనా సరే హవిస్సును గ్రహిస్తాడు. వారి వారి పాపాలను దహిస్తాడు కానీ; తాను మాత్రం అపవిత్రుడు కాడు. అదేవిధంగా యోగి కూడా

చెడ్డవాళ్ళు మీకు అనుభవాన్ని ఇస్తారు

తన తపశ్శక్తిని గుప్తంగా ఉంచుకుంటూ, ప్రజలను పవిత్రం చేయడానికై అందరినుండీ భిక్షను గ్రహిస్తాడు. అగ్నికి సహజంగా రూపం లేదు. కానీ కట్టెను చేరినప్పుడు మాత్రమే మంట, బొగ్గు, మసి రూపాలలో కనిపిస్తుంది. అదేవిధంగా జీవాత్మకు కూడా రూపం లేదనీ, ఐనా రకరకాల దేహాలలో ప్రవేశించి ఆయా రూపాలుగా కనిపిస్తూ ఉంటుందనీ, అలాగే యోగి అగ్నితత్త్వం ద్వారా ఆత్మతత్త్వాన్ని పొందాలని నేర్చుకున్నాను.

**నా ఐదవ గురువు సూర్యుడు:** సూర్యుడు ఒక్కడే అయినా ఒక్కొక్క జీవికి ఒక్కొక్కఘటంలోని నీటిలో ఒక్కొక్క ప్రతిబింబంగా కనిపిస్తాడు. అదేవిధంగా ఆత్మ కూడా ఒక్కటే. శరీరాల భేదం చేత వేరువేరుగా అనిపిస్తుంది. అంతేకాదు సూర్యుడు గ్రీష్మ ఋతువులో తన కిరణాల ద్వారా నీటిని స్వీకరిస్తాడు. వర్షఋతువులో విసర్జిస్తాడు. తన కిరణాల కాంతివల్ల అందరికీ వెలుగును, వేడినీ అందిస్తాడు. ఒకే సూర్యుని వలన కమలాలు వికసిస్తాయి. కలువలు ముడుచుకుంటాయి. అదేవిధంగా యోగికూడా తన జ్ఞానాన్ని ఎవరు గ్రహించినా ఎవరు గ్రహించకపోయినా అందరికీ సమానంగా పంచాలని నేర్చుకున్నాను.

**నా ఆరవ గురువు పావురం:** పరిశీలించాలే గానీ పశుపక్ష్యాదుల్లో కూడా పాఠాలు దొరుకుతాయి. అందమయిన, అనురాగభరితమైన పావురాల కుటుంబం. బోయవాడు పన్నిన వలలో పిల్లలు చిక్కుకున్నాయి. పిల్లల కోసం తల్లిపావురం; భార్య కోసం తండ్రి పావురం రెండూ వెళ్ళి వలలో దూకాయి. యోగి కూడా మమకార వ్యామోహాలతో వినాశనం కొనితెచ్చుకోకూడదని పావురాల జంటను చూసి నేర్చుకున్నాను.

**నా ఏడవ గురువు కొండచిలువ:** కొండచిలువ కదలక మెదలక పడి ఉంటుంది. తనంత తానుగా నోటివద్దకు వచ్చిన ఆహారాన్ని గుటుక్కున మింగి ఊరుకుంటుంది. అది రుచిగా ఉన్నా, లేక పోయినా, చాలినా-చాలకపోయినా దానితోనే సరిపెట్టు కుంటుంది. తృప్తిగా కన్నులు మూసుకుని పడుకుంటుంది. ఏదీ దొరకకపోయినా దైవంపై భారం వేసి నిశ్చింతగా ఉండిపోతుంది. అదేవిధంగా యోగి కూడా శారీరిక వ్యాపారాలన్నింటికి దూరంగా ఉండాలని నేర్చుకున్నాను.

**నా ఎనిమిదవ గురువు సముద్రం:** వర్షఋతువులో నదులన్నీ పొంగివచ్చి సముద్రంలో చేరిపోతాయి. వేసవిలో నదులు ఎండి పోతాయి. సంపద పెరిగినప్పుడు పొంగిపోవడం, తరిగినప్పుడు కృంగిపోవడం సముద్రుడు చెయ్యడు. అన్నివేళలా పరిపూర్ణుడై సుఖదుఃఖాలకు లొంగక చెలియలికట్టను దాటక గంభీరంగా ఉంటాడు. తనలోని ముత్యాలను బయటకు రానీయడు. బయట ఉన్న చెత్త చెదారాన్ని తనలోనికి చేరనివ్వడు. అదే విధంగా యోగి కూడా తన యోగరహస్యాన్ని బయటపెట్టకుండా గంభీరంగా జీవించాలని నేర్చుకున్నాను.

**నా తొమ్మిదవ గురువు మిడత:** మిడత అగ్ని చేత ఆకర్షింపబడి, దానిలోకి దూకి ప్రాణాలు కోల్పోతుంది. అదేవిధంగా యోగి కూడా సుఖసౌఖ్యాలకు, రూపలావణ్యాలకు ఆకర్షింపబడి నశించ కూడదనీ, జ్ఞానమనే అగ్నిలో తన అజ్ఞానాన్ని ఆహుతి చేసుకోవాలనీ నేర్చుకున్నాను.

**నా పదవ గురువు ఏనుగు:** వేటగాండ్రు అడవిలో ఆడఏనుగు బొమ్మను నిలబెడతారు. దానిని చూచి మగఏనుగు భ్రమించి, స్పర్శ సుఖం కోసం దాని దగ్గరకు వెళ్తుంది. వేటగాండ్రచేత బంధింపబడుతుంది. ఆడఏనుగుతో విహరిస్తున్న మగఏనుగు మరొక మగఏనుగుతో పోరాడి చంపుతుంది. అదేవిధంగా యోగి కూడా శారీరిక సుఖం కోసం సంసారబంధంలో చిక్కుకోకూడదని నేర్చుకున్నాను.

**నా 11వ గురువు చీమ:** చీమ ఎన్ని అవాంతరాలు వచ్చినా నిరాశపడక పట్టుదలతో ఆహారాన్ని కూడబెట్టుకుంటుంది. దాన ధర్మాలు చేయకుండా కూడబెట్టిన ఆ ఆహారాన్ని అప్పుడప్పుడు ఇతర ప్రాణులు తినివేస్తూ ఉంటాయి. యోగి కూడా కూడబెట్టడం కోసం ధనార్జన చేయరాదని, జ్ఞానార్జనలో ఎన్ని అవాంతరాలు వచ్చినా నిరంతర కృషితో సాధించాలని నేర్చుకున్నాను.

**నా 12వ గురువు చేప:** చేప జిహ్వాచాపల్యం చేత ఎరకాశించి గాలానికి గుచ్చుకుని మరణిస్తుంది. యోగి కూడా "జితం సర్వం జితే రసే" అన్న ధర్మసూక్ష్మాన్ని తెలుసుకుని- రుచుల పట్ల అనాసక్తుడై, ప్రాణాలను నిలుపుకోవడానికి మాత్రమే ఆహారం సేవించాలని నేర్చుకున్నాను.

**నా 13వ గురువు 'పింగళ' అనే వేశ్య:** ఒకనాటి రాత్రి పింగళ ధనాశతో విటుని కోసం ఎదురుచూసి చూసి విసిగిపోయింది. ఆ విసుగులో ఆమెకు హఠాత్తుగా ఆత్మజ్ఞానం కలిగింది. ఆనాటి నుండి ధన సంపాదన కోసం చేస్తున్న తుచ్ఛమైన వృత్తిని మానివేసి శరీరాన్ని, జీవాత్మను దైవానికే అంకితం చేసింది. అదేవిధంగా యోగి కూడా ధనం-కీర్తి కోసం సిద్ధులను ఆశించకుండా ఆత్మానందాన్ని సాధించాలని నేర్చుకున్నాను.

**దుర్మార్గులు మీకు పాఠాలు నేర్పుతారు**

**నా 14వ గురువు శరకారుడు:** బాణాలను తయారుచేస్తున్న వ్యక్తి తన పనిలో పూర్తిగా నిమగ్నుడై ఉన్నాడు. ప్రక్కనుండి పోతున్న పెద్ద ఊరేగింపును కూడా గమనించలేదు. అదేవిధంగా యోగి కూడా తన సాధనలో ఆత్మనిష్ఠుడు కావాలని నేర్చుకున్నాను.

**నా 15వ గురువు చిన్నారి బాలుడు:** ఆ బాలుడు శరీరం మీద ఏలాటి వస్త్రాలు లేకున్నా నిశ్చింతగా ఆడుకుంటూ ఆనందిస్తున్నాడు. అదేవిధంగా యోగి కూడా మానావమానాలను లెక్క చేయకుండా ఆత్మనిష్ఠలో నిమగ్నుడై ఉండాలని నేర్చుకున్నాను.

**నా 16వ గురువు చంద్రుడు:** కాల ప్రభావం చేత చంద్రుని కళలు వృద్ధి క్షయాలు పొందినట్లు కనిపిస్తూ ఉంటాయి. కానీ నిజానికి చంద్రగోళంలో ఎలాంటి మార్పులు రావు. అదేవిధంగా యోగి కూడా మార్పులన్నీ శరీరానికే అని, ఆత్మకు కాదని చంద్రుడు ప్రతిఫలాపేక్ష లేకుండా చల్లదనాన్ని పంచినట్లు తన జ్ఞానాన్ని ప్రజలకు పంచాలని నేర్చుకున్నాను.

**నా 17వ గురువు తేనెటీగ:** రాత్రంతా ముడుచుకున్న కమలంలో బంధింపబడుతుంది. పూవులు నలగకుండా తేనెను మాత్రమే గ్రహిస్తుంది. గ్రహించిన తేనెను కూడబెడుతుంది. చివరకు ఆ తేనె పరులపాలవుతుంది. అదేవిధంగా యోగి కూడా ఆకర్షణలకు లోనై గృహ బంధాలలో చిక్కుకోరాదని, సకల శాస్త్రాలలోని సారం మాత్రమే గ్రహించాలని, కూడబెట్టడం అనేది పనికిరాదని, చేతులే భిక్షాపాత్రగా - కడుపే కంచంగా జీవించాలని నేర్చుకున్నాను.

**నా 18వ గురువు లేడి:** వేటగాడి సంగీతానికి పరవశించి లేడి ప్రాణాలను పోగొట్టుకుంటుంది. అందువల్ల యోగి లౌకిక విషయాలకు దూరంగా జీవించాలని నేర్చుకున్నాను.

**నా 19వ గురువు గ్రద్ద:** ఒక గ్రద్ద చచ్చిపోయిన ఎలుకను తీసుకుని పోతున్నది. ఆ ఎలుక కోసం కొన్ని కాకులు, గ్రద్దలు గ్రద్దపై దాడిచేశాయి. పాపం ఆ గ్రద్ద వాటితో గెలవలేకపోయింది. ఎలుకను జారవిడిచి తన దారిన తాను పోయింది. అందువల్ల యోగి కూడా లౌకిక సుఖాలకోసం ప్రాకులాడి దుఃఖాన్ని కొని తెచ్చుకోకూడదని నేర్చుకున్నాను.

**నా 20వ గురువు కన్య:** ఒక కన్యను చూసుకోవడానికి మగ పెండ్లివారు వచ్చారు. ఆ సమయంలో తల్లి ఇంట్లోలేదు. వారికి భోజనం పెట్టడానికి ఆ కన్య ధాన్యం దంచుతోంది. చేతి గాజులు శబ్దం చేస్తే వారు వింటారని కన్య ఒక్కొక్క గాజు ఉంచుకుని మిగతావి తీసి దంచింది. అదేవిధంగా యోగి కూడా ఏకాంతంగా సాధన చేయాలని నేర్చుకున్నాను.

**నా 21వ గురువు సర్పం:** పాము స్వయంగా పుట్టను పెట్టుకోదు. చెదలు శ్రమపడి నిర్మించుకున్న పుట్టను విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. చెదలు ఖాళీ చేసిన పుట్టలో పాము నివాసం ఏర్పరచుకుంటుంది. పాము తన జీవనకృత్యాలను ఇతర జీవులకు తెలియనివ్వదు. అదేవిధంగా యోగి కూడా వ్యర్థంగా పడి ఉన్న శిథిలమైన ఆలయాలలోను, ఇతరులు నిర్మించిన మఠాలలోను, చెట్లనీడల లోను నివసించాలని, తన అభ్యాసరహస్యాలను గుప్తంగా ఉంచాలని పాము కుబుసాన్ని విడిచినట్లు శరీరాన్ని స్వచ్ఛంగా వదిలివేయాలని నేర్చుకున్నాను.

**నా 22వ గురువు సాలెపురుగు:** సాలెపురుగు తాను వెడల గ్రక్కిన పదార్థంతో గూడు అల్లుతుంది. కొంతకాలానికి దానిని మ్రింగి వేస్తుంది. అదేవిధంగా యోగి కూడా తన హృదయంలోని సంస్కారాలతో ఉపాధిని పెంచుకుని మరలా అవసానదశలో తిరిగి దానిని అంతర్గతం చేసుకోవాలని నేర్చుకున్నాను.

**నా 23వ గురువు భ్రమర-కీటకము:** తుమ్మెద కీటకాన్ని తెచ్చి గూటిలో పెడుతుంది. ఝుంకారం చేస్తూ దాని చుట్టూ తిరుగుతుంది. ఆ ధ్వనిని వినివిని కీటకం తానే తుమ్మెదగా మారిపోతుంది. ఝుంకారం చేస్తూ ఎగిరిపోతుంది. అదేవిధంగా యోగి కూడా తన గురువుని గురించి ధ్యానించి ధ్యానించి గురువుగా మారిపోవాలని నేర్చుకున్నాను.

**నా 24వ గురువు నీరు:** నీరు సకల ప్రాణులకు దాహం తీరుస్తుంది. చల్లదనాన్ని ప్రసాదిస్తుంది. జడ చేతనాలన్నింటికీ నూతన జీవం పోస్తుంది. ఐనా వినమ్రంగా పల్లం వైపే ప్రవహిస్తుంది. అదే విధంగా యోగి కూడా తనను ఆశ్రయించినవారిని రక్షిస్తూ వినయంగా ఒదిగి ఉండాలని నేర్చుకున్నాను.

అందువల్లనే నేను నిర్జనారణ్యంలో ఉంటూ కూడా అజేయమైన ఆనందాన్ని అనుభవించగలుగుతున్నాను. ఎలాంటి కోరికలు, ఆకర్షణలు నన్ను దరిచేరవు. దాని ఫలితంగానే ఈ నిర్వికార, నిరామయ ఆనందాన్ని పొందగలుగుచున్నాను అని ముగించారు. ఆయనే దత్తప్రభువు.

*(శ్రీ ఎక్కిరాల భరద్వాజ రచించిన శ్రీ గురుచరిత్ర ఆధారంగా)*

★★★

**కష్టాలు వచ్చాయని పారిపోతే బ్రతుకుకు అర్థమే ఉండదు**

# మనల్ని పరిపూర్ణులను చేసేందుకు అవతరించిన దివ్యసందేశమే భగవద్గీత

మార్గశిర శుక్లపక్ష ఏకాదశి రోజున గీత అవతరించింది. ఈ పుణ్యతిథి ఈసారి డిసెంబరు 10 శనివారం రోజున వచ్చింది. గీత కాలాన్ని జయించిన ఒక శాశ్వత ఆలోచనా ప్రవాహము. ఇది భగవానుని పవిత్ర వాక్కునుండి ఆవిర్భవించింది. 5000 సంవత్సరాల క్రితం ఉద్భవించిన ఈ జ్ఞాన ప్రవాహము మానవ జీవిత వికాసమునకు ఒక క్రొత్త ఒరవడిని ప్రసాదించింది. మానవుడు కర్మయోగమును నైపుణ్యముతో చేసే పనిగా నేర్చుకున్నాడు. గీతలో చెప్పబడిన నిష్కామకర్మ మనకు జీవించడమనే సరోత్కృష్టమైన కళను నేర్పిస్తుంది. యోగత్రయము యొక్క పాఠ్యపుస్తకమే గీత. జ్ఞాన, భక్తి, కర్మల విలక్షణ సమన్వయము ఇంత చక్కగా మనకు వేరొక చోట కనిపించదు.

వేదములు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తుల సారాంశమే గీత. ఈ గ్రంథములో 700 శ్లోకములు ఉన్నాయి. విభిన్న ఆర్ష గ్రంథముల యందు వర్ణించిన ఆధ్యాత్మిక సత్యములన్నింటినీ ఎంపికచేసి తయారు చేయబడ్డ పూల గుత్తివంటిది ఈ గీతామాత. అనంతకాలము పాటు విశ్వములో నివసించే వారి హృదయము లను వెలిగించి వారి అంత రంగములో వెలుగులు నింపే దీపమే ఈ గీత.



గాంధీజీ గీతను తన తల్లిగా భావిస్తారు. వినోభాభావే గీతను "గీతాయి" అనే వారు (గీతాయి అంటే గీత నా తల్లి). గీత బిడ్డలకు పాలన-పోషణ చూసుకుంటూ వారిని స్నేహపూర్వకంగా ఆదరించే తల్లి వంటిది మాత్రమే కాక సద్గురువు కూడా. ఈ మహాపురుషులిరువురు ఈ గ్రంథ మాహాత్మ్యాన్ని ప్రజలందరి మనస్సులలోను స్థాపించారు. గీత అన్ని ధర్మగ్రంథాలలోకి మకుటాయమానమైనది, తేజోవంతమైనదని తిలక్ చెప్పేవారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు 'గీతా రహస్యము' అనే గొప్ప గ్రంథాన్ని రచించారు. అనంతకాలం నుండి గీత ఎంతోమందికి ప్రేరణ నిచ్చింది, ఇస్తూనే ఉంటుంది. సృష్టి, స్థితి, లయాలకు సంబంధించి గీత చెప్పని రహస్యము ఏదీ లేదు. ప్రతి అధ్యాయము చివరలో భగవానుడు తనను తాను స్వయముగా పరిచయము చేసుకున్నాడు

**'ఓం తత్సత్ ఇతి శ్రీమద్ భగవద్గీతాః ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే'** అని ప్రతి అధ్యాయం చివరన చెప్తాము. పరమేశ్వరుడిని తత్ సత్ రూపంలో స్మరించడమే ఓంకారము. ఇదే అసలైన స్వరూపము. ఇదే అన్ని ధర్మములలోకి శాశ్వతమైనది. ఈ భగవద్జ్ఞానమే - ఉప మరియు నిషద. ఇటువంటి దివ్యజ్ఞానము కేవలము ఆర్షవాఙ్మయములోనే ఉన్నది. ఇదే బ్రహ్మవిద్య మరియు యోగశాస్త్రము. అన్ని విద్యలకు శీర్షము వంటిదే బ్రహ్మవిద్య-ఆత్మజ్ఞానము. ఇదే జీవనవిధానము ద్వారా మనకు జీవించే కళను నేర్పిస్తుంది. యోగము ద్వారా ఆ పరబ్రహ్మ చేతనత్వంతో మన చేతనత్వంను ఏకత్వము చేసే విద్యకు సంబంధించిన జ్ఞానమును గీత అందిస్తుంది. శ్రీకృష్ణుడు మరియు అర్జునుడి మధ్య జరిగే సంవాదము ద్వారా ఈ దివ్యజ్ఞానము ప్రకటింప బడింది. దీనిని మనకు తెలియచేసే విధానములోనే లోతు, వ్యాపకత రెండూ ఇమిడి ఉన్నాయి. అందుచేతనే గీత ఉపనిషత్తులకు కూడా శిరోధార్యమైనది అని చెప్పారు. ఈ ఉపనిషత్తులో ఆచార్యునిగా - ఉపదేశకుడైన శ్రీకృష్ణుని రూపంలో ఉన్నది స్వయంగా భగవానుడే! శిష్యుడు గాండీవమును ధరించే యోధుడైన అర్జునుడు. ఆచార్యుడైన శ్రీకృష్ణుని జ్ఞానము ఆది, అంతం లేనిది, అనంతమైనది. అర్జునుడు జిజ్ఞాసువు, గురువు పట్ల సందేహమనేది లేని నిష్ఠావంతుడు, సంపూర్ణంగా ఆయనకు సమర్పణ చేసుకున్నవాడు. ఈ ప్రపంచము ఒక కావ్యము వంటిది, ఒక సుందరమైన గానం వంటిదని చెప్పే ఈ గ్రంథము యుద్ధభూమిలో ఆవిష్కరించ బడింది అనేది ఇక్కడ గమనించాలి. మిగిలిన గ్రంథాలు ఏవైనా సరే అడవుల్లోనో, ఋషుల ఆశ్రమాల్లోనో వినిపించబడేవి. ఈ దృష్టితో చూస్తే ఇది చాలా విలక్షణమైనది.

ఎప్పుడు సద్గురువుకు శ్రేష్ఠుడైన, జిజ్ఞాసాపరుడైన శిష్యుడు లభిస్తాడో అప్పుడు బ్రహ్మవిద్య ప్రకటితమౌతుంది. దీని పరిణామమే గీత. సృష్టి మరియు జీవితము యొక్క రహస్యాలన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. ఇందులో యోగమునకు సంబంధించిన రకరకాల

**అన్ని అనుకున్నట్లు జరిగితే అది జీవితం ఎలా అవుతుంది?**

ప్రక్రియలు ప్రకటింపబడ్డాయి. గీతలో ఎక్కడా షట్చక్రాల గురించి కానీ, కుండలినీ-తంత్రము గురించి కానీ ప్రస్తావింపబడలేదు కానీ ఇందులో యోగశాస్త్రముల యొక్క మార్మిక నిగూఢ రహస్యాలు ఇమిడి ఉన్నాయి. దీనిని చాలాలోతుగా తరచి చదివితేనే ఇవన్నీ అర్థము చేసుకోగలుగుతారు. ఉపనిషత్తుల ద్వారా చెప్పబడ్డ ఈ బ్రహ్మవిద్య-యోగశాస్త్రములను నేర్చుకోవాలంటే సాధకుడు శ్రీకృష్ణుని రూపంలో సద్గురువును ప్రతిష్ఠించుకొని, తాను స్వయంగా అర్జునునిగా మారి సంవాదము అనే పరిస్థితి కల్పించగలిగితే అర్థమౌతాయి. అప్పుడు గీత మనకు తన స్వరంతో అన్ని సమస్యలకు పరిష్కారాన్ని సూచించడమేకాక మనకు జీవన విద్యయందలి ఒక్కో రహస్యాన్ని అర్థమయ్యేలా వివరిస్తుంది. గీతా జయంతి పర్వదినము సందర్భముగా మనము ఈ దివ్యజ్ఞానమును గుర్తు చేసుకుందాము.

గీతామాహాత్మ్య ప్రకరణములో ఇలా చెప్పబడివుంది.

**గీతా సుగీతా కర్తవ్యా కిమన్యై శాస్త్ర విస్తరైః ।**
**యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మాత్ వినిఃసృతా॥**

అనగా సాక్షాత్తు కమలనాభుడైన శ్రీకృష్ణభగవానుని ముఖారవిందము నుండి ప్రకటితమైన ఈ గీత సుగీత. ఈ గీతను చక్కగా అర్థసహితముగా స్వాధ్యాయము చేసుకుంటూ గానము చేయాలి. గీత మనకు ఉండగా మిగిలిన శాస్త్రములను వివరంగా తెలుసుకున్నా అధిక ప్రయోజనం లేదు.

**సర్వోపనిషదో గావోదోగ్ధా గోపాలనందనః ।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతమ్ మహత్॥**

సంపూర్ణ ఉపనిషత్తులన్నీ గోవుకు సమానము. గోపాల నందనుడైన శ్రీకృష్ణుడు పాలిచ్చే గోవు, ఆయన వద్ద గీతామృతమనే పాలను త్రాగే అర్జునుడు గోవత్సము. శుద్ధబుద్ధి కలిగిన శ్రేష్ఠ మానవులే దీని భోక్తలు కాగలరు.

నిజానికి ఈ శాస్త్రము చాలా మహిమ కలది. శ్రీరామకృష్ణ పరమహంస ఇలా చెప్తారు - 'మిగిలిన గ్రంథాలన్నీ అబద్ధాలు కావచ్చు. ఎందుకంటే అవి మానవుల ద్వారా రచించబడినవి. కానీ వేదములు, ఉపనిషత్తులు, గీత భగవానుని వాక్కు. ఆయన ఎన్నడు అసత్యాలు చెప్పడు.'

మహాభారతంలో యుద్ధము జరగడానికి సిద్ధంగా ఉంది. ద్వేషము, ఈర్ష్య, క్రూరత్వము చరమదశకు చేరుకున్నాయి. ఆ స్థితిలో గీతాజ్ఞానము అక్కడ అవతరించింది. అది కౌరవ-పాండవుల మధ్య జరుగుతున్న యుద్ధము కాదు, ధర్మము-అధర్మములకు మధ్య జరుగుతున్న యుద్ధము. అధర్మము అనగా అపసంస్కృతి, ఆసక్తి, తృష్ణ, అహంకారము, రాక్షసగుణములు. ధర్మము అనగా అనాసక్తి, ఈశ్వరుని పట్ల చరమదశకు చేరిన భక్తి, భాగవతపరాయణులై ఇతరుల కొరకు జీవించగలిగే మానసికస్థితి. గీత జీవితవిధానమును ఎలా మార్చుకోవాలో చెప్తుంది తప్ప; రకరకాల కర్మకాండల గురించి చెప్పదు. ఇది విషాదము నుండి ఉద్భవించినది. ఆత్మశక్తిపై విశ్వాసము ఉంచుకోమని చెప్తుంది. నీ మనస్సే నీకు మిత్రుడు, కానీ ఒక్కోసారి అదే నీకు శత్రువుగా కూడా మారుతుంది. మనస్సును మిత్రునిగా మార్చుకొని ఆత్మబలసంపన్నుడివి కావాలి అని చెప్తుంది. గీత కర్మకాండని దాటిన కర్మయోగము వైపు తీసుకువెళ్తుంది. ఎంత బాగా చేయాలంటే చివరకు అది యోగరూపము దాల్చి అత్యంత శ్రేష్ఠమైనదిగా మారాలి. (యోగః కర్మసు కౌశలం) మనగురించి మనకు, చుట్టూ ఉన్న పరిస్థితులను గురించి, ఇతరులతో మనకున్న సంబంధాల గురించి, పరమాత్మను గురించిన జ్ఞానాన్ని మనకు గీత అందిస్తుంది. జీవితములో భక్తిని నింపుకొని ప్రభు సమర్పిత జీవితమును ఎలా గడపాలో మనకు గీత నేర్పిస్తుంది. గీత ఈశ్వరుని గణిత నియమాలపై సంపూర్ణంగా ఆధారపడి నడిచే ఆదర్శముల సముచ్చయము. ఈశ్వరుని రూపమును మనము ఏ పరిభాషలో చెప్పాలని ప్రయత్నిస్తుంటామో ఆ రూపము గీతది.

ఇంతటి అద్భుతమును ఇచ్చినందుకు వేదవ్యాసులవారికి శ్రీకృష్ణునికి మానవజాతి అనవరతము కృతజ్ఞత చూపించాలి. ఆయన మనకు జీవించేందుకు అద్భుతమైన పొదరిల్లును ఇచ్చాడు. ఇంతటి మహాగ్రంథమును గురించి మనకు గుర్తుచేయడానికే గీతాజయంతి వచ్చింది. గీతయందలి ఏ ఒక్క సూత్రము నైనా జీవితములో పాటిస్తామనే సంకల్పమును తీసుకోగలిగితే జీవితమే మారిపోతుంది. ఎల్లప్పుడు ఎన్నో రకాల సాధనలు చేయాలనే సంకల్పాలు తీసుకుంటుంటాము. కానీ మనోబలము, నిరంతర నిష్ఠ లేకపోవడం వల్ల అవి జావగారిపోతుంటాయి. గీతను నియమంగా స్వాధ్యాయము చేస్తాననే చిన్న సంకల్పము తీసుకుంటే అది మనస్సులోనే తళుక్కుమని, హృదయ స్పందనగా మారిపోతుంది. రండి జన్మశతాబ్ది సంవత్సరమును గీతాపర్వముగా జరుపుకుందాము.

*- అఖండజ్యోతి, డిసెంబర్ 2011*
*అనువాదము: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**ఒడిదుడుకులు ఎదుర్కొంటూ సాగిపోవలసినదే**

# కాశ్మీరు వ్యథను ఎవరు ఆలకిస్తారు?

కశ్యపమహర్షి మరియు సూఫీ ఫకీర్ మీర్‌ల తపోసాధన యొక్క సమ్మిళిత రూపము కాశ్మీరు. భరతమాత యొక్క అందమైన వదనము ఇది. శిరస్సున పర్వతరాజము హిమాలయము కిరీటము వలె శోభిస్తూ ఉంటుంది. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ముఖము మీద మరియు కిరీటము పైన ఇదివరకే తగిలి ఉన్న దెబ్బలు ఇప్పుడు మరింత పెద్దవై భరించలేని బాధకు గురిచేస్తున్నాయి. అందాలకాశ్మీరు మోమున ఈనాడు రక్తబిందువులు చిందుతున్నాయి. కళ్ళు వేదనతో అశ్రువులను వర్షిస్తున్నాయి. వాటి సంఖ్యను ఎవ్వరు లెక్కకట్టడము లేదు. లెక్కపెట్టలేరు కూడా!

ఆ రక్తాశ్రువులు-కన్నీళ్ళు ఆరటము లేదు. ఏవిధము గాను తగ్గుముఖం పట్టడము లేదు. కాశ్మీరు యొక్క ఇట్టి వ్యథాభరిత గాథ ప్రతీ దేశభక్తుని హృదయములో అలజడిని రేపుతూనే ఉన్నది. మరటువంటప్పుడు ఈ మాటలను వ్రాస్తున్న రచయిత యొక్క ప్రాణము ఆ బాధకు ఎలా దూరంగా ఉండగలదు? ఐతే గత కొంతకాలం నుండి ఈ నొప్పి కలిగించే పీడన మరియు వేదన యొక్క తీవ్రత రెట్టింపవుతూపోతున్నది. ఒకనాటి సాయంకాలమున డా॥ చమన్‌లాల్ అనే ఒక కాశ్మీరీ పండితుడు అలా తిరుగుతూ తిరుగుతూ ఇంకోలా చెప్పాలంటే దారి వెతుక్కుంటూ హరిద్వార్ రావటము జరిగింది. గంగా స్నానమాచరించి బ్రహ్మవర్చస్‌కు, శాంతికుంజ్‌కు వచ్చారు.

పాలల్లో కొంచెం సిందూరం కలిసినట్లుగా గౌరవర్ణము; కళ్ళల్లో పాండిత్యపు కాంతులు తొణికిసలాడుతున్నాయి. కానీ ముఖంలో అంతకుమించిన అలసట ఎక్కువగా కనిపిస్తున్నది. లాల్‌గారు తమతోపాటు చాలా పుస్తకాలను మోసుకొచ్చారు. ఆయన వాటిని తమతోపాటే తీసుకెళ్తూ ఉంటారు. మాటల మధ్యన ఆయన కాశ్మీరు యొక్క కథను చెప్పారు. కాశ్మీరు గురించి పుస్తకాలలో చదవటానికైతే చాలా సమాచారమే లభించింది. ఇవాళ-రేపు వార్తాపత్రికలు కూడా కాశ్మీరు గురించి అడపాదడపా ఏదో ఒకటి వ్రాస్తున్నాయి. వార్తాఛానళ్ళు కూడా అప్పుడప్పుడు దాని గురించి వార్తలు ప్రసారం చేస్తున్నాయి. ఐతే చమన్‌లాల్‌గారు కాశ్మీరు గురించి చెప్పిన కథ అక్కడివారు జీవితం మీద ఆశతో ప్రాణాలు అఱచేత పెట్టుకొని బ్రతకాలనే తపనతో చేస్తున్న ఆక్రందనలను, వారి జీవన పోరాటమును ఆవిష్కరించింది. అందులో కాలమెలా గడుస్తుంది అన్న చింత మరియు జరుగుతున్న సమయము పట్ల అప్రమత్తత ఉన్నది. ఈ వ్యాసం చదువుతున్న పాఠకుల హృదయము ఆ భావసంవేదనలతో జోడించబడినచో బహుశా అది దేశ ప్రజల చేతనత్వంగా మారే అవకాశమున్నది.

కాశ్మీరీలు కాశ్మీరును 'కోశూర్' అని పిలుస్తారు. ఈ అందమైన భూభాగము వితస్తా మరియు ఝెలమ్ నదుల ఒడ్డున మరియు భారత్-పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాన ఉన్నది. జమ్ము-కాశ్మీరు రాజ్యము 'జమ్ము-కాశ్మీరు-లద్దాఖ్ అనే మూడు ప్రాంతములుగా ఉంది. మరో రెండు జిల్లాలు పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్నాయి. ఒకటి శుమాలీ ప్రాంతమైతే; రెండవది పాక్ ఆక్రమిత కాశ్మీర్. అలాగే లద్దాఖ్ ప్రాంతములోని అక్సాయిచిన్‌జిల్లాను చైనా ఆక్రమించినది. శ్రీనగర్-బడగామ్-అనన్తనాగ్-పుల్‌వామా-కుప్‌వాడా-బారాముల్లా జిల్లాలు కాశ్మీరలోయ ప్రాంతములో ఉన్నాయి. కాశ్మీరు సుందర హిమగిరి పర్వతశ్రేణీ ప్రాంతము. పిల్-పాంజల్ పర్వత ద్రోణులు జమ్ము ప్రాంతమును పొరుగు దేశమైన పాకిస్తాన్ నుండి విడదీస్తాయి. ఇక్కడ డల్-ఉలర్ మరియు నగీన్ వంటి అందమైన జలపాతములున్నాయి.

అత్యంత పురాతనకాలములో దక్షప్రజాపతి పుత్రిక మరియు శంకరభగవానుని ఇల్లాలుయైన సతీదేవి ఇక్కడ ఉండేదని కథనం! అప్పుడు ఈ లోయంతా నిర్మల జలాలు పరవళ్ళు త్రొక్కుతుండేవి. ఇక్కడ దేవతలకు ఎప్పుడూ కష్టాలను తెచ్చిపెడుతుండే ఒక రాక్షససర్పం ఆవాసముంటూ ఉండేది. దేవతల ప్రార్థనను ఆలకించిన మహర్షి కశ్యపుడు మరియు సతీదేవి దానిని అక్కడినుండి తరిమికొట్టి ఆ లోయలో ప్రవహిస్తున్న జలము నంతటినీ వితస్తా మరియు ఝెలమ్ నదులలోకి మళ్ళించారు. 'సతీసర్' అని పిలువబడిన ఈ ప్రాంతం ఇక అప్పటినుండీ కాశ్మీర్‌గా మారింది. నీలమత్ పురాణంలో ఈ కథ వర్ణించబడినది. సుదీర్ఘ చరిత్ర కలిగిన

**కష్టసుఖాలను, ఎత్తు పల్లాలను దాటుకుంటూ వెళ్ళాలి**

కాశ్మీరును కాలగమనములో మౌర్యులు-కుషానులు-హూణులు-కరకాటాలు-లోహరాలు-మొగలులు-ఆఫ్ఘనిస్తానీయులు-సిక్కులు మరియు డోగరీల రాజవంశీకులు పరిపాలించారు. 'రాజతరంగిణి' అనే పుస్తకములో కల్హణుడు కాశ్మీరు చరిత్ర మరియు దాని అసమాన సౌందర్యమును గురించి ఎంతో మనోహరముగా వర్ణించినాడు.

మౌర్యచక్రవర్తియైన అశోకుడు మరియు కుషానుల సామ్రాట్ కనిష్కుని కాలములో భరతమాతకు తలమానికము వంటి కాశ్మీరు బౌద్ధధర్మము-సంస్కృతులకు కేంద్రబిందువు. ఉజ్జయినిని ఏలిన విక్రమాదిత్యచక్రవర్తి కాలములో తిరిగి ఇక్కడ సనాతనధర్మ ధ్వజము వినువీధిన రెపరెపలాడినది. ఆ తరువాత వచ్చిన లలితాదిత్యచక్రవర్తి ఇక్కడొక సువిశాల జమ్ము సామ్రాజ్యమును స్థాపించాడు. లలితాదిత్యుని కాలములో కాశ్మీరు సనాతనధర్మము-సంస్కృతవిద్యకు కాణాచిగా ప్రపంచ ప్రఖ్యాతి నొందినది. పతంజలిమహర్షి-దృఢబలుడు-వసుగుప్తుడు-ఆనందవర్ధనుడు-అభినవగుప్తుడు-కల్హణుడు-క్షేమరాజ్ వంటి ఆనాటి ప్రఖ్యాతిగాంచిన ఉద్ధండ పండితుల పేర్లు ఈనాటికి సాహిత్యలోకమునకు సుపరిచితమే! కాశ్మీరీల శైవారాధన మరియు శ్రీవిద్యాసాధన మరియు వాటి వైశిష్ట్యము ఆనాడు-ఈనాడు ఎప్పుడూ సుప్రసిద్ధమై పరిఢవిల్లుతూ ఉన్నది! కాశ్మీరు పండితులు ఎన్నో కష్టనష్టాల కోర్చి ఈనాడు కూడా ఆ సాధనలను, విద్యను కాపాడుకుంటూ వస్తున్నారు. లలితాదిత్యుని ఉత్తరాధికారియైన అవంతివర్మ శ్రీనగర్‌కు చేరువున సుసమృద్ధమైన అవంతీపురమును నిర్మించాడు. ఆ శిథిలాలు ఇప్పుడు కూడా ఆ యశోగాథను కళ్ళముందు ఆవిష్కరిస్తున్నాయి. మహాభారతకాలము అనగా ద్వాపర యుగములోని గణపతయార్ మరియు క్షీరభవాని ఆలయములు ఇప్పుడు కూడా భక్తుల కోర్కెలను ఈడేరుస్తున్నాయి.

గిల్‌గిట్‌లో ప్రాచీన పాళీభాషకు చెందిన పాండులిపిలో వ్రాయబడిన శిలాశాసనములున్నాయి. బౌద్ధానికి చెందిన త్రిఖాశాస్త్రం ఇక్కడే ఊపిరిపోసుకుంది. ఈ శాస్త్రం సహిష్ణుత (ఓర్పు)ను దర్శింపజేస్తుంది. 14వ శతాబ్దములో ఇక్కడ సూఫీ మతం వ్యాపించింది. మొత్తంగా చూస్తే కనుక ఋషిపరంపర-త్రిఖాశాస్త్ర రూపములో బౌద్ధపరంపర-సూఫీపరంపర అన్నింటి కలబోత ప్రాంతం కాశ్మీరులోయ. మొగలుల పతనము తరువాత కాశ్మీరు సిక్కుమహారాజైన రంజీత్‌సింహ్ రాజ్యములో కలిసి పోయింది. కొంతకాలము తదుపరి జమ్మును పాలిస్తున్న రాజా గులాబ్‌సింహ్ బ్రిటీష్‌వారితో సంధి ఒప్పందం చేసుకుని కాశ్మీరులోయ పైన తన అధికారమును స్థాపించుకున్నాడు. హరిసింహ్‌రాజు ఈ సంఘటన జరగటానికి ముఖ్యకారకుడు. ఆయన స్వాతంత్ర్యోద్యమ కాలములో కాశ్మీరును భారతదేశములో కలిపివేశాడు. ప్రసిద్ధిగాంచిన మహనీయుడు కర్ణసింహ్ ఈ వంశమునకు ప్రస్తుత వారసుడు.

డా॥ చమన్‌లాల్ కాశ్మీరులోయ యొక్క గడచిన చరిత్రను చెప్పిన తరువాత తనకు మరియు తనతోటి పండిత సముదాయమునకు సంబంధించిన అంశము మీదకు దృష్టిని సారించారు. బాధాతప్త స్వరముతో, రుగ్ధకంఠముతో దానిని ఆరంభిస్తూ ఆయనిలా అన్నారు. 'ఏమి చెప్పను? మా అందరి సమస్యలు స్వతంత్రం వచ్చిన నాటి నుండి ఆరంభమయినాయి. ఈ దేశపు తొలి ప్రధాని స్వయముగా కాశ్మీరు పండితుడే కానీ ఆయన ఆ పండితులను పట్టించుకోకపోవటము నిజముగా ఎంత సిగ్గుచేటైన విషయము. 22.10.1947న పాకిస్తానీ సైన్యముతో పాటు పశ్చిమపాకిస్తాన్‌లో నివసించే కబాలీలు అనే ఓ వర్గం ముజఫ్ఫరాబాద్ మీద దాడిచేసింది. మహారాజు హరిసింహ్ మరియు క్రొత్త ప్రధానమంత్రి మోహన్‌చంద్ మహాజన్ తమకు సహాయం అందించమని పలుమార్లు భారత ప్రభుత్వమునకు మొరపెట్టుకున్నారు. వారి గోడును ఎవ్వరు వినిపించుకోలేదు.

ఈ పాకిస్తానీ సేన ముందుగా కాశ్మీరీ పండితులను ఎందరినో నిర్దాక్షిణ్యముగా హతమార్చినది. కాశ్మీరు బ్రిగేడియర్ రాజేంద్రసింహ్ 250 మంది జవానులతో పాక్ సైన్యమును నిలువరించేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. కానీ అందరు వీరమరణం పొందారు. 24.10.1947న అప్పటి గవర్నర్ జనరల్ మౌంట్‌బాటెన్ రక్షణా మండలి అధ్యక్షుడు. కానీ అతను కాశ్మీరుకు సాయం అందించుటకు నిరాకరించినాడు. చివరకు 1947 అక్టోబర్ 27న సర్దార్ వల్లభాయ్‌పటేల్ భారత్ వైపు నుండి మొదటిసారిగా చర్చలు జరపటానికి సుముఖత వ్యక్తం చేశారు. కాశ్మీరులోయను భారతదేశములో విలీనం చేసే విధముగా దస్తావేజు ఒప్పందం కుదుర్చుకుని విమానాల ద్వారా భారతసేనను కాశ్మీరు తరలించారు.

**ఎవరి జీవితం ఎలా ఉంటుందనేది వారు చేసే పనులను బట్టి ఉంటుంది**

భారతసైన్యం అప్పుడు పాకిస్తాన్ మీద విజయ పరం పరలను కొనసాగిస్తూ వస్తున్నది. దాంతో కబాలీలు ఖదేడేకి పారిపోసాగారు. కానీ దేశ ప్రథమ ప్రధాని 07.11.1947న యుద్ధవిరామమును ప్రకటించాడు. కాశ్మీరుకు చెందిన ముజఫ్ఫరాబాద్-పుంచ్-మీర్పూర్-గిల్గిట్ ప్రాంతములు పాకిస్తాన్ హస్తగతమైనాయి. అప్పుడు మౌంట్బాటిన్ ఈ విషయములో జోక్యం చేసుకోవటంతో కాశ్మీరు సమస్య 'యునైటెడ్ నేషన్స్ కమీషన్ ఫర్ ఇండియా అండ్ పాకిస్తాన్'కు చేరింది. దానితో ఇంటి సమస్య-ప్రపంచ సమస్యగా మారి పోయింది. భీమ్‌రావ్ అంబేద్కర్ మరియు డీ.డీ.బస్ అనే న్యాయమూర్తి వ్యతిరేకిస్తున్నప్పటికీ దేశప్రధాని 370 చట్టమును అమలు చేశాడు. 'కాశ్మీరు విధానసభ ఆమోదం పొందేంతవరకు భారతదేశ ఏ చట్టము ఇక్కడ అమలుకాదు' అని అందులో పొందుపరచబడి ఉన్నది. ఈరకముగా రెండు సభలు, ఇద్దరు ప్రధానులు మరియు రెండు గుర్తింపులు కాశ్మీరుకు లభించాయి. డా॥ శ్యాంప్రసాద్‌ముఖర్జీ దీనిని అభిశంసిస్తూ దేశవ్యాప్త ఆందోళన చేపట్టాడు. ఉద్యమకాలములో ఆయనను కారాగారమునకు తరలించగా అక్కడ ఆయన హత్యకు గురైనాడు.

1947లోను ఆ తరువాత 1965, 1971న వరుసగా మూడుసార్లు కాశ్మీరు పైన పాకిస్తాన్ యుద్ధమును ప్రకటించినది. పరాజయంపాలై; ఇక లాభం లేదనుకొని ఉగ్రవాదుల సహాయమును అర్థించింది. ఉగ్రవాదసంస్థలు కాశ్మీరీ పండితులను భారతదేశమునకు విరుద్ధముగా, ఆ ప్రభుత్వము నకు వ్యతిరేకముగా పోరాడాలని ఒత్తిడి చేయగా వారంతా అందుకు తిరస్కరించారు. అప్పుడు కాశ్మీరు విద్వాంసుల ప్రత్యక్ష నరసంహారమునకు తెరతీశాయి ఉగ్రమూకలు. 04.01.1990 నాడు కాశ్మీరులోయలోని అల్లకల్లోల పరిస్థితిని చూసి ఒక లక్షాయాభైవేలమంది హిందువులు ప్రాణాలు అఱచేత పెట్టుకుని లోయ నుండి పారిపోయారు. అప్పటినుండి ఇప్పటి వరకు కాశ్మీరీ పండితులందరు బ్రతుకు తీపితో ఇటూ అటూ పరుగుపెడుతూనే ఉన్నారు. ప్రభుత్వము వారి గోడును వినిపించుకోవటం లేదు. వార్తాపత్రికలు నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తున్నాయి. అసహనము పేరుతో అల్లరీ ఆగం చేసి దేశం పరువు తీస్తున్న రచయితల వర్గం ఈ విషయములో ఎందుకు మౌనం వహించినదో వారికే తెలియాలి. వారికి కూడా కాశ్మీరీయుల దీనగాథపై ఎట్టి అసహనము కాన రావటం లేదు. మీడియా సంగతి సరేసరి. పెదవివిప్పి ఒక్క ముక్క కూడా ప్రసారం చేయదు. కాశ్మీరు పండితుల ఇక్కట్లను ఏ దేశము వినాలనుకోవటం లేదు.

కొంతకాలం క్రితం దక్షిణాసియాకు చెందిన మీడియా అసోసియేషన్ అభ్యర్థన మేరకు 10 మంది పాకిస్తానీ పత్రికా రచయితల బృందమొకటి భారతదేశములోని జమ్మూ-కాశ్మీర్‌లో పర్యటించినది. ఈ పాకిస్తానీ రచయితలకు ఎట్టి ఆంక్షలు-అడ్డంకులు లేకుండా కాశ్మీరులోని ప్రతీ ప్రాంతమునకు వెళ్ళి చూసేందుకు, అక్కడి ప్రజలతో స్వేచ్ఛగా మాట్లాడి విషయమును ఆకళింపుజేసుకునే అవకాశము కల్పించబడినది. 'న్యూస్‌లైన్' అనే పాకిస్తానీ ఆంగ్లప్రతిక సంపాదకుడైన రెహానాహాకమ్ 'కాశ్మీరీ పండితులు ఒక అసహాయ మరియు అల్పసంఖ్యాక జాతి ప్రజలు. జిహదీ ఉగ్రవాదులతో పాటు పాకిస్తాన్, భారతదేశం మరియు జమ్మూ-కశ్మీర్ ఈ మూడు ప్రభుత్వాలు కలిసి వారిమీద అత్యాచారం గావిస్తూ, అపరాధములకు పాల్పడు తున్నాయి. సాగుతున్న మారణకాండకు అందరూ దోషులే. ఈ ప్రభుత్వాల రాజకీయపరమైన బలహీనత, దుర్నీతి అనే కారణము వేలాది సంవత్సరముల నుండి కాశ్మీరు మాతృ భూమిగా కొనసాగుతూ వస్తున్న ఆ కాశ్మీరు విద్వాంసులను నిరాశ్రయులనుజేసి, శరణార్థులుగా మార్చివేసింది. ఉగ్రవాదుల దాడులకు విరుద్ధముగా భారత ప్రభుత్వము వారికి అవసరమైన సహాయము నందించుట లేదు' అని వ్రాశాడు.

సహనం-అసహనం అని గొంతుచించుకుని అఱచే భారతీయ పత్రికారంగం మరియు రచయితల సముదాయం ఈ కాశ్మీరు పండితుల దుఃఖమును-వ్యథను చూస్తూ కూడా ఏళ్ళ తరబడి మౌనం వహించినదే తప్ప; అన్యాయమునకు విరుద్ధముగా స్పందించలేదు. కనీస మద్దతు కూడా పలుకలేదు. పాకిస్తానీ పత్రికా రచయిత రెహానాహాకమ్ మొదటగా ఈ సమస్య మీద దృష్టిసారించాడు. అతను కాశ్మీరు పండితుల కష్టములను-ఇక్కట్లను-వేదనను మానవీయదృష్టికోణముతో ప్రపంచం ముందుంచాడు. కాశ్మీరు పండితుల వ్యథాభరిత కథలను వెల్లడిస్తూ రెహాన్ "పాకిస్తాన్ పత్రికా రచయితల బృందమైన మేము శ్రీనగర్ ప్రభుత్వ అనుమతితో కాశ్మీరు విశ్వవిద్యాలయము లోని అధ్యాపకులను కలుసుకుని ఇలా ప్రశ్నించాము. మీ

**ఎవరి భవితవ్యానికి వారే బాధ్యత వహించాలి**

విశ్వవిద్యాలయములో ప్రసిద్ధిగాంచిన మరియు యోగ్యులైన అధ్యాపకులు ఉన్నారు. కాశ్మీరు సమస్యను పరిష్కరించుట కోసం మీరెందుకు ముందుకు రావటం లేదు? ఇలా ప్రశ్నించిన మీదట రాజకీయ విశ్లేషకుడైన నూర్‌మొహమ్మద్ ఇలా అన్నాడు. 'మేము మా భూమికను ఎందుకు నిర్వర్తించలేక పోతున్నామంటే విశ్వవిద్యాలయపు విభిన్న విభాగాల సంచాలకులు (ఇన్‌ఛార్జ్‌లు) కాశ్మీరు పండితులే! ఐతే ఉగ్రవాదులు శ్రీనగర్‌లోని వేలాది కాశ్మీరు పండితులను పరమ కిరాతకముగా హతమార్చిన కారణముగా కాశ్మీరు అధ్యాపకులు శ్రీనగర్ విడిచి వెళ్ళాల్సిన అసహాయ పరిస్థితులు ఏర్పడినాయి. అందుచేత మేమేమీ చెయ్యలేము."

నూర్‌మొహమ్మద్ ఇంకా ఇలా చెప్పాడు. 1990 మొదలుకొని నేటివరకు కాశ్మీరీ పండితుల మీద సాగిన అమానవీయమైన నరసంహారం తరువాత మూడులక్షలకు పైచిలుకు కాశ్మీరీ వాసులు ఇల్లు-వాకిలి వదలి దేశదిమ్మరులైపోయారు. ముందస్తుగా కాశ్మీరుపండితులు పలాయనం చిత్తగించేలా ఒక కుతంత్రము రచించబడినది. తత్కారణముగా వేలాది సంవత్సరములుగా వస్తున్న హిందూ-ముస్లిమ్ ఐక్యతాపరంపర చాలా దెబ్బతిన్నది. ఇప్పుడు విశ్వవిద్యాలయ అధ్యాపకులైన పండితులు అనేకమంది వెళ్ళిపోవుటచేత శ్రీనగర్ విశ్వ విద్యాలయం మరియు విద్యార్థుల భవిష్యత్తు తల్లక్రిందులై విద్యావ్యవస్థ పెనుసవాళ్ళను ఎదుర్కొంటున్నది. ఇదే ఇక్కడి చేదు నిజం' అన్నాడు. అంతేకాదు విద్యార్థులకు మరియు విశ్వవిద్యాలయమునకు ఎటుచూసినా సమస్యల కారుమేఘాలే అని చెప్పాడు. 'కాశ్మీరువాసులు ఎల్లప్పుడు తమను తాము కాశ్మీరీయులుగానే తలంచారు. జిహాదీలు సాగించిన క్రూరమైన హింస మరియు దారుణ హత్యాకాండ హిందూ-ముస్లిమ్‌ల మధ్య ఒక అగాధమును ఏర్పరిచినది. తత్పరిణామముగా కాశ్మీరులో ఎటువంటి సామాజిక అసమానత్వము తలెత్తినదంటే దానిని దూరం చేయుట కష్టమైన పనైపోయింది.

కాశ్మీరు పండితుల కుటుంబాలు శ్రీనగర్‌ని వదిలిపెట్టి ఢిల్లీ, ముంబై వగైరా పట్టణములకు తరలిపోయారు. కానీ ఈనాడు కూడా కాశ్మీరు విద్వాంసులు పెద్ద సంఖ్యలో శరణార్థ శిబిరాలలో తలదాచుకుంటున్నారు. పాకిస్తానీ పత్రికా రచయితల బృందం ఈ శిబిరాలకు వెళ్ళినప్పుడు వారికి నినాదాలతో కూడిన సాదరపూర్వక స్వాగతం లభించినది. ఆ కాశ్మీరుపండితులు పాకిస్తానీ బృందమునకు తమ కథను వినిపిస్తూ 'తమ ఈ దుఃస్థితికి పాకిస్తానీయుల జిహాదీ కూటనీతే ముఖ్య కారణము' అని గట్టిగా తేల్చి చెప్పారు. 'పాకిస్తాన్ పన్నిన కుతంత్రం 'మాకు ఇల్లు ఉండి కూడా-లేనివారమై పోయేటట్లు' చేసింది. మేము కులవృత్తి లేదా ఉద్యోగం లేనివారమైపోయాము. దానితో మాకు జీవితమంటే విరక్తి కలిగింది అని అందరు ముక్తకంఠముతో ఒక్క మాటే అన్నారు. అంతేకాదు పాకిస్తాన్ చేసిన కుట్ర వల్లనే కాశ్మీరు పండితులకు నేటి ఈ నిస్సహాయస్థితి దాపురించినది. పాక్ కావాలనే ఉగ్రవాదాన్ని ప్రేరేపించి అంతటా వ్యాపింపజేసినది. ఈ కారణముగానే కాశ్మీరము సైన్యం ఆధీనములో ఉండవలసి వచ్చినది అని వాపోయారు. తామంతా కాశ్మీరులో ఉండటానికే ఇష్టపడుతున్నామని; ఐతే పాకిస్తాన్ ప్రతికారంగం కూడా మా మనోభీష్టమును అర్థం చేసుకోవటం లేదు. అది సైనిక సోదరుల కార్యకలాపాలను గురించి ఉన్నవి లేనివి కల్పించి ప్రపంచానికి గొప్పగా చాటిచెపుతోంది తప్ప నిర్దోషులైన కాశ్మీరీయుల మీద నిరంతరం సాగుతున్న అత్యాచారపరంపరను కనులారా చూసి కూడా చూడనట్టుగా ప్రవర్తిస్తున్నది.

కాశ్మీరు పండిత సదస్సు పానూన్ అధ్యక్షుడు అశ్వనీ కుమార్ కారాంగో ఈ పాకిస్తానీ బృందంతో 'కాశ్మీరు పండితులను అక్కడి నుండి బయటకు తరిమికొట్టెయ్యాలి. కాశ్మీరువాసులు హిందువులు-ముస్లిమ్‌లు అను రెండు వర్గములుగా విభజించబడాలి అన్నదే పాక్ దురుద్దేశ్యము. అంతేకాకుండా పాక్ ఆక్రమిత కాశ్మీరులో ముజఫ్ఫరాబాద్‌లో కాశ్మీరీ పండితులు ఆరాధించే చారిత్రాత్మక శారదామందిర కట్టడ పునర్నిర్మాణము మరియు దేవతా విగ్రహాల పునః ప్రతిష్ఠతో పాటు సంరక్షణ చర్యలు కూడా చేపట్టాలి' అన్నది తమ అభిలాషయని చెప్పారు. కాశ్మీరు పండిత సదస్సు పానూన్ యొక్క ఒక సభ్యుడైన విష్ణుప్రసాద్ 'కాశ్మీరు పండితులు కాశ్మీరు లోయను విడిచిపెట్టి వెళ్ళిపోవాలి' అన్నది పాకిస్తాన్ ఉద్దేశ్య పూర్వక కుతంత్రము. రాత్రివేళ జిహాదీవర్గం మా ఇళ్ళ ముంగిలి గోడలపై-'కాశ్మీరును వదలి వెళ్ళిపోండి లేదా చావుకు సిద్ధపడండి' అంటూ కరపత్రాలను అతికిస్తారు అంటూ చెప్పుకొచ్చాడు.

**ఇతరులపై నిందలు వేయటం సరికాదు**

గ్రామాలలో తగినంత రక్షణవ్యవస్థ లేనందున వేలాది మంది కాశ్మీరువాసులు ఒక్క వారంలోపే తమ ఇంటిని విడిచి పెట్టి శరణార్థ శిబిరాలను ఆశ్రయించారు. ఉద్యోగం లేనందున పిల్లల చదువుసంధ్యలు, పెళ్ళిపేరంటాలు ఏమీ జరగటం లేదు. ఏదో కొద్దిగా చదువుక్కున్నవారికి కూడా ఉద్యోగం దొరకటం లేదు. కాశ్మీరుపండితుల కన్నీటిగాథ పాకిస్తాన్ పత్రికా రచయితల బృందసభ్యులైన నాదిర్‌నక్స్, షాహిద్‌హుస్సేన్, నూరాహుస్సేన్, తారిక్ అన్వర్‌ల హృదయాలను కదలించి వేసింది. 'భారత– కాశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదమనే నిప్పును రాజేసింది. బహుశా ఈ పరిణామం వల్లనే కాబోలు ఈనాడు పాకిస్తానంతా కూడా స్వయముగా ఆ ఉగ్రవాదమనే అగ్నికే ఆహుతైపోతున్నది' అని అన్నాడు నాదిర్. పాకిస్తాన్ మొదటి నుండి అస్థిరత దిశగానే సాగుతూ వస్తున్నది. కనుక అది కాశ్మీరులోయను అట్టుడికించటం మానివేసి బలూచిస్తాన్, సింధు, పఖ్తున్, పంజాబ్‌ల బాగోగులు చూసుకోవాలి' అని స్పష్టపరచాడు నూర్‌హుస్సేన్.

కాశ్మీరులోయ యొక్క గత–వర్తమానకాలాల చరిత్రను చెపుతూ డా॥ చమన్‌లాల్‌గారు ఒక నిట్టూర్పు విడిచి ఇలా అన్నారు. 'కాశ్మీరు పండితులమైన మేమంతా ఈనాడు ఒక్కపూట భోజనానికై అలమటించిపోతున్నాము. ఎప్పుడో ఒక్కనాడు మాత్రం మా ఇళ్ళల్లో విందు భోజనపు ఆనందం వెల్లివిరుస్తుంది. ఋతువులకు అనుగుణముగా వచ్చే కూరగాయలతో పాటు రాజ్మా దినుసులు–వంకాయ వంటి తాజాకూరగాయలతో వండిన శాఖాహార భోజనమును ఎక్కువగా తింటుంటాం' అని అన్నారు. మాటల్లో మాటగా ఆయన 'నేను అఖండజ్యోతి మాసపత్రిక చదువుతాను' అని చెప్పారు. కాశ్మీరు విహార యాత్రకు వచ్చిన ఒక పర్యాటకుడు లాల్‌గారికి అఖండజ్యోతి పత్రికను ఇచ్చారట. స్వామి వివేకానంద కాశ్మీరుకు వచ్చి నప్పుడు ఆయన పూర్వీకుడు ఒకాయన వివేకానందులను కలిశారట. వివేకానందులతో కలిసి ఆయన క్షీరభవాని ఆలయము మరియు అమర్‌నాథ్‌లను దర్శించారట.

తమ గతకాలపు స్మృతుల ప్రవాహమును అవలోకిస్తూ దాని నుండి బయటికొచ్చి లాల్‌గారు '21వ శతాబ్దిలో ఉజ్జ్వల భవిష్యత్తు వస్తుందని నేను అఖండజ్యోతి మాసపత్రికలో చదివాను. కాశ్మీరులోయకు మరియు కాశ్మీరు పండితులకు సైతం మంచిరోజులు వస్తాయని నా ప్రగాఢ నమ్మకము. కాశ్మీరులో పూర్వవైభవము తిరిగి వెల్లివిరుస్తుంది. ఆపిల్‌పళ్ళు వచ్చే కాలములో తోటలన్నీ ఎఱ్ఱని ఆపిల్‌పళ్ళతో కనువిందు చేస్తుంటాయి. చలికాలంలో అన్నివైపులా మంచు దుప్పటి పరచుకుంటుంది. శిశిరఋతువు ఆరంభమౌతూనే పచ్చపచ్చని చినార్‌చెట్టు సువర్ణమయ సౌందర్యము చూచేవారి మనస్సును కట్టిపడవేస్తుంది. కాశ్మీరు పండితులంతా భవిష్యత్తులో మరల తమదైన అటువంటి అందాల కాశ్మీరుతో పాటు తమ శోభాయ మానమైన జీవితము తిరిగి పల్లవించి తమ జీవితాలు ఉజ్జ్వలంగా ఉంటాయని ఆశిస్తున్నారు. వారి యొక్క ఈ నమ్మకముతో పాటు మన గాయత్రీపరిజను లందరం కూడా మన ప్రార్థనలకు పురుషార్థమును జోడించి మనదైన కాశ్మీరు పునర్వైభవమునకు నడుం బిగిద్దాం! రండి! ఈ నవకాశ్మీరు నిర్మాణానికై చేయి కలిపి పనిచేద్దాం!

*– అఖండజ్యోతి, నవంబరు 2016*
*అనువాదం: లక్ష్మీరాజగోపాల్*

## అవినీతి అంతానికై పరాక్రమం

*జస్టిస్ మహాదేవ గోవింద రానడే రైలు ప్రయాణం చేస్తూ ఉండగా ఒక స్టేషన్‌లో రైలు చాలాసేపు ఆగటం వలన, ఆయన క్రిందకు దిగి మిత్రునితో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఇద్దరు బ్రిటిష్‌వారు వచ్చి రానడే సామాన్లు ఫ్లాట్ ఫారం మీదకు విసిరివేసి ఆయన సీటుని ఆక్రమించారు. వాళ్ళ అహంకారం ఆ రోజుల్లో హద్దుమీరి ఉండేది. రానడే శాంతంగా పరిస్థితిని చక్కచేయాలని, వారి తప్పు వారు తెలుసుకొనేటట్లు చేయాలని ప్రయత్నించి అది విఫలం కావటంతో, తక్షణం వెళ్ళి రైల్వే అధికారుల్ని, పోలీసుల్ని పిలుచుకొని వచ్చారు. ప్రధాన న్యాయాధీశుని సీటుని కూడా ఈవిధంగా ఆక్రమించే అహంకారులు సాధారణ మానవుల పట్ల ఇంకా ఎంత నికృష్టంగా ప్రవర్తిస్తారోనని అధికారులు, ప్రయాణీకులు, వారికి తగిన విధంగా బుద్ధి చెప్పారు. గత్యంతరం లేక ఆ ఇద్దరు నోరు మూసుకొని, బండి దిగి పారిపోయారు. సజ్జనత్వం చాలా గొప్పదే. కానీ దాని విలువ తెలియనిచోట అవినీతిని అంతం చేయటానికి ప్రతి ఒక్కరు పరాక్రమాన్ని చూపించి తీరాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ముళ్ళపొదల వలే జీవితాన్ని నందనవనంలాగా మార్చుకోవచ్చు**

# అయోమయంలో పడేస్తున్న పరిస్థితులు

20 వ శతాబ్దములో విజ్ఞానము (science), భౌతిక వాదము (materialism) పరాకాష్ఠకు చేరుకున్నాయి. వీటి వలన సుఖసాధనములకు క్రొత్త ద్వారాలు తెరుచుకోవడమే కాక, భౌతిక పరిస్థితులను అర్థము చేసుకొని, వాటిని ఉపయోగించుకునే బుద్ధి కూడా వికసించింది. కానీ వీటి దురుపయోగము వలన **ఈ యుగపు పై రెండు చమత్కారములు** లాభము కలుగజేయుటకు బదులు క్రొత్తక్రొత్త ప్రమాదాలను, సమస్యలను, విపత్తులను తెచ్చిపెడుతున్నాయి. తయారుచేసిన సామాగ్రిని (ఉత్పాదనలను) అమ్మి సొమ్ముచేసుకొనుటకు ఆర్థిక వలసవాద పరంపర ఉత్పన్నమైనది. యుద్ధములు ప్రోత్సహింప బడ్డాయి. ఎందువల్లనంటే ఎక్కువగా తయారైన ఉత్పాదనలు అందులో ఖర్చవుతాయి కదా! పెద్దపెద్ద పరిశ్రమలు నిర్మించ బడ్డాయి. అందువల్ల కుటీరపరిశ్రమలపై ఆధారపడి జీవించే వారు బ్రతుకుతెరువు కోల్పోయారు. పని లభించక నేడు చాలా మంది అతిపెద్ద సంఖ్యలో నిరుద్యోగులుగా ఉన్నారు. పరిస్థితులు రోజురోజుకు దారిద్ర్యరేఖ కంటే క్రిందికి దిగజారుతున్నాయి. కొంతమంది ధనవంతుల వద్ద ధనము ఏకత్రితమవుతున్నది!

వాహనములు, కర్మాగారాల వలన నిరంతరము వెదజల్ల బడే విషవాయువులు వాయుమండలమును విషపూరితం చేస్తున్నాయి. వాటిలో ఉపయోగించబడే ఖనిజాలు, ఇంధనాలు ఎంత వేగంగా మండించబడుతున్నాయంటే; ప్రపంచములోని ఖనిజభాండారము ఇంకొక 100 సంవత్సరాల వరకు ఉంటుందా? ఉండదా? అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ధాతు రసాయనిక సంపదలు పృథ్వి నుండి త్రవ్వి వెలికితీయుట వలన ఆ సంపదల కొరత ఏర్పడుతోంది. దీనివలన పృథ్వి యొక్క **మహత్త్వపూర్ణ సామర్థ్యం** తగ్గి పృథ్వి యొక్క ఉత్పాదనలపై ఆధారపడే అనేక ప్రాణులపై దుష్ప్రభావము పడుతున్నది. పెరుగుతున్న పట్టణాల, కర్మాగారాల యొక్క వ్యర్థపదార్థములు జలాశయాలలో కలవడంతో ఆ నీరు త్రాగటానికి ఉపయోగ పడటం లేదు. గాలి పీల్చుకుంటున్నప్పుడు, నీరు త్రాగుతున్నప్పుడు శరీరములోకి విషపదార్థాలు నెమ్మదిగా ప్రవేశిస్తున్నాయా అనే భయము నిరంతరము ఉంటున్నది. పరిశ్రమలు, వాహనాల ద్వారా విడుదలౌతున్న కాలుష్యముల గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ (greenhouse effect) వలన అంతరిక్షంలో ఉష్ణోగ్రత ఎక్కువగా పెరుగుతున్నది. దీనివలన మంచుప్రాంతాలలోని మంచు కరిగి తద్వారా సముద్రమట్టం పెరిగి భయంకర ప్రమాదములు వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాతావరణంలోని విషపూరిత వాయువుల విషాక్తత ఒత్తిడిని సహించలేని స్థితిలో బ్రహ్మాండకిరణముల నుండి పృథ్విని కవచము వలే రక్షించే ఓజోన్‌పొర చిరిగిపోతున్నది. ఇదే పద్ధతి కొనసాగితే ఏ సూర్యకిరణముల వలన పృథ్వి మీద జీవనవికాసక్రమము అభివృద్ధి చెందిందో, ఆ సూర్యకిరణములే రక్షణపొర లేకపోవడం వలన అత్యధికముగా పృథ్వి మీద చేరుటచేత వినాశనము కూడా సంభవించవచ్చు.

క్రొత్తగా అణుశక్తి వృద్ధిచెందడం వలన ప్రమాదకరమైన వికిరణములు వాతావరణంలో వ్యాపించుటయే గాక తద్వారా ఏర్పడిన 'బూడిద'ను ఎక్కడ పడెయ్యాలి? అనే ప్రశ్న ఉత్పన్న మౌతున్నది. ఎందువల్లనంటే ఇది ఎక్కడుంటే అక్కడ ప్రమాద కరమైన పరిస్థితులను ఏర్పరుస్తుంది.

### కచ్చితంగా పరిస్థితులు విస్ఫోటకరమైనవే

వైజ్ఞానిక సమృద్ధి, దాని దురుపయోగం యొక్క కథ ఇది. ఇందులో సుఖప్రదమైన అంశములు తక్కువగాను, దుఃఖప్రదమైన అంశములు ఎక్కువగాను ఉన్నాయి. ఈ క్రమము ఇంకా కొనసాగుతూనే ఉన్నది. నిజము చెప్పాలంటే రోజురోజుకు ఎక్కువగా విస్తరిస్తున్నది. ఇప్పటివరకు జరిగిన నష్టములను, తద్వారా ఏర్పడిన సమస్యలను ఎలా సవరించు కోవాలో తెలియడం లేదు. రాబోయేరోజులలో ఇవి ఇంకా చాలా ఎక్కువ అయినప్పుడు ఎటువంటి దుర్గతి ఏర్పడుతుందో కదా? కొలదికాలంలో ఎక్కువవుతున్న ఈ వైజ్ఞానిక దురుప యోగం వలన ఏర్పడిన పరిస్థితులను చూస్తే రాబోయే రోజులలో చాలా సహజంగానే వైజ్ఞానిక అభివృద్ధి వలన కలిగే మరిన్ని అనర్థముల గురించి అంచనా వేయవచ్చును.

**నిందలు వేయటం, సాకులు వెతకటం మానవేయండి**

**వైజ్ఞానిక ఆలోచనా సరళి (దర్శనము) ప్రత్యక్షవాదము మీద ఆధారపడి ఉంటుంది.** ఇది తత్త్వదర్శనము (Philosophy) ను కూడా ప్రభావితము చేసింది. దీనినిబట్టి భౌతికంగా కనిపించేదానికే విలువ ఇవ్వబడుతున్నది. ప్రత్యక్షముగా పొందే లాభానికే ప్రాముఖ్యత ఇవ్వబడుతున్నది. తత్ఫలితంగా పరోక్షము యొక్క అంకుశమును స్వీకరించనప్పుడు ఈశ్వరుడు, ధర్మము మరియు దానితోపాటు కలిసి ఉండే సంయమ, సదాచార, పుణ్య-పరమార్థాలకు విలువ ఉండదు. పాటించ వలసినవాటిని మరియు పాటించకూడనివాటిని అంధ విశ్వాసములు అని చెప్పి వాటిని వదిలివేయమని ఎందుకు నొక్కిచెప్పారంటే ఇవి వ్యక్తి యొక్క సుఖానికి అడ్డుతగులుతాయి కనుక. పూర్తిగా అనుభవించాలి అనే సిద్ధాంతము ఏమి చెబుతుందంటే – ఎంత ఎక్కువ లాభము పొందగలిగితే అంత పొందటానికి ప్రయత్నించాలి. దీనికొరకు ఏ ఆదర్శములను, సిద్ధాంతములను అడ్డురానివ్వకూడదు. సంపూర్ణ సుఖం అనుభవించడానికి, వీలైనంత ఎక్కువ లాభం పొందటానికి ఏ ఆదర్శాలను, సిద్ధాంతాలను పాటించవలసిన అవసరము లేదు అనేదే ఈ ప్రత్యక్షవాదము యొక్క సిద్ధాంతము. ఈ ఆలోచనాసరళియే పశుపక్షుల వధను ఒక సహజమైన ప్రక్రియగా ప్రోత్సహిస్తున్నది. అన్యప్రాణుల మీద చూపే ఈవిధమైన నిర్దయత మనుష్యుల మీద కూడా అదే ప్రభావమును చూపించకుండా ఉండదు. పశుప్రవృత్తులు మనిషికి సహజం అని నిర్ణయించుకున్నప్పుడు మరి యౌవన స్వేచ్ఛాచారం (sexual freedom) కూడదు అని అనలేము.

విజ్ఞానము, భౌతికవాదము యొక్క క్రొత్తక్రొత్త పోకడలు వాటి ఆధారము ది మీద తాత్కాలిక లాభముల యొక్క ఇంద్రజాల చమత్కారములను అందజేసే నేటి ఆధునికత, నీతి మరియు సదాచారములను పూర్తిగా చెరిపివేస్తూ వ్యక్తిని స్వేచ్ఛాచారిగా మార్చుచున్నది.

## పెరుగుతున్న జనసంఖ్య-పెరుగుతున్న సమస్యలు

కాముకత ప్రాకృతిక మనోల్లాసము కలుగజేసేదిగా మాత్రమే గుర్తించడము వలన దానిని విచ్చలవిడిగా ఇష్టానుసారము ఆచరించవచ్చు అనే భావన ఏర్పడుతున్నది. ఫలితంగా స్వేచ్ఛ యౌవనాచారంతో పెరుగుతున్న జనసంఖ్య అనే సమస్య ఏర్పడింది. గర్భనిరోధములకు, భ్రూణహత్యలకు ప్రోత్సాహం లభించినా, జనసంఖ్య ఇంకా వేగంగా పెరుగుతూనే ఉన్నది. సంపూర్ణపృథ్వి మీద చక్రవడ్డీ వలే జనసంఖ్య పెరుగుతున్నది. ఒకటి నుండి నాలుగు, నాలుగు నుండి పదహారు, పదహారు నుండి అరవైనాలుగు ఇలా ఈ సంఖ్య ఎంతవరకు పోతుందో ఊహించలేము. 3,000 సంవత్సరాల క్రిందట కేవలము 30 కోట్ల మంది వ్యక్తులుండే ప్రపంచ జనాభా ఇప్పుడు 1000 కోట్లకు చేరుకున్నది. రాబోయే 20 సంవత్సరాలలో ఈ సంఖ్య రెట్టింపై ఆహారము, నివాసముల సమస్యే కాక, చివరకు రహదారి మీద నడవడమే కష్టము కావచ్చు.

పృథ్వికి పరిమితసంఖ్యలోని ప్రాణులకు మాత్రమే పోషణ ఇవ్వగలిగే సామర్థ్యము ఉన్నది. ఇది అసంఖ్యాక ప్రాణులకు పోషణనివ్వలేదు. పెరుగుతున్న జనసముదాయము ఇప్పుడే అనేక సమస్యలను కలుగజేస్తోంది. ఆహార ఉత్పాదనకు భూమి సరిపోవడంలేదు. నివసించడానికి అనేక అంతస్తుల భవంతులు తయారుచేయవలసి వస్తున్నది. ఖాద్యాన్నముల ఉత్పత్తియే గాక, ఇతర అనేక కార్యములకు భూమి చాలా ఎక్కువ పరిమాణంలో కావలసి వస్తున్నది. అడవులను నరికివేస్తున్నారు. అడవులను సంరక్షించటానికి న్యాయసంబంధ రక్షణ ఉన్నా భూమి యొక్క అవసరము వాటిని ఏదోవిధంగా ఉల్లంఘించేటట్లు చేస్తున్నది. అడవులు నరికివేయబడుతున్నాయి. తద్వారా వాయు ప్రదూషణ (air pollution) నివారించగలిగే పరిస్థితులు తగ్గుతున్నాయి. భూమిలో చెట్టు వ్రేళ్ళ యొక్క పట్టుసడలడము వలన ప్రతి సంవత్సరం వరద వచ్చినప్పుడల్లా భూమికోత జరిగి ఎడారులు ఏర్పడుతున్నాయి. నదుల యొక్క లోతు తగ్గడము వలన నీటిసమస్య ఏర్పడుతోంది. గృహోపకరణములు, ఇల్లు మరియు ఇంధనముల కొరకు కూడా కట్టెలు లభించటం లేదు. అడవులను నఱికివేయడం వలన వచ్చే అనేక ప్రమాదాలు తెలిసినా నివాసము కొరకు, ఖాద్యాన్నం కొరకు, రహదారుల, పాఠశాలల, ఆనకట్టల నిర్మాణము కొరకు భూమి కావాలి. ఇవన్నీ జనసంఖ్య పెరుగుదల యొక్క దుష్పరిణామాలే. వీటితో పాటు ఇంకో అనర్థము కూడా ఉన్నది. పెరుగుతున్న పట్టణాలు, వాటిలో పెరుగుతున్న జనసంఖ్య, దానిద్వారా పెరుగుతున్న చెత్త, మురికి వలన నగరం యొక్క వాతావరణము నరకతుల్య మవుతున్నది.

**అనుకున్నది సాధించి చూపండి**

**అన్నివైపులా అశాంతి, ఉద్విగ్నత, వ్యాధులు**

కోలాహలము, కాలుష్యం, మురికి, రోగాలు మొదలగు విపత్తులతో వ్యక్తి రోజురోజుకు తన జీవనీశక్తిని కోల్పోతున్నాడు. శారీరిక, మానసిక వ్యాధులు అతనిని పీల్చిపిప్పిజేస్తున్నాయి. బలహీనతల వల్ల ఉత్పత్తి అయిన అంధవికారములను దాచు కొనుటకు పైపై మెరుగులు దిద్దుకొనుటయే ఏకైక మార్గమని భావిస్తున్నాడు. శారీరిక, మానసిక వికృతులను దాచుకొనుటకు, పెరుగుతున్న శృంగార సాధనాల యొక్క తుఫాను మనిషిని విలాసవంతునిగాను, బద్ధకస్థునిగాను, అపవ్యయము చేసేవాడి గాను, అహంకారిగాను మార్చి ఒక క్రొత్త సమస్యను సృష్టిస్తున్నది.

పైపై మెరుగుల ఆవరణములను తొలగించి చూడగలిగితే ఇన్ని శతాబ్దములలో మనిషి పొందినదానికంటే చాలా ఎక్కువ పోగొట్టుకున్నాడు అని తెలుస్తున్నది. సౌకర్యాలు నిస్సందేహముగా పెరిగాయి, పెరుగుతున్నాయి.

కానీ వీటికి బదులుగా జీవనీశక్తి నుంచి వినమ్రత, సజ్జనత మొదలగు మానవీయ విలువలు క్షీణిస్తున్నాయి.

నేడు మానవుడు ఒక 'శ్మశానస్తబ్ధత' మధ్య భయపడుతు, ఇతరులను భయపెడుతు, ప్రేత పిశాచాల వలే జీవిస్తున్నాడు.

ఈనాడు ప్రతి ఒక్కరు సమృద్ధిని పెంచుకోవడానికి వ్యాకుల పడుతున్నారు. కానీ దానికొరకు యోగ్యత, ప్రామాణికత, పురుషార్థపరాయణతలు అను యోగ్యతలు అవసరమౌతాయి. ఐతే అవి లేకుండా లోకులు ఉత్తినే ఇంటి దగ్గర కూర్చుని తొందరతొందరగా ఏవేవో పొందాలని అనుకుంటారు. అటువంటప్పుడు అనాచారము తప్ప ఇంకొక మార్గమే కనిపించదు. ఈరోజుల్లో ప్రగతి పేరు మీద ధనవంతులవ్వాలనే కోరిక ఆకాశమును అంటుతోంది. దీని పరిణతిగా తృష్ణ కూడా ఆకాశమును అంటుతోంది.

ఇటువంటి మానసికస్థితి యొక్క పరిణతి ఒక్కటే. మనిషి అనేకానేక దుర్గుణాల ఉచ్చులో చిక్కుకుంటాడు. పరస్పర విశ్వాస, స్నేహ, సద్భావములు పోగొట్టుకోవడము వలన వ్యక్తి నవ్వుతూ, నవ్విస్తూ సద్భావన, సహయోగములతో కూడిన జీవితమును జీవించగలడు అనేది సందేహాస్పదమే. *(సశేషం)*

## పురుషార్థంతో సాఫల్యం సునిశ్చితం

*వృక్షం బాటసారితో "నీవు ఎన్నిసార్లు రాళ్లతో కొడితే అన్నిసార్లు నేను నీకు ఫలాలనే ఇస్తూ ఉంటాను. ఇది నా వ్రతం. నాకెంత నష్టం, పతనం కలిగిన సరే, సహిస్తానేగాని రాయికి రాయితోనే జవాబు చెప్పటం చాతకాదు" అని పల్కింది "నీవు పువ్వులతో, ఫలాలతో ఉయ్యాల లూగటం, నేను ఆకలితో కడుపు చేతపట్టుకొని తిరగటం ఇదేమి న్యాయం?" "ఒకరిలాగ మరొకరు ఎందుకుండాలి?" "ఇది నీ అన్యాయమే గాదు. అన్నీ నీకు అమర్చి పెట్టిన నీ భగవంతుని అన్యాయం కూడ." వృక్షం మందహాసం చేస్తూ "ఓ బాటసారీ! ఈర్ష్యకెందుకయ్యా దాసుడవవుతావు. ఒక్కసారి శాంతంగా ఆలోచించు. నేను ఎంతటి తపశ్చర్య వల్ల ప్రకృతి వైపరీత్యాల నుండి, గాలివానలు, గ్రీష్మ తాపాల నుండి నా ఫలాలను కాపాడుకొంటున్నానో నీకే అర్థం అవుతుంది. నీవు కూడా ఇటువంటి తపశ్చర్య ద్వారా, పురుషార్థం ద్వారా ఇంతకు మించిన ఫలాలతోను, పూబాటలతోను ఊయల లూగగలవు. సునాయాసంగా ఎవరికీ ఏదీ లభించదు. వారి వెనుక అనంతమైన తపశ్చర్య, పురుషార్థం దాగి ఉంటాయి. ఈ సత్యాన్ని మరచినవారే ఈర్ష్యకు దాసులవుతూ ఉంటారు" అని బదులు పలికింది.*

*అడవిలో పుట్టిన మొక్కలే మహావృక్షాలుగా ఎదిగి, పరులకు ఫలాలు ఇవ్వగా లేనిది– సమస్త సదుపాయాలతో నిండిన జగత్తులో పుట్టిన ఆలోచనాపరుడైన మానవుడు ఏమాత్రం ఎదగలేక, తన ఉన్నతి కోసం ఇతరుల ముందు చేయిజాచటం, అందకపోతే నిందించటం, తాము సాధించలేనివి ఇతరులకు అవలీలగా లభిస్తున్నాయని ఈర్ష్య చెందటం ఎంతటి సిగ్గుచేటు? పురుషార్థపరాయణుడైన వ్యక్తి తన సాఫల్య మార్గాన్ని తానే నిర్మించుకుంటాడు కాని ఎవరినీ దేవురించడు. చేయలేదని ఇతరులపై పడి ఏడ్వడు. వాళ్లు బాగున్నారని ఈర్ష్యపడడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**రోజులన్నీ ఒకేలాగా ఉండవు**

సమయదానమే యుగధర్మము-1

# దానము - దాని ఔచిత్యము

దానము, పుణ్యము ఎప్పుడూ కలిసే ఉంటాయి. వీటివల్ల లభించే ప్రతిఫలాలు కూడా ఒకేలాగా చెప్పబడతాయి. ఆధ్యాత్మిక భాషలో దీని యొక్క గొప్పతనాన్ని స్వర్గము, ముక్తి, సిద్ధి, వరదానము మొదలగువాటిగా చెప్తారు. వాడుకభాషలో వీటిని ప్రగతి, సఫలత, గొప్పదనాన్ని ప్రసాదించేవిగా చెప్తారు.

దానము అనగా ఇచ్చుట. ఇదే పుణ్యము! తీసుకొనుట అనగా అధికారముల అపహరణ. ఇదే పాపము! పాపము యొక్క పరిణితి లౌకిక, పారలౌకిక క్షేత్రాలలో దుర్గతిగా కనిపిస్తుంది. నరకము దీని యొక్క ఆలంకారిక ప్రతిపాదన. పాప, పుణ్యాలలో తను దేనికి అనుగుణ్యంగా ఉండాలి అనే నిర్ణయము మనిషి కోరికల మీద ఆధారపడి ఉంటుంది. **పరిస్థితి అనేకసార్లు మనిషి తీసుకున్న నిర్ణయానికి విపరీతముగా ఒత్తిడి తేవడము చూస్తూ ఉంటాము. కానీ చివరకు ఇచ్ఛాశక్తి సంకల్పించినదే జరుగుతుంది.**

హరిశ్చంద్రుడు, కర్ణుడు, బలిచక్రవర్తి, దధీచి, భామాషా మొదలగువారి కథలు ఈ తథ్యాన్నే ప్రతిపాదిస్తాయి. స్వర్గానికి వెళ్ళాలనుకునేవారు మరియు ముక్తిపొందాలనుకునేవారు వీరివలే ఆత్మసమర్పణ చేయగలగాలి. భక్తి యొక్క స్వరూపము ఒక్కటే. తన కోరికలను-ఆకాంక్షలను ఆరాధ్యునితో ఏకము చేసుకొనుట. ఇంధనం తుచ్ఛమైనదైనప్పటికీ దావానలముగా మారి జాజ్జ్వల్యమానముగా శోభిస్తుంది. భగవంతుడిని భక్తవత్సలుడు అంటారు. ఆయన తన భక్తునికి తనను తాను అర్పించుకొని అతని సంకేతానుసారము నృత్యము చేస్తాడు. మీరాతో సహనృత్యము, సూరదాసు చేతికర్ర పట్టుకుని సేవకుని వలె పనిచేయడము ఇలాంటి ఉదహరణలే. సుధాముడు, చైతన్యమహాప్రభువు, హనుమంతుడు, అర్జునుడు మొదలగు వారిని ఇటువంటి భక్తులలోనే లెక్కడగతాము. వీరు భగవంతుని పొలములో తమ సర్వస్వమును ఉదారముగా నాటి, నాటిన విత్తనాలతో పోలిస్తే అనేకరెట్ల అన్నభండారములతో తమ ఇంటిని నింపుకున్నారు, అలంకరించుకున్నారు.

శ్రద్ధ విశ్వాసం గల శ్రేష్ఠ జనులను దేవమానవులు అంటారు. సృష్టి యొక్క కణకణము వారి నుండి లభించిన అనుదానాలకు కృతజ్ఞత చూపిస్తుంది. మహామానవు లందరు వారు ప్రపంచము నుండి ఏమి పొందారో దానికి ప్రతిఫలముగా అనేక రెట్లు తిరిగి ఇచ్చుట అనే ఏకైక వ్రతాన్ని పాటించారు, ఉత్కృష్ఠత సాధించారు. వీరు పిసినిగొట్టులయి ఉంటే వారి సంపద ఎంత ఎక్కువగా ఉన్నా ప్రేతపిశాచాల పంక్తిలో నుంచుని ఉండేవారు.

సత్యములు ఎంత కష్టసాధ్యమైనా సముద్రపు ఒడ్డున ఒంటరిగా ఉండే ప్రకాశసంతంభం వలె తమ స్థానంలో స్థిరముగా ఉంటాయి. **ఎవరు ఎంత ఇస్తే దాని నిష్పత్తిలోనే కచ్చితముగా పొందుతాడు అనేది ఇటువంటి సత్యములలో ఒకటి.** వెక్కిరించేవాడు బదులుగా వెక్కిరించబడతాడు. ఈ విషయము ఎందుకు చెప్పబడుతుందంటే ఇవ్వవలసి వచ్చినప్పుడు మొండిచెయ్యి చూపించి, తీసుకోవలసినప్పుడు పెద్ద సంచి తీసుకుని తిరిగేవాడికి కేవలం నిరాశ, అలసట, బాధ మాత్రమే లభిస్తాయి. ఏమి చేయకుండా తొందరగా ఉత్తినే చాలా పొందాలనుకునేవి పగటికలవుతాయి తప్ప లాభం ఉండదు.

ప్రపంచములో వ్యవహారికత మాత్రమే చలామణి అవుతుంది. ప్రపంచములో ఒక దానిని మించి మరొకటి మంచి వస్తువులు నిండి ఉన్నాయి. అవి చాలా ఆకర్షణీయముగా మన ముందు పెట్టబడి ఉన్నాయి. కానీ వాటిలో ఏ ఒక్కదానిని కూడా ఉచితంగా పొందలేము. ఎవరు ఉచితంగా పొందాలని ప్రయత్నము చేస్తారో వారు దొంగల వలె పట్టుబడతారు. లేక బిచ్చగాళ్ళ వలే ఛీ కొట్టబడతారు. తగిన మూల్యము ఇవ్వకుండా ఎవరైనా, ఎప్పుడైనా, ఏదైనా పొంది ఉంటే అతని అలవాట్లు మరియు వ్యక్తిత్వస్థాయి దిగజారటం వల్ల పొందినవాని కంటే పోగొట్టుకునేవే ఎక్కువవుతాయి. **అనుదానము యొక్క ప్రతిదానము మాత్రమే ప్రపంచమునకు శాశ్వత నియమము.**

తాము ఇచ్చినదాని కంటే తక్కువ పొందినా సరిపెట్టుకునే వారికి ప్రపంచములో సన్మానము మరియు సహకారము సురక్షితమై ఉంటాయి. తక్కువ ఇచ్చి ఎక్కువ పొందాలి అనే

**మనకు కూడా ఎప్పుడైనా ఏదైనా అవసరం రావచ్చు**

కోరిక అనాచారులకు, మోసగాళ్ళకు మాత్రమే వర్తిస్తుంది. **నిజానికి కనిపించే ప్రపంచములో మరియు కనిపించని పర లోకములో ఒకే శాశ్వత నియమము ఉన్నది. ముందు ఇవ్వు, తరువాత పొందు.** పొందిన తరువాత దానిలోని ఒక అంశమును దానము చేయుట అనే నీతి దోపిడీగాళ్ళకు మాత్రమే సరిపోతుంది. కానీ వారి అన్ని ప్రయత్నాలు సఫలము కావు కదా.

ఊహలోనే లడ్డూలు తినాలనుకోకపోతే, పగటికలలు కనాలనుకోకపోతే, రెక్కలు లేకుండా ఆకాశములో ఎగరాలి అనుకోకపోతే, యథార్థము మీద ఆధారపడి మంచి ఫలితాలు పొందాలనుకుంటే ఈనాటివరకు ఉదారులు లేక మహా మానవులు దేనిని ఆచరించి **అందరి మన్నన, కీర్తి** అనే జంట లాభాలు పొందుతూ వచ్చారో ఆ విధానాన్నే అవలంబించాలి. సంతులు, సమాజ సంస్కర్తలు, ఆత్మబలిదానము చేసుకున్నవారు (షాహీదులు) మరియు సేవాభావము కలవారు తమ ఉదారత యొక్క బలము మీదనే మనుష్యుల నుంచి దేవతల వరదానముల వరకు పొందగలిగారు. **తపశ్చర్యలు చేయకుండా విభూతులు మరియు సిద్ధుల వరదానము ఎవరికి లభించింది?**

ఎక్కువ తీసుకుని తక్కువ ఇచ్చినప్పుడే డబ్బు కనబడు తుందా? ప్రపంచము నుంచి ప్రతిరోజు మనము ఎంత తీసుకుంటున్నామో దాని లెక్కల వివరణ ఉంచుకునే తీరిక ఎవరికీ లేదు. వ్యాపారానికి ఎక్కడనుంచి పెట్టుబడి కోసం ధనం తీసుకుంటామో తరువాత వడ్డీతో సహా దానిని తిరిగి ఇవ్వవలసిన వస్తుంది. ఈ నియమము శాశ్వతమైనప్పటికీ ప్రతి ఒక్కరు దీని నుంచి తప్పించుకోవాలనే కోరుకుంటారు. ప్రపంచములో ప్రతి ఒక్కరు- ప్రతి ఒక్కరి నుంచి ఎంతో కొంత తీసుకోవలసి ఉంటుంది. కానీ తిరిగి ఇవ్వవలసి వచ్చినప్పుడు మొండిచెయ్యి చూపించడం లేక ఓ వెకిలినవ్వు నవ్వి ఊరుకోవడం సరియైనది కాదు.

మహత్త్వపూర్ణమైనదానిని పొందటానికి మహత్త్వపూర్ణమైన క్రియాకలాపాలు చేయకుండా పని జరగదా? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరము దశ దిశలలోను - "ఇవ్వు-పొందు", "నాటు-కోసుకో", "నీ సంచి నుంచి పంచు. అది ఎప్పుడు ఖాళీ అవ్వదు" అని ప్రతిధ్వనించడం వినవచ్చు. ఇది ఒక శాశ్వత సత్యం. వీటిలో ఎటువంటి మార్పు ఉండదు.

తిరిగి ప్రశ్న మళ్ళీ అక్కడికే వస్తుంది. ఎక్కువమంది లేమితో బాధపడుతున్నప్పుడు, దారిద్ర్యరేఖ కంటే క్రింద స్థాయి జీవితము జీవిస్తున్నప్పుడు దాన పుణ్యముల పరంపర ఎలా కొనసాగుతుంది? ఈ ప్రశ్నలో చిన్నపిల్లల అమాయకత్వము గోచరిస్తుంది. సాధారణముగా ధనదానమే ఏకమాత్ర దానమని అనుకుంటారు, ఎందుకంటే ప్రతి చోట దాని గురించే వింటూ ఉంటాము, దాని గురించే చర్చిస్తాము, ప్రశంసల వర్షం కురిపిస్తాము. లంచమిచ్చి చమత్కారాలు చేసే మనిషి నేమిటి దేవతలను కూడా స్తోత్రాలు, కానుకలు, వేడుకోలు వల్ల తమవైపు తిప్పుకోవచ్చునని భావిస్తారు. వారి కోరిక ఎంత అనైతికమైనదైనా, అవాంఛనీయమైనదైనా దేవతల నుంచి ఇట్టి కృప పొందవచ్చునని నమ్మేవారి సంఖ్య తక్కువేమీ లేదు.

ఇటువంటి పరిస్థితులలో దానము అనే మాటకు అర్థము ధనదానముతో జోడింపబడితే మనోరంజనము కోసము చేయబడే అపవ్యయము కూడా దానము అనుకుంటే ఆశ్చర్య మేముంది? ఒకప్పుడు పూజావిధానములలో పశువధ కూడా సమ్మిళితమై ఉండేది. దానిని బలిదానము అనేవారు. హరిజనులకు ఒకప్పుడు మిగిలిన ఎంగిలి పదార్థాలను దానంగా ఇచ్చేవారు, కానీ ఇప్పుడు వారు దానిని అవమానంగా భావించి స్వీకరించుటలేదు. రోగులు వదిలేసిన బట్టలను ఒకప్పుడు ఒక విశేష జాతికి సంబంధించినవారు ఆనందముగా స్వీకరించేవారు.

కానీ ఇప్పుడు "వదిలేసినవాటి దానము" స్వాభిమానము గల పేదవారు కూడా స్వీకరించరు. పెళ్ళిళ్ళలో విరివిగా పిచ్చిగా ఖర్చుపెట్టే డబ్బు 'కన్యాదానము, వాగ్దానము' మొదలగు పేర్లతో చెప్పబడుతోంది. ఈవిధముగా దానము అనే శబ్దము యొక్క దురుపయోగము అనేక భ్రాంతి రూపాలలో చూడవచ్చును.

సంపాదించిన ధనములో కొంత భాగమును అర్హత గల సంస్థలకు దానం ఇచ్చి, ఆదాయపు పన్ను నుంచి రాయితి పొందవచ్చు. ఇటు పన్ను లాభం, అటు దానవీరుల శ్రేణిలో లెక్కింపు. కుటుంబీకుల మీద అనుగ్రహము, తీర్థయాత్రల పేరుతో జరిగే పర్యటనలు, పిక్‌నిక్‌లు దానాలే! మనోరంజన కొరకు ఉద్యానవనాలు, పార్కులు, ఈతకొలనులు మొదలగునవి కట్టించుట కూడా ప్రజల కోసము చేస్తున్నామని మనస్సును సముదాయించుకోవచ్చు. లంచము కొరకు ఇవ్వబడిన రాశి

**ఏడుస్తున్న వారిని నవ్వించాలి, ఇదే మానవ ధర్మం**

కూడా ఉదారముగారనే ఇస్తాము కనుక దానమే కదా. అంత వరకు ఎందుకు? మత్తుపదార్థాలు స్వీకరించేముందు శివునికి అర్పణ చేస్తే అవి ప్రసాదముగా స్వీకరించవచ్చు. పేరు కొరకు ఒక చోట డబ్బులిచ్చి, ప్రతిష్ఠ పొంది ఆ పలుకుబడిని ఇంకొక విధముగా లాభము పొందడానికి ఉపయోగించడము కూడా దానముగానే లెక్కకడతారు. ఈవిధముగా దానమనే మాట నిత్యవ్యవహారములో ఏవిధముగా ఉపయోగిస్తున్నామో దానిని 'ఇచ్చి–పుచ్చుకోవడం' అనడం మంచిది.

దానమును ప్రామాణికమైన విధానముల ద్వారా ఉచ్చస్తరీయ సత్ప్రయోజనముల కొరకు ఉపయోగించినప్పుడే పుణ్యము అనాలి. దీనికి విరుద్ధముగా సోమరితనము, మోసము, దుర్వ్యసనము, అంధవిశ్వాసముల కోసము ఖర్చుపెడితే విపరీత ఫలితాలు కూడా రావచ్చు. **ప్రయోగము మరియు పరిణామముతో కలిసిన ఉత్కృష్టతయే పుణ్యానికి ఆధారము.** దాని యొక్క ప్రతిక్రియగా పుణ్యముతో పాటు జోడింపబడే అనేక మంగళకరరూపాలు ముందుకు వస్తాయి. దీనికి విరుద్ధముగా ఆ రాశితో దుర్జనుల దుష్ప్రయోజనముల కొరకు ఉపయోగిస్తే దానముగా ఇచ్చినా అది మనకు, ఇతరులకు కూడా నరకము వంటి అనేక పరిస్థితులు తెచ్చిపెడుతుంది. ఏదైనా ఉచితంగా రావాలనే కోరికను పెంచుకోవడము పతనానికి దారి తీసేదిగా ఉంటుంది. విపత్తులలో ఉన్నవారికి సహాయం చేసి వారి కాళ్ళ మీద వారు నిలబడేటట్టు చేయడము ఒక మంచి విషయమే కానీ ప్రతీదీ ఉచితంగా తీసుకునే అలవాటు పెంచి పోషిస్తే.... అదే స్వభావముగా మార్చడమనేది సవ్యముగా ఉన్న మనిషిని వికలాంగునిగా చేయుట వంటిదే.

ఇటువంటి పరిస్థితిలో ఆలోచించవలసిన విషయము ఏమిటంటే ప్రశంసనీయ స్థాయితో దానము పేరిట వెదజల్ల గలిగేంత న్యాయోపార్జిత ధనము ఎలా సంపాదించగలము? వాస్తవానికి ధనికుల దానము వారి యొక్క సంచిత పాపములకు ప్రాయశ్చిత్తము. పుండుకు చీము బాగాపడితే దానిని శస్త్రచికిత్సతో తీసివేస్తే చికిత్సకుని కంటే చేయించుకున్నవారికే ఎక్కువ లాభము.

ప్రతివ్యక్తి సాధారణ జీవనము గడుపుట, సాదా జీవితము –ఉచ్చ ఆలోచలు అనే నీతిని పాటించుట, చెమటోడ్చి కష్టించి న్యాయోచిత సంపాదనతో సంతోషపడుట. ఉచితమైనది– దొంగతనం, దురాచారాలను ఇందుకొరకు ప్రయోగించకుండుట. ఒకవేళ సంపాదించినదానిలో ఖర్చులు పోగా మిగిలినది అవాంఛనీయతల నుండి అవ్యవస్థలను సరిచేయుటకు ఖర్చు చెయ్యాలి. సత్ప్రవృత్తి సంవర్ధన యొక్క వ్యవస్థ జోడింపబడక పోవుట వలన శ్రేష్ఠత, ప్రగతిశీలత అనే చెట్టు ఎండిపోతున్నది. ఇదే సత్యయుగ పరంపరగా ఉండేది. చేయవలసినది కూడా ఇదే.

---

## సిగరెట్ నీదైతే పొగ కూడా నీదే

*బాబు రాజేంద్రప్రసాద్ ఒకసారి పడవలో తన గ్రామానికి వెళుతున్నాడు. ఆ పడవలో ఒక ప్రయాణీకుడు సిగరెట్టు త్రాగుతున్నాడు. పడవంతా పొగచుట్టివేసింది. పొగవల్ల రాజేంద్రప్రసాద్‌కు దగ్గు మొదలైంది. ప్రయాణీ కుడుతో అన్నాడు. "ఈ సిగరెట్టు నీదేనా?" దానికి అతడు" మరినాది కాకపోతే? నీదా?" అని దురుసుగా సమాధానం ఇచ్చాడు. నీ సిగరెట్టు నుండి వచ్చే పొగకూడ నీదేగా? మరి నీపొగను నీ దగ్గరే ఉంచుకోక ఇతరుల మీదకు వదులుతున్నావేమిటి?" అని ప్రశ్నించాడు. ప్రయాణీకుడు సిగ్గుపడి సిగరెట్టును ఆవతల పారేశాడు.*

– *అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

## దృష్టికోణము

*ఒకానొక దార్శకుని చూసి ఒకానొక వ్యక్తి ప్రశ్నించాడు. "అసంతృప్తితోను, దుఃఖంతోను నిండి ఉన్న ప్రపంచాన్ని చూస్తూ కూడా నీవు సంతోషంగా ఎలా ఉండగలుగు తున్నావు?" అని. "నేను నా దృష్టికోణాన్ని నాకనుకూలంగా మలచుకుంటాను. ఆకాశం వైపు చూడగానే నాకు నేను వెళ్ళబోయే స్వర్గం కనిపిస్తుంది. క్రిందికి చూడగానే నా సమాధికి కావలసిన స్థలమెంతో గుర్తుకు వస్తుంది. నాలుగు వైపుల చూసినట్లైతే నా కన్నా దుఃఖితులెందరున్నారో అవగత మవుతుంది. అందుకని అనవసరంగా అసంతృప్తి చెందను. సంతోషంగా ఉంటాను" అని సమాధానమిచ్చాడు.*

– *అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**క్రిందపడిన వారిని లేవనెత్తాలి, ఇదే మన కర్తవ్యం**

## అంతర్యాత్ర-1

# ముందుమాట

పరమపూజ్యగురుదేవులకు, మహర్షి పతంజలికి మధ్య అపురూపమైన పోలిక వుంది. ఆధ్యాత్మిక జగత్తులో వీరిరువురి ఉపస్థితి అనేది చాలా అపురూపమైనది. వీరిరువురు ఆధ్యాత్మికత యందు శిఖరపురుషులు, వైజ్ఞానికులు. బుద్ధుడు, కృష్ణుడు, మహావీరుడు మరియు నానక్‌ల వలె వీరు కూడా మిగతావారితో పోలిస్తే చాలా వేరుగా మౌలికంగా ఉండే ప్రబుద్ధ వ్యక్తులు.

పతంజలి మహర్షిని, వేదమూర్తులైన గురుదేవులను ఆధ్యాత్మికవేత్తలతో కూడిన ప్రపంచానికి ఐన్‌స్టీన్ వంటివారని చెప్పవచ్చు. వారే ఒక అద్భుతమైన సంఘటన. వారు చాలా సులువుగా ఐన్‌స్టీన్, బోర్, మేక్స్‌ప్లాంక్ లేదా హైజీన్‌బర్గ్‌ల కోవలోకి వచ్చేస్తారు. వారి యొక్క అభివృత్తి మరియు దృష్టి రెండూ విశుద్ధమైన వైజ్ఞానికులను పోలి ఉంటుంది. వీరు నియమాల భాషలోనే ఆలోచిస్తారు. వారు కనుగొన్న సత్యాలను రహస్యమయ సంకేతాల రూపంలో కాకుండా నియమాల భాష రూపంలో ప్రకటించారు.

ఈ ఇరువురు మహాపురుషుల విజ్ఞానము చాలా అద్భుతమైనది. వీరిరువురు చాలా లోతైన వైజ్ఞానిక ప్రయోగాలు చేశారు కానీ వారి ప్రయోగశాల పదార్థజగత్తులో ఉండక, చేతనామయ జగత్తులో ఉంటుంది. వారు అంతర్జగత్తుకి సంబంధించిన విజ్ఞానవేత్తలు. ఈ విధానంలో వారు చాలా విలక్షణంగా, వేరుగా ఉంటారు.

ఈ విధంగా తపోమూర్తియైన గురుదేవులు, మహర్షి పతంజలి ఇరువురు విధాత యొక్క విశ్వఉద్యానవనమునందు లభించే అరుదైన, దుర్లభమైన పుష్పముల వంటివారు. వైజ్ఞానిక మస్తిష్కముతో ఆలోచించినప్పటికీ వారి యాత్ర మాత్రం అంతర్ముఖంగానే ఉంటుంది. వారు అనేక ప్రయోగాలు చేశారు. వారి ప్రయోగాలన్నీ పదార్థజగత్తులోనే కాక చేతనామయ జగత్తులో చేయబడ్డాయి. వారు మానవుని అంతర్జగత్తులో ఉండే అనవసరమైన నియమాలకు ఉద్వాసన చెప్పి సత్యము, మానవత్వంతో నిండిపోయిన మనస్సు యొక్క చిట్టచివరి కార్యప్రణాళికను విస్తరింపచేసేందుకు అవసరమైన అన్వేషణను ప్రతిపాదించారు. వీటిని అధ్యయనం బాగా చేస్తే గణితంలో ఉండే ఫార్ములాలు, సూత్రాలవలే నిరూపించబడిన సత్యాలనే వెల్లడించారని అర్థమవుతుంది. వారి మాటలు విని వారు చెప్పినట్లుగా చేస్తే పరిణామం ఖచ్చితంగా వచ్చి తీరుతుంది. వారి మాటలు 2+2=4 వలే సునిశ్చితంగా ఉంటాయి.

ఇందుకొరకు ఎటువంటి విశ్వాసాలు అవసరం లేదు. కేవలం చెప్పింది చెయ్యడం, తెలుసుకోవడం అంతే. ప్రయోగాలలో మునిగిపోవడం, సాధించుకోవడం అంతే తప్ప ఇక్కడెక్కడా ఎటువంటి అనుమానాలకు స్థానం లేదు. ఎటువంటి భ్రమలకు, సందేహాలకు చోటులేదు. ఇక్కడ అన్నీ చేసి తెలుసుకోవలసిందే. అందువల్లనే మహర్షి పతంజలి, గురుదేవులు ఇరువురు అద్భుతమైన శక్తులు. పతంజలి మహర్షి వేలవేల ప్రయోగాలు చేయగా చేయగా వచ్చిన సత్యాలనే సూత్రీకరించి సిద్ధం చేశారు, ఈ సూత్రాల సహాయంతో ఎప్పుడైనా, ఎవరైనా ఆ ప్రయోగాలను తిరిగి చేసుకోవచ్చు. ఆ సత్యాలను తిరిగి పొందవచ్చు కూడా! ఈ విధంగా పరమపూజ్య గురుదేవులు చేతనామయ జగత్తులో అసంఖ్యాకమైన ప్రయోగాలు చేసి అనేక తథ్యాలను ప్రతిపాదించి ప్రచురించారు. వారు అక్కడితో ఆగలేదు. ఇంకొంచెం ముందుకు వెళ్ళి బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్‌ను కూడా నిర్మించారు. ఆధ్యాత్మిక వైజ్ఞానిక ప్రయోగాలకు అది ఒక అద్భుతమైన ప్రయోగశాలగా మారింది. మానవ చేతనత్వం యొక్క అనుసంధానము కొరకు వారు ఒక అద్భుతమైన క్రియావిధానాన్ని కూడా నిర్దేశించారు.

ఈ దృష్టితో చూస్తే వారిరువురిని విడదీయలేము. వారి వలే ఉండడమనేది కూడా అసంభవం కూడా. ఎందుకంటే వైజ్ఞానిక దృష్టికోణాన్ని కలిగి ఉండడం, ఆంతరికజగత్తులో ప్రవేశించడం అనే రెండు కార్యాలు అసంభవమైనవే. వారు తమ ప్రయోగాలగురించి, వాటి ద్వారా వచ్చిన ఫలితాల గురించి, సత్యాల గురించి ఒక గణితజ్ఞుడు, తర్కశాస్త్రజ్ఞుడు, మహావైజ్ఞానికుల వలే స్పష్టంగా విశదీకరిస్తారు. వాస్తవమేమిటంటే పరమ ఆనందమునకు, చరమజ్ఞానమునకు సంబంధించిన

**స్వయంశక్తితో పైకి ఎదగాలి**

జగత్తు ఎలాంటిదంటే దాని సౌందర్యాన్ని, భవ్యతను దర్శించిన వారి వెంట ఆశువుగా కవితాప్రవాహం వెలువెత్తుతుంది. ఆ స్థితి యొక్క సౌందర్యమే అటువంటిది. దాని నుండి వచ్చే మంగళకరమైన ఆశీస్సులటువంటివి. అక్కడ పొందే పరమ ఆనందము వల్ల చేతనత్వము సహజంగా లయబద్ధతను పొందుతుంది. ఛందస్సులు వాటంతటవే రూపుదిద్దుకొని కావ్యాలు తయారౌతాయి. అయితే పతంజలి మహర్షి, పరమపూజ్య గురుదేవులు ఆధ్యాత్మిక చేతన యొక్క శిఖరపుటంచులకు చేరుకున్న తరువాత కూడా ఆ సమ్మోహనము చేత బంధింపబడలేదు. ఆ సౌందర్యపు మాయను తమను ఆక్రమించనివ్వలేదు. ఇది చాలా కఠినమైన విషయం. వారు మాటలలో వివరించలేని ఎన్నో విషయాలను చెప్పాలని ప్రయత్నించారు.

వారు సాధనామార్గాన్ని కాదు క్రమశిక్షణ మార్గాన్ని తయారుచేశారు. ఆ దారి అందరిది. ఆ దారిలో ప్రయాణించిన వారెవరైనా అన్నింటికంటే ఎత్తైన శిఖరానికి ఖచ్చితంగా చేరుకో గలుగుతారు. వారు చెప్పిన మాటలలో ఏ ఒక్కటీ వ్యర్థముగా ఉండదు. ఎవరైనా తమ అంతర్యాత్ర ప్రారంభించాలనుకుంటే వారు చెప్పిన ఒక్కొక్క మాటను బాగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అది చాలా కష్టమైన పని. వారి మాటలన్నీ తర్కసమ్మతంగా, వివేకపూరితంగా ఉంటాయి. వారి సూత్రాలన్నీ ప్రేమ వైపు, ఆనందము వైపు, పరమాత్మ వైపు తీసుకెళ్తాయి. వారు ప్రయోగించే పదములు వైజ్ఞానిక ప్రయోగాలలో మునిగి పోయిన వారు వాడే విధంగా ఉంటాయి. ఎందుకంటే వారి ప్రయోగశాల వారి అంతర్చేతన యందు, ఆంతరిక అస్తిత్వము నందు ఉంటుంది.

చివరగా చెప్పేదేమంటే మీరంతా ఈ సూత్రాలను, సత్యాలను అనుభూతి చెందుతూ ఇది ఒక కావ్యగణితము అని తెలుసుకోండి. ఎందుకంటే మనోవైజ్ఞానికుడు తన కథనాల యందు తర్కసమ్మతమైన భూమికనే సిద్ధం చేశారు. వారు విచ్ఛేదన చేస్తారు, విశ్లేషణ చేస్తారు, కానీ వారి అభిప్రాయము మాత్రం సంశ్లేషనయే అనగా కలుపుటయే. వారు కలిపేందుకే విశ్లేషణ చేస్తారు. ఆ అనుభూతిలో మనం మునిగే ముందు వారు మనల్ని వైజ్ఞానిక మార్గం ద్వారా పరమసత్యం వైపు తీసుకువెళ్ళాలనుకుంటున్నారు అని గుర్తుంచుకోవాలి. వారు బుద్ధిని ఉపయోగించే మాట్లాడతారు కానీ వారి ఉద్దేశ్యము, లక్ష్యము హృదయమే. వారు మనల్ని తర్కము ద్వారానే తర్కాన్ని దాటేవిధంగా తయారుచేస్తారు.

పతంజలి మహర్షి, తపోమూర్తి గురుదేవులు ఇరువురూ మనల్ని మెల్లిమెల్లిగా చేతన యొక్క శిఖరం వైపుగా తీసుకెళ్తారు. వారు అడుగడుగునా దాని గొప్పతనం వివరిస్తూ ఫలశృతిని కూడా చెప్తూనే ఉంటారు. అలా చేయడంలో ఎదురయ్యే బాధలేమిటో మనం ఆ సమయంలో ఎంతో జాగరూకతతో ఉండాలి అనే విషయాలు వాటిని దాటగలిగే ఉపాయాలు అన్నీ వివరిస్తారు. వారు మనల్ని తమ క్రమశిక్షణతో బంధిస్తారు, కానీ వారి క్రమశిక్షణ తల్లి వలే ప్రేమపూరితంగా, మధురంగా ఉంటుంది.

ఈ పంక్తులు చదువుతున్న పాఠకులకు నేను వేసే నిజమైన ప్రశ్న ఏమిటంటే మీరు ఆ అనుశాసనమును స్వీకరించేందుకు సిద్ధమేనా? జవాబు అవును అయితే మహర్షి పతంజలి సూత్రాలను -తథ్యాలకు సంబంధించిన వ్యాఖ్యలను పరమపూజ్య గురుదేవులు ప్రయోగాలు, అనుభవాలతో పోల్చి అర్థం చేసుకొని తెలుసుకుంటే కలిగే లాభం చాలా ఎక్కువ. అంతర్జగత్తు యొక్క దివ్యలోకాలలోకి ప్రవేశించాలనుకునే కోరిక ఉన్న యాత్రికుల నుండి ఈ మాత్రం అపేక్షించడం ఉపేక్షణీయం కాదు కదా!

మీ,

**డా॥ ప్రణవ్‌పండ్యా**

– అనువాదం: *శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## పరివార సభ్యుల కర్తవ్యం

*యుగనిర్మాణ పరివారం ప్రతి సభ్యుడు మొదటి నుంచి ప్రతిరోజు ఒక గంట సమయం, ఒక కప్పు టీ యొక్క ఖరీదు జ్ఞానయజ్ఞం కొరకు ఇవ్వవలసినదని చెప్పబడింది. యుగశిల్పులకు ఇది అనివార్యమైన కర్తవ్యము. వీటిని ఇప్పుడు పెంచవలసిన సమయం ఆసన్నమైనది. సమయము, ధనముల యొక్క అనుదానముల స్థాయి, పరిమాణం పెంచవలసినది.*

***– పరమపూజ్య గురుదేవులు***

*అఖండజ్యోతి, డిసెంబర్ 2015*

**సజ్జనులు ధనవంతులైనప్పటికి నమ్రమతో వ్యవహిస్తారు**

మనం - మన ఆరోగ్యం

# మందులే విషంగా మారకూడదు

మందులు రోగాన్ని పోగొట్టడానికి బదులు వాటిని పెంచితే ఆశ్చర్యంగా ఉంటుంది, ఆందోళనగా ఉంటుంది. అలాంటప్పుడు ఏం చేయాలో అర్థం కాదు. ఈ మధ్య పరిస్థితులు అలాగే ఉన్నాయి. వాటిని చూసి వైద్యులు ఆశ్చర్యపోతున్నారు, రోగులు ఆందోళనపడుతున్నారు. సుదీర్ఘ పరిశోధనలు, అధ్యయనాలు, విచారణల తరువాత నిరూపించబడిన విషయాలను చూసి అందరు నివ్వెరబోతున్నారు. ఇప్పుడు తేలిన విషయం ఏంటంటే ప్రజలు అనవసరంగా చిన్న చిన్న ఇబ్బందులకు కూడా మందులు వేసుకోవడం, వేసుకోమని సలహా ఇవ్వడం సాధారణ విషయమైపోయింది. పైగా ఇదొక ఫ్యాషన్ అయిపోయింది. చదువుకున్నవాళ్ళు తెలివితేటలున్నాయని చూపించుకోవడానికి స్టేటస్ సింబల్‌లాగా మందులు వాడుతున్నారు. రోగం చిన్నదైనా, పెద్దదైనా మందు మాత్రం పెద్దదవ్వాలి. ప్రతి ఇంట్లో మందుల ఆల్మరా ఒకటి తయారైంది.

సాధారణ మందుల వరకైతే పరవాలేదు. కాని ఇప్పుడు యాంటీబయోటిక్ మందులు కూడా ఉంచుకుంటున్నారు. అసలు యాంటీబయోటిక్‌కి అర్థం వెతికితే **వ్యాధిజనిత జీవనాశకాలు.** కానీ అతిగా వాడడం వల్ల అవి జీవననాశకాలవుతున్నాయి. ఎక్కువగా వాడడం వల్ల రోగాణువులు, జీవాణువుల ఆయువు పెరుగుతోంది, రోగుల ఆయువు తగ్గుతోంది అంటున్నారు విశేషజ్ఞులు. మనుషులలో ప్రతిరోధక సామర్థ్యం అంటే రోగ నిరోధకశక్తి తగ్గుతోంది. ఏ రోగానికైనా సరే యాంటిబయోటిక్ మందులు ఇవ్వటానికి వైద్యులు జంకట్లేదు, వేసుకోవడంలో రోగులు జంకట్లేదు అని ఇప్పటి వైద్యరంగం నిర్మోహమాటంగా ఒప్పుకుంటోంది.

ఈ మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలేంటో తెలుసు కోకుండా గుడ్డిగా వాడేయడం బాధాకరమైన విషయం. ప్రపంచ ఆరోగ్యసంస్థ కూడా భారతదేశాన్ని, దక్షిణాసియా దేశాలని ఈ అధిక వాడకం విషయంలో హెచ్చరించింది. ఈ వాడకాన్ని పరిమితం చేయకపోతే మైక్రోబియల్ రెజిస్టెన్స్ వల్ల సంభవించే మృతుల సంఖ్య భారీగా పెరుగుతుందని సూచించింది.

యాంటీబయోటిక్ మందులు బాక్టీరియాని నాశనం చేస్తాయి లేదా వాటి పెరుగుదలను అరికడతాయి. కానీ అదే పనిగా వాటిని వాడితే బాక్టీరియాలో మ్యుటేషన్ లేదా **ఉత్పరివర్తన పెరుగుతుంది.** ఈ మందులను ఎదుర్కోగల క్రొత్త ప్రతిరోధక సామర్థ్యం పుట్టుకొస్తుంది. అప్పుడు ఆ మందులు పనిచేయడం మానేస్తాయి. దీనికే నిపుణులు మైక్రోబియల్ రెజిస్టెన్స్ అని పేరు పెట్టారు.

వారి సుదీర్ఘ పరిశోధనలు, అధ్యయనాల తరువాత తీర్మానించిందేంటంటే- ఇప్పుడు మందులు విషంగా పని చేస్తున్నాయి. దానికి కారణం గుడ్డిగా, అతిగా వాటిని వాడటమే. చిన్న రోగాలకి కూడా పెద్ద మందులు వాడటం వల్ల ఈ మందులను ఎదుర్కోగల సామర్థ్యం బాక్టీరియాలో పుట్టుకొచ్చి ఈ అతివాడకం వల్ల భవిష్యత్తులో సులువుగా నయమయే రోగాలు కూడా నయం కాని రోగాలుగా పరిణమిస్తాయి.

జాగ్రత్తపడకపోతే ఈ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వల్ల 2050 కల్లా కోటిమంది మృత్యువాతపడే అవకాశముందంటున్నారు. అందులో అధిక శాతం భారతీయులు, దక్షిణాసియా దేశాల వారే ఉంటారు. దీనివల్ల 2-3.5% డిజిపిలో నష్టం ఉండవచ్చని అంచనా. ఈ మందుల వలన వస్తున్న విషం కచ్చితంగా భారతీయులకు ఆందోళనకరమైనదే.

ఇప్పుడున్న రోగాలకు, ఇప్పుడు వాడే యాంటిబయేటిక్ మందులు తప్ప వేరే ప్రత్యామ్నాయమేమీ లేకపోవడం బాధాకరమైన విషయం. అలాంటి పరిస్థితుల్లో ఈ మందులు పనిచేయని స్థితికి చేరుకోవడం మరో బాధాకరమైన విషయం. ఇంగ్లాండ్‌కి చెందిన 'హెల్త్ ప్రొటెక్షన్ ఏజన్సీ' చేసిన అధ్యయనాల్లో కూడా ఈ విషయాలే నిర్ధారింపబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఈ విషయం గురించి జాగరూకత పెంచు కుంటున్నాయి. ఐనప్పటికీ వికసించిన దేశాలని చెప్పబడేవి కూడా వీటి అతివినియోగం బారినపడుతూనే ఉన్నాయి. ఒక్క యూరోప్‌లోనే దీని వల్ల 24,000 మంది చనిపోయారు.

**సజ్జనులు బీదవారైనప్పటికీ ఉదారంగా వ్యవహరిస్తారు**

2011 సం॥లో మొదటిసారి ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రపంచ దేశాలన్నీ యాంటీబయోటిక్ మందుల వాడకంపై జాగ్రత్తలు వహించాలని నిర్దేశించింది. ప్రపంచంలో సంవత్సరానికి 40 లక్షలమంది కేవలం యాంటిబయోటిక్ మందులు వారిపై పనిచేయకపోవడం వల్ల చనిపోతున్నారు. టి.బి., మలేరియా వంటి వ్యాధుల వల్ల చనిపోయేవారి కన్నా ఈ సంఖ్య ఎక్కువ.

డబ్లు.హెచ్.ఒ. పరిశోధనల ప్రకారం భారతదేశంలో ప్రతి ఒక్కరు సంవత్సరానికి సగటున 11 సార్లు యాంటి బయోటిక్ మందులు వాడుతున్నారు. ఇవేకాక అసలు మందుల విషయంలో జరిగే దుర్వినియోగం వల్ల ఇతర సమస్యలు, రోగాలు తలెత్తుతాయి. ప్రపంచం మొత్తంలో తయారైన మందుల్లో 4.06 శాతం భారతదేశం, బ్రెజిల్, రష్యా, చైనా వంటి దేశాల్లోనే వినియోగించబడుతున్నాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఈ మందుల వాడకం, అవసరం తగ్గకపోగా ఇంకా పెరిగిపోయింది.

కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన పరిశోధన ప్రకారం మన దేశంలో సగానికన్నా ఎక్కువమంది వైద్యుని సలహా లేకుండా, వాటి నకారాత్మాక ఫలితాలు లెక్కచేయకుండా మందులు వాడతారు అని తేలింది. దగ్గు, పడిశం, జ్వరం వంటి సాధారణ ఇబ్బందులే కదా అని స్వంతంగా మందులు వేసుకోవడం వల్ల అవి ప్రమాదకరంగా మారుతున్నాయి.

అంతేకాదు. బ్రాండ్ల పేరుతో వేలకొద్దీ మందులను ఉత్పత్తి చేస్తున్నారు. నిజానికి డబ్లు.హెచ్.ఒ సంస్థ ఆమోదించినవి చాలా తక్కువ. నాణ్యత పరీక్షింపబడకుండానే వందల సంఖ్యలో మందులు బజార్లో దొరుకుతున్నాయి. అందుకే ఒకప్పుడు దివ్య ఔషధాలుగా పరిగణింపబడ్డ యాంటిబయోటిక్ మందులు ఇప్పుడు ఆరోగ్యానికి అన్నింటికన్నా హానికరమైనవిగా రూపొందాయి. అందుకే ఈ మందుల వినియోగం మీద అదుపు, అవగాహన కలిగేంచే విధంగా రాజ్యాలు సరైన విధానాలు చేపట్టాలని ఆరోగ్యసంస్థ హెచ్చరించింది. అప్పుడు వైద్యులు కూడా అనవసరంగా యాంటిబయోటిక్ మందులను ఇవ్వడం మరియు రోగులు వైద్యుల సలహా లేకుండా ఎవరికివారే అవి వాడటం వంటివి జరగకుండా అరికట్టవచ్చు.

ప్రజలు, సమాజం, ప్రభుత్వం అందరు ఈ ఆరోగ్య విషయం లోని సవాలును ఎదుర్కోవడానికి కలిసి ఆలోచించి, అర్థం చేసుకుని, పరిష్కారానికై కృషి చేయాలి. వైద్యులు, రోగులు, మందుల వ్యాపారులు అందరు బాధ్యతగా వ్యవహరించాలి. ఎందుకంటే మందుల దుర్వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, సమగ్ర సమాజానికే హానికరమైనది. ఈవిధమైన నష్టం కలగకుండా ఉండటానికి ఏకైక ఉపాయం... ప్రాకృతిక జీవనవిధానం, ప్రకృతి వైద్యాలను అవలంబించడం. జీవన విధానంలోని సకారాత్మకమైన మార్పు మన రోగనిరోధకశక్తిని పెంచుతుంది. తద్వారా జీవనశక్తి వృద్ధిచెంది రోగాలు దరిచేరవు. అప్పుడు మందుల అవసరం బాగా తగ్గుతుంది.

*– అఖండజ్యోతి, మే 2016*

*అనువాదం: జయలక్ష్మి*

## ప్రతి నిత్యం యుగనిర్మాణ సత్సంకల్పములు చదవండి

*ఆలోచనలు మారితే చేసే పనులు కూడా మారడం తథ్యం. చేసే పనులు మారినా కూడా ఆలోచనలలో మార్పు లేకుండా ఉండటం సంభవమే. కానీ ఆలోచనలలో మార్పు వస్తే వాటికి విరుద్ధంగా పనులు చాలావరకు జరుగవు. ఆలోచన బీజము, కార్యము అంకురము, ఆలోచన తండ్రి అయితే కార్యము పుత్రుడు. అందువలన జీవన పరివర్తన కార్యము ఆలోచన పరివర్తనతో ప్రారంభమవుతుంది. జీవన నిర్మాణము, ఆత్మనిర్మాణము అంటే ఆలోచనల నిర్మాణము.*

*యుగనిర్మాణ సత్సంకల్పములు ప్రతి నిత్యము చెప్పుకోవాలి. స్వాధ్యాయం చేసే ముందు ఒక్కసారి భావనా పూర్వకంగా చదువుకుని తరువాత స్వాధ్యాయం ప్రారంభించాలి. సత్సంగములలో, ఇతర సమావేశములలో వీటిని చెప్పుకోవాలి. ఒక వ్యక్తి ఒక్కొక్క వాక్యమును చదివితే, మిగిలినవారు దానిని తిరిగి చెప్పాలి. ఈ సత్సంకల్పాలు చదవడం మన నిత్యజీవితంలో చోటుచేసుకోవాలి. మానవ జీవనం యొక్క ఆదర్శము, కర్తవ్యము. ధర్మం, సదాచారము ఈ సంకల్ప మంత్రములలో భావనాపూర్వకంగా ఉన్నాయి. వీటిని చదవడం ఏ ధర్మ గ్రంథం చదవడం వలన లభించే ప్రేరణ, పుణ్యఫలం కన్నా తక్కువ కాదు.*

**విపత్తులకన్నా అనుభవాన్ని నేర్పగలిగే విద్యాలయాలు లేవు**

# నిష్కామకర్మయే నిజమైన యోగము

ఆకాంక్షలే మానవ జీవితమునకు సంకెళ్ళవంటివి. అవి మనిషిని ముందుకు సాగనివ్వవు. మనిషి మనస్సులో ప్రతిక్షణము, ప్రతిఘడియ ఆకాంక్షలు పుడుతూనే ఉంటాయి. మానవుడు వాటిని పూర్తిచేసుకొనుటలోనే మునిగి ఉంటాడు. ఐతే నెరవేరిన ఆ ఆక్షాంక్షలు అతనిని తృప్తిపరచలేవు. అలానే ఈ దిశగా చేసిన ప్రయత్నములు అతనికి సంతృప్తిన్నివ్వలేవు. ఈ చక్రము ఇలా తిరుగుతూనే ఉంటుంది. ఈ ఆకాంక్షల నుండి ముక్తి పొందాలనే ప్రయాసయే 'మనిషి తాను నిజముగా దేనినైతే కోరుకుంటున్నాడో' అది మాత్రమే అతను పొందేటట్లు చేస్తుంది. దానిని మనిషి నిష్కాముడైనప్పుడు మాత్రమే పొందగలడు.

**యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామ కారేణ ఫలే సక్తో నిబధ్యతే॥ (గీత.5/12)**

**అర్థము:** కర్మయోగి కర్మఫలమును వదలిపెట్టి భగవత్ప్రాప్తి రూపమైన శాంతిని పొందుచున్నాడు. కాగా కోరికలు కలిగిన వాడు కోరికలలో పడి ఫలమునందు ఆసక్తుడై బంధనమున పడుతున్నాడు.

ఈ ప్రపంచములో రెండు రకాలైన మనుష్య లుంటారు. 1) నిష్కామి 2) సకామి. ఎక్కువమంది ప్రజలు సకాములుగానే ఉంటారు. అంటే వారందరు ఏదో ఒక కోరికతో బ్రతుకు తుంటారు. వాటిని సదా పెంచి పోషించుకుంటూ ఉంటారు. సకాములైన వ్యక్తులు ముందుగా 'ఫలానాది కావాలి' అని ఆకాంక్షిస్తారు. ఆ తరువాత అది నెరవేరే విధముగా కర్మను ఆచరిస్తారు. మనస్సులో ఏ కోరికా లేకుండా వారు పని చెయ్యరు. ముందుగా వారు తమ స్వార్థమును చూసుకుంటారు. ఆ పిమ్మట దానికి తగిన అడుగులు వేస్తారు. ఒకవేళ ఆ పని ద్వారా ఏదైనా లాభము చేకూరనిచో ఆ పనిని విరమిస్తారు. అటువంటి మనుష్యులు మనస్సులో ఒక ప్రత్యేకమైన స్వార్థపు కోరికను పెట్టుకుని పెంచి పోషిస్తే; నిష్కామకర్మయోగులు ఎట్టి మనోకామ్యము, ఆకాంక్ష లేకుండానే కర్మాచరణ గావిస్తుంటారు. తమ పనులను భగవదర్పితము కావిస్తూ పూర్తిచేస్తుంటారు. వారు ఏ లాభాపేక్షలేకుండానే మనస్ఫూర్తిగా తమ పనులను నిర్వర్తిస్తుంటారు. ఇట్టి కర్మ యొక్క మహిమను గురించే గీతలో గానము చెయ్యబడినది. ఎందుచేతనంటే అట్టి కర్మయే మనిషిని బంధనముక్తుడిని గావిస్తుంది.

ఎప్పుడైతే మనము సకామకర్మను చేస్తూ ఉంటామో అప్పుడు ముందు మన యొక్క ఆకాంక్ష పూర్తవ్వాలి అనే లక్ష్యము స్పష్టముగా గోచరిస్తుంది. మన దృష్టి ప్రతిక్షణము మన లక్ష్యము మీదనే ఉంటుంది. మన కర్మల సహాయముతో మనము ఆ లక్ష్యమును చేరుకోవాలని తపిస్తాము. మనోవాంఛితమైన ఆ ఆక్షాంక్ష సిద్ధించే దిశగా తనకు తానుగా సాగిపోతూ ఉంటాడు. పశువుకి ఆహారము చూపించినప్పుడు అది దానిని అందు కోవాలనే తపనతో ఏ రీతిగా ఆ దిశలో అడుగులు వేస్తుందో; సకాములైన మానవులు కూడా అలాగే ప్రవర్తిస్తుంటారు. ఆకాంక్షల మధురఫలములను రుచి చూసే దిశలో మాత్రమే వారు సాగుతుంటారు తప్ప మరే దిక్కుకు అడుగులు వెయ్యరు.

నిష్కాములైన మానవుల ఎదుట ఫలానా ప్రత్యేకమైన భౌతిక లక్ష్యము నెరవేరాలనే కోరిక ఉండదు. వారి లక్ష్యము భగవత్ ప్రాప్తి! వారు ప్రతిపనిని భగవంతుని కొరకే చేస్తుంటారు. ఆయనను చేరుకునేందుకై కార్యోన్ముఖులవుతుంటారు. వారి కామ్యఫలము వారికి లభించాలనే లోభము వారి మనస్సులో ఎన్నడూ తలెత్తదు. నిష్కాముడైన వ్యక్తి అన్నివిధములా నిశ్చింతగా ఉంటే, భగవంతుడు ప్రతిక్షణము అతనిని అనుగ్రహిస్తూ ఉంటాడు. అంతేకాదు. సకాముడైన వ్యక్తికి చూపించినంత కృపను అతని మీద చూపిస్తాడు. సకాముడైన వ్యక్తి తన మనోభీష్టము ఈడేరినప్పటికినీ తృప్తిని-సంతుష్టిని పొందజాలడు. కానీ నిష్కాముడైన వ్యక్తి తన పని వలన అనుక్షణము తృప్తుడై ఉంటాడు. తనకు ఏది లభించినా దానిని భగవంతుని ఆశీర్వాదముగా భావించి స్వీకరిస్తాడు. అలా చేయుట ద్వారా అందరి కంటే ఎక్కువ ప్రసన్నముగా ఉంటూ ఆనందమును ఆస్వాదిస్తూ ఉంటాడు.

సకాముడైన వ్యక్తి భగవంతుడిని తన జీవితాంతం బిచ్చగాని వలె కోరిక తీర్చమని యాచిస్తూ ఉంటాడు. ఐతే అతనికి ఎంత లభించాలో దానికన్నా తక్కువ-రవ్వంత మాత్రమే పొంద గలుగుతాడు. తానేదో పొందానని అతనికి అనిపించినప్పటికీ అతనికి ఏదైతే చేతికందినదో అది అతనినెన్నడూ తృప్తిపరచ

**గర్వంతో విర్రవీగిన వ్యక్తికి పతనం తప్పదు**

లేదు. ఇదే తికమక కలిగించే విషయము. మరొకవైపు నిష్కాముడైన సాధకుడు ఎన్నడు ఏదీ అపేక్షించడు. ఐనా కూడా ఒక చక్రవర్తి వలె అతనికి సమస్తము లభిస్తాయి. అతను నిత్యసంతోషిగా ఉంటాడు.

**భగవంతుడిని మనసారా ప్రార్థించటము – ఏదైనా అపేక్షించటము రెండూ వేర్వేరు.** సకాముడైన వ్యక్తి యొక్క ప్రతి ప్రార్థన కోరికలతో కూడి ఉంటుంది. అది అతనికి జీవితములో ఉపయోగపడేదిగా ఉంటుంది. మరోవైపు నిష్కామి చేసే ప్రతి ప్రార్థన భగవంతుడిని భక్తితో పిలిచేదిగా ఉంటుంది, లోకహితముతో నిండి ఉంటుంది. ఆ ప్రార్థనలో పరహితభావన తొంగిచూస్తు ఉంటుంది. సకాముడైన వ్యక్తి ఎన్నటికీ భగవంతుని చరణసన్నిధికి చేరబోడు. తన వ్యక్తిగత అభిష్టాలనే అంటిపెట్టుకొని ఉంటాడు. కానీ నిష్కాముడైన భక్తుడు భగవంతుని పదకమలములను చేరుకొనుటకు తన మనోభీష్టముల నన్నింటినీ త్యజిస్తాడు. కామనలు అనే ఆటంకములు– అడ్డంకులు వాటికై అవే అతని మార్గము నుండి తొలగిపోతాయి. కోరికలు అతనిని ఆకర్షించలేవు. కనుక అతను నేరుగా భగవంతుని సమ్ముఖమునకు చేరుకుంటాడు.

గీతలో ఈ కారణముగానే నిష్కామకర్మ గురించి చెప్పబడినది. ఎందుకంటే కేవలము ఒక్క నిష్కామకర్మ మాత్రమే ప్రాపంచిక భవబంధనముల నుండి ముక్తులను గావిస్తుంది. జీవితములో భయంకరమైన దారుల వెంట సైతము ముందుకు నడిపించగలదు. మరోప్రక్క సకామకర్మ ముందుకే సాగనివ్వదు. 'దాని ద్వారా నేను ముందుకు వెళుతున్నాను' అన్న భ్రమను మాత్రమే కలిగిస్తుంది. మనిషి ఎక్కడున్నాడో అక్కడే ఉంటాడు తప్ప పురోగతి ఉండదు. కోరికల యొక్క రూపములో తేడాయైతే వస్తుందేమో గానీ సకామకర్మ ద్వారా కోరికల పట్టు నుండి విడివడుట అసాధ్యము.

గడియారములో ముళ్ళు తిరుగుతు ఉంటాయి. కాల చక్రము తిరుగుతూ ఉంటుంది. ఐతే గడియారములోని ముళ్ళు తిరిగి తిరిగి మరల అవే సంఖ్యల వద్దకు వస్తుంటాయి. అదే రీతిలో మనిషి కూడా కోరికలకు వశీభూతుడై జీవిస్తూ ఉంటాడు. మళ్ళీ మళ్ళీ జీవితములో తాను ఇదివరకు మజిలీ చేసిన మజిలీల వద్దకే వస్తూ ఉంటాడు. కానీ **నిష్కాముడైన సాధకుడు తన నిష్కామకర్మ ద్వారా నిర్మలమైన నదీప్రవాహము వలె ముమ్ముందుకు సాగిపోతుంటాడు. సాగరరూపుడైన ఆ పరమేశ్వరుని చెంతకు చేరుకుంటాడు. పెద్ద పెద్ద అవరోధములు సైతము అతనిని నిలువరించలేవు, అతను సునాయాసముగా ప్రయాణిస్తూ ఈశ్వరుని సమక్షమునకు చేరుకుంటాడు.**

ఈ కారణము చేతనే శ్రీకృష్ణుడు 'ఈ ప్రాపంచిక జీవితమునే అంటిపెట్టుకుని ఉండిపోకుండానూ, ప్రపంచపు మోహజాలంలో చిక్కుకోకుండా ఉండటానికీ నిష్కామకర్మ చెయ్యమని' గీత ద్వారా అర్జునుడికి ఉపదేశిస్తాడు. మనిషి భ్రమ అనే మాయలో చిక్కుకు పోయేటట్లు ఈ ప్రపంచము వలపన్నుతుంది తప్ప ఎక్కడికి వెళ్ళనివ్వదు. సాధకుడు కేవలము ఒక్క నిష్కామ కర్మాచరణ గావించియే ఈ ప్రాపంచిక మాయాజాలము నుండి బయట పడగలదు. ఆ కర్మ అతనిని భగవంతుని శ్రీసమ్ముఖమునకు చేరుస్తుంది. 'సకామకర్మ వలన అర్థవంతమైనదేదీ పొంద జాలము. ఒకవేళ ఏదైనా లభించినా అది అంతంతమాత్రంగానే ఉంటుంది మరియు నిష్కామకర్మ చేయుట వలన పరమ పోషకుడైన ఆ ఈశ్వరుడు మనిషికి తీసుకోలేనంత ఇవ్వకుండా ఉండలేదు' అన్న జ్ఞానము కలిగినటువంటి సాధకుడే యోగి అవుతాడు. అట్టి సాధకుడు చివరకు నిష్కామకర్మయోగిగా సాధన యొక్క చరమసీమలను చేరుకుంటాడు.

*– అఖండజ్యోతి,*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**

**యుగశక్తి**  **గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి!!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**ఆలోచన మంచిదయితే ఆచరణ మంచిదవుతుంది**

# ఇప్పటివరకు మనం పిరమిడుల రహస్యాన్ని తెలుసుకొనలేకపోయాం

ఈజిప్టులోని గొప్ప పిరమిడులు తమ సౌందర్యం మరియు నిర్మాణశైలి కారణంగా ఈనాడు కూడా ప్రపంచమునకు ఆకర్షణాకేంద్రాలుగా నిలిచి ఉన్నాయి. వీటి రహస్యాలు పులకింపజేస్తూ నేడు కూడా ఎదురుగా నిలిచి ఉన్నాయి. కానీ వీటి మాయాజాలపు రహస్య పరదాలు తొలగించబడలేదు. సమాధుల(మమ్మీల)ను సురక్షితంగా ఉంచే ఈ పిరమిడ్స్ అనేక పరిష్కరింపబడని పొడుపుకథలు, పుకార్లతో నిండి అద్భుతం మరియు ఆశ్చర్యకరమైనవిగా ఉన్నాయి. మానవీయ సభ్యత ఉదయించిన సమయాన నిర్మించబడిన ఈ పిరమిడులు నేటి అధునాతనమైన పద్ధతులకు గొప్ప సవాలుగా నిలిచాయి. ఎందుకనగా ఈనాటి టెక్నిక్స్ వీటి రహస్యాల చిక్కుముడులను విప్పలేకపోతున్నాయి, పిరమిడుల వంటి మరే నిర్మాణాలను చేయలేకపోతున్నాయి.

ఈజిప్టులోని పిరమిడులను ప్రపంచంలోని 7 వింతలలో ఒకటిగా లెక్కిస్తారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీటిని ఇప్పటివరకు తెలుసుకోలేదు, అర్థం చేసుకోలేదు. అందువలన వీటిపట్ల, 'రోమాంచితం గావించే రహస్యాలను పొడసూపే బృహత్తరంగా కనిపించే ఈ కట్టడాలలో ఏమున్నది?' అనే జిజ్ఞాస రేగుట స్వాభావికమే. మరణానంతరం పరలోకంలో జీవితాన్ని ఏర్పాటు చేసుకునేందుకు తీవ్రతరమైన ఆకాంక్ష, తీవ్రవాంఛతో, విశాలమైన మరియు మాయాజాలాన్ని అభివ్యక్తీకరించే ఈ పిరమిడులను నిర్మించి 45 శతాబ్దాలు గడిచినప్పటికి, ఈ సుదీర్ఘ కాలావధితో పాటు వీటి రహస్యాల లోతులు కూడా పెరుగుతూనే ఉన్నాయి. నిశ్శబ్దతతో నిండిన విశాలమైన ఎడారులలో అతి పెద్ద రాతిబండలను బహు దూరంగా ఉన్న పర్వతపంక్తుల నుండి తీసుకొనివచ్చి వాటితో రేఖాగణిత ప్రక్రియ ద్వారా గావించిన బృహత్తరమైన పిరమిడుల నిర్మాణం, గడచిన కాలపు మానవీయ పరాక్రమానికి సాక్ష్యంగా నిలుస్తూనే, దానితోపాటే –అభివృద్ధిచెందిన ప్రగతిశీలురని చెప్పబడే ఆధునిక విజ్ఞానవేత్తలకు పరిశోధనా వస్తువులుగా ఉన్నాయి. ఆశ్చర్యమును రేకెత్తించే ఈ నిర్మాణాల దిశాధారను ఇప్పటివరకు సరైన రీతిలో తెలుసుకుని, అర్థం చేసుకోలేదు.

కాహిరాలో ఎత్తైన పిరమిడులతో పాటు వేరువేరు ఆకారాలు గల 67 పిరమిడులు అక్కడక్కడా(చెల్లాచెదురుగా) ఉన్నాయి. వీనిలో కేవలం గిజాలోని ఉన్నతమైన పిరమిడే ప్రపంచంలోని 7 వింతలలో లెక్కించబడుతున్నది. ఈజిప్ట్‌లోని ప్రాచీనమైన రాజవంశపు 40 వ తరానికి చెందిన రెండవ చక్రవర్తి ఖుఫు 4500 సంవత్సరాలకు పూర్వం వీటి నిర్మాణం కావించాడు. ఈ పిరమిడులతో పాటు మరో రెండు చిన్న పిరమిడులు నిర్మించబడ్డాయి. ఖుఫు యొక్క కుమారుడు మరియు మనవడుల కొరకు ఇవి తయారుచేయబడ్డాయి అని భావిస్తారు. 481 అడుగుల ఎత్తు గల ఈ చతురస్రాకార పిరమిడులలో ఖుఫు సమాధి ఉన్నచోట పలు విశాలమైన గదులున్నాయి. వీటిలో ఒకటి రాజుగారి గది. అక్కడే ఖుఫు సమాధి ఉంది. సరిగ్గా దీనికి క్రిందన రాజుగారి గదికంటే కొంచెం చిన్నదైన రాణి యొక్క గది ఉంది. ఈ విశాలమైన గది(రాజుది) తన విశాలత కారణంగా అద్భుతమైనదే కాక; దీనికున్న రెండు సొరంగాలు కూడా అత్యంత ఆశ్చర్యకరమైనవి. రెండు గదుల నుండి సాగే ఈ సొరంగమార్గాలు పైపైపున వంపు తిరిగి, చివరి అంచున మూసుకుని ఉంటాయి. ఈ సొరంగాల రహస్యం నేటికీ అలానే నిలిచి ఉంది. వీటి వెనుకనున్న రహస్య మేమిటి? అనేది ఎవ్వరికీ తెలీదు. ఇది పరిశోధనాకర్తలతో పాటు, జన మానసములకు కూడా కుతూహలమును కలిగించే విషయం.

సుదీర్ఘకాలం పాటు నిలచియున్న ఈ పిరమిడులు మానవుల భావనలను కుదిపివేస్తూ, చకితులను గావిస్తూ వస్తున్నాయి. వీటియొక్క ఒక్కొక్క రాయి వేల సంవత్సరాల ఆకర్షణీయమైన చరిత్రను, కథలను–కింవదంతులను(పుకార్లను) తనలో నింపుకొని ఉంది. బాహ్య అంతరిక్షం నుండి వచ్చిన ఏలియన్స్ (aliens) నుండి ఉన్నతమైన సాంకేతికతను ఉపయోగించి ఖుఫే బృహత్తరమైన పిరమిడులను నిర్మించాడు అనేది కొంతమంది విద్వాంసుల అభిప్రాయం. కొంతమంది పరిశోధకులు 'అట్లాంటిక్‌కి చెందిన ప్రజలు వీటిని నిర్మించారు' అని అంటారు. అట్లాంటిక్‌కి చెందిన ప్రజలే ఏలియన్స్? అనేది ఇప్పటికీ ఒక రహస్యంగానే ఉంది. ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నతో పోటీపడుతూ 'ఈ విశాలమైన గొప్ప కట్టడాల క్రింద మానవజాతి యొక్క చరిత్ర మరియు భవిష్యత్తు లిఖించబడి లేదా దాచబడి లేదుగదా?' అనే మరో ప్రశ్న తలెత్తుతున్నది. ఈ సందర్భంగా విశేషజ్ఞులు

**మనస్సు నిర్మలమవుతే ఆరోగ్యం స్వంతమవుతుంది**

ఈ పిరమిడుల యొక్క ఆకృతి ఉత్తర-దక్షిణ అక్షాంశం మీద ఉన్న కారణంగా ఇవి బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న తెలిసిన, తెలియని శక్తులను తమలో సమీకరించుకుని, తమలోపల ఒక శక్తివంతమైన వాతావరణాన్ని తయారుచేసుకొనుటలో సమర్థవంతమైనవి-అని అభిప్రాయపడుతున్నారు. ఈ శక్తి జీవించి ఉన్నవాటిని లేదా మృతమైనవాటిని, జడములను లేక చైతన్యం కలిగిన అన్నిరకాలైన వస్తువులను ప్రభావితం చేస్తుంది.

పిరమిడులలో ధనాగారం ఉన్నదని భావించి అనేకమంది వ్యక్తులు దానిని పొందుటకు ఆతురతతో ఉవ్విళ్ళూరారు. ఈ క్రమంలో క్రీ.శ. 820 లో అఖ్‌ఖలీఫా అబ్దుల్లాహ్ అల్‌మానూమ్ అనే వ్యక్తి ఖుఫా యొక్క కోశాగారాన్ని వెదకుటకు కంకణం కట్టుకున్నాడు. ఐతే పిరమిడుల యొక్క అనేక రహస్య మార్గములను ఛేదించలేని కారణంగా అతని కోరిక నెరవేరలేదు. ఇలాంటి ఎన్నో ప్రయత్నాలు ఫలించలేదు. 'ఏదియేమైనా ఈ పిరమిడులు ఏ పద్ధతిలో నిర్మితం గావించ బడ్డాయి? తయారుచేయబడ్డాయి? అనే స్వ-నిర్మాణ రహస్యాలను తమలో నింపుకొని ఉన్నాయి.' వీటి రహస్యాలను మొట్టమొదట వర్ణన చేసి, అవగాహన కలిగించినవాడు చరిత్రకారుడు హెరోడోట్స్. ఈ చరిత్రకారుడు క్రీస్తుకు పూర్వం 450 సంవత్సరాలకు మునుపు 'ఒక లక్షమంది సేవకుల విశాలమైన సైన్యం 20 సంవత్సరాల పాటు నిరంతరం పనిచేసి గిజాలోని ఉన్నతమైన పిరమిడులను నిర్మించింది' అని చెప్పాడు. ఐతే తరువాత చెయ్యబడిన పరిశోధనల ఆధారంగా ఇది తప్పు అని నిరూపించబడినది.

ఆధునిక పరిశోధనల ఆధారంగా విజ్ఞానవేత్తలు 'ఫరామ్ ఈ పిరమిడుల నిర్మాణమునకుగాను ఒక లక్షమంది ప్రజలను పనులకు నియమించాడు. కానీ ఇలా ఒక పూర్తి సంవత్సరం కాదుకాని, కొన్ని నెలలు మాత్రమే నియమించడం జరిగి ఉండవచ్చు' అని చెప్పారు. గిజా పిరమిడుల యొక్క డైరెక్టర్ జనరల్ డా॥ జాహీహవాజ్ మరియు చికాగో విశ్వవిద్యాలయ వాస్తుశిల్పి మార్క్‌లెనర్‌లు వీటిని గూర్చి అందరికన్నా ఎక్కువ శ్రమ చేశారు. విశాలమైన పెద్ద రాళ్ళను ఇంత ఎత్తునకు ఎలా చేర్చగలిగారు? దీనికి సంబంధించి మార్క్‌లెనర్ 'తఫలా' అనే పేరు గల సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తఫలా అనేది ఒకరకమైన మట్టి(మృత్తిక). అది ఎండిపోయినప్పుడు అత్యంత కఠినంగా ఉంటుంది. కానీ తడిసినప్పుడు అత్యంత మృదువు (తేలిక) గా అవుతుంది. అలాంటి సమయంలో రెండు టన్నుల రాళ్ళను కూడా తేలికగా జరుపవచ్చు. ఖెజర్ అభిప్రాయం ప్రకారం కూలివారు రెండు నుండి రెండున్నర టన్నులు గల 23,00,000 రాళ్ళను ప్రతి మూడు నిమిషాలలో ఒకే వేగంతో 147 మీటర్ల ఎత్తునకు చేర్చారు.

పెంటగాన్‌ను సైతం నిర్మించిన అమెరికాలోని డీ.ఐ.ఎం., జె.ఐ.ఎం. అను అతి పెద్ద నిర్మాణసంస్థ ఇలా స్పష్టీకరించినది. 4,000 నుండి 5,000 మంది కార్మికులు 20 నుండి 40 సంవత్సరాల లోపు ఇలాంటి పిరమిడులను నిర్మించగలరు. 481 అడుగుల ఎత్తున్న ఈ ఆశ్చర్యకరమైన పిరమిడులలో అమెరికాలోని ఎంపాయిర్ స్టేట్ బిల్డింగ్‌తో పోలిస్తే రెండింతల సామగ్రి ఉపయోగించబడినది. గిజాలో ఉన్న మూడు పిరమిడు లలో ఎన్ని రాళ్ళు ఉపయోగించబడ్డాయంటే – వీటితో ఫ్రాన్స్ యొక్క నలుదిక్కులా 10 అడుగుల (సుమారు 3 మీటర్లు) ఎత్తు, ఒక అడుగు (సుమారు 30 సెం.మీ.) వెడల్పు గల గోడను నిర్మించవచ్చు. అతి పురాతనకాలంలో ఈ పిరమిడులను నిర్మించుటలో జ్ఞానం, సాంకేతికత సరియైన రీతిలో ఎలా ప్రయోగించబడ్డాయి? అనే విషయాన్ని ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది. 20 వ శతాబ్దంలోని వంతెనల రూపురేఖలతో సమానంగా పిరమిడుల బాహ్య సరిహద్దు గోడల రాళ్ళ లోపల (వాటిని అతుకుటకు) బాల్స్-సాకెట్స్ ఉపయోగించబడ్డాయి. ఇతర వస్తువుల వలెనే పిరమిడులు కూడా ఎండకు వ్యాకోచించి, చలికి సంకోచిస్తాయి. ఆశ్చర్యం కలిగించే విషయ మేమిటంటే వీటిని నిర్మించుటలో భూకంపనిరోధవిధానం కూడా దృష్టిలో ఉంచుకొనబడినది. ఒకవేళ ఈ టెక్నిక్ సూక్ష్మతను లేక విధానమును దృష్టిలో పెట్టుకొనకుండా నిర్మించి ఉన్నట్లయితే ఇప్పటివరకు అవి నిలిచి ఉండేవికావు.

డా॥ టామ్పకిన్స్, డా॥ పాటర్, డా॥ విలశుల్ వంటి ప్రఖ్యాతిగాంచిన వైజ్ఞానికులు పిరమిడాలజీ మీద లోతైన అధ్యయనం-అన్వేషణ చేశారు. పిరమిడాలజీ విశుద్ధమైన ఒక వైజ్ఞానిక శాఖ. దానిలో పిరమిడ్స్‌యొక్క నిర్మాణ రహస్యాలను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయబడుతుంది. ఈ వైజ్ఞానికుల పరిశోధనా ఫలితం ఆధారంగా పిరమిడుల లోపల కొన్ని విలక్షణమైన శక్తితరంగాలు క్రియాన్వితమై ఉంటాయి అని తెలుస్తున్నది. ఈ తరంగాల ద్వారా కేవలం చేతనతత్వమే కాక, జడపదార్థములు కూడా ప్రభావితమౌతాయి. ప్రయోగ పరీక్షల ద్వారా తెలిసినదేమనగా ఈ నిర్మాణాల లోపలి

**భోగాలకు బానిస అయితే రోగాల బారిన పడతాడు**

భాగంలో-క్రిందన ఒకింట మూడొంతుల భాగం(1/3), పైన రెండింట మూడొంతుల భాగము(2/3)ల కూడలి మీద పురాతన నాణెములు, రేజర్‌బ్లేడ్‌లు ఉంచినప్పుడు శక్తి ప్రభావం వలన మెల్లగా నాణెముల మీద మెఱుపు వచ్చింది, బ్లేడ్ మరింత పదునెక్కింది అని. దీర్ఘకాలం వరకు పాలను అక్కడుంచినప్పుడు పాడవకపోవడమే కాక; తరువాత అవి వాటికై అవే పెరుగుగా మారిపోయాయి కానీ విరిగిపోలేదు.

ఫ్రాన్స్‌కి చెందిన వైజ్ఞానికుడు ఎల్.తురెన్ తన రచనలో పిరమిడుల నిర్మాణమును గూర్చి సువిస్తృతమైన వర్ణన చేశాడు. దీని ననుసరించి పిరమిడులు ఉత్తర-దక్షిణ అక్షాంశం మీద నిర్మించబడ్డాయి. అయస్కాంత-బ్రహ్మాండీయ కిరణాలతో ఈ విలక్షణమైన కట్టడాలు తప్పక సంబంధం కలిగి ఉన్నాయి అనేది కూడా మరో వైజ్ఞానిక రహస్యం. భూగర్భశాస్త్రవేత్తలు ఉత్తర-దక్షిణ ధ్రువాలను కలిపే రేఖనే పృథ్వి యొక్క అయస్కాంత రేఖగా భావిస్తారు. అయస్కాంతశక్తులు విద్యుత్తరంగాలతో నేరుగా సంబంధాన్ని కలిగివున్నాయి. ఈ తథ్యం స్పష్టీకరించే విషయం ఏనమగా పిరమిడులలో బ్రహ్మాండాన వెదజల్లబడి ఉన్న అయస్కాంతత్వంలో వెలుగొంది ఉన్న అయస్కాంత కిరణాలను సమీకరించే అద్భుతమైన సామర్థ్యమున్నది. ఈ కిరణాలే ఏకత్రితమై లోపల ఉన్న వస్తువులు లేక నూతన జీవధారుల పైన తమ ప్రభావాన్ని చూపిస్తాయి. వీటి నిర్మాణంలో ఉపయోగించబడిన గ్రానైట్‌రాళ్ళు కూడా సూక్ష్మతరంగాలను సంగ్రహించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

'సైకిక్ డిస్కవరీస్ బిహైండ్ ది ఐరన్ కర్టెన్' అను ఒక పుస్తకంలో పిరమిడుల లోలోపల విద్యుదయస్కాంత తరంగాలు ఉన్నాయని చెప్పబడినది. ఈ బ్రహ్మాండీయశక్తి ఎంత శక్తి వంతమైనదంటే వీటిలోపల ఉంచబడిన ఏ పదార్థము నైనా కుళ్ళిపోనివ్వదు. బహుశా ఈ కారణంగానే వీటి లోపల వేలాది సంవత్సరాలుగా ఒక ప్రత్యేక స్థానంలో ఉంచబడిన మృతదేహాలు ఈనాటికీ కుళ్ళి నశించిపోకుండా సురక్షితంగా ఉన్నాయి. ఈ కారణాలను స్పష్టపరుస్తూ 'పిరమిడ్ ఆఫ్ పవర్' లో ఏ ప్రత్యేక రేఖాగణిత ఆధారంగా అవి నిర్మించబడినాయో వాటి కారణంగా పిరమిడుల లోపల ప్రత్యేకతరహా శక్తి ప్రవాహం నిర్మించబడుతున్నది. సూక్ష్మమైక్రోవేవ్ సిగ్నల్స్ సదా ప్రకంపితమౌతూ ఉంటాయని వర్ణించబడివుంది. వీటి నిర్మాణం ఎప్పుడో ఏదో ఒక ఉన్నత ఆదర్శపూర్తి కొరకు జరిగి ఉంటుందనేది టామ్‌కిన్స్ అభిప్రాయం.

ఈజిప్టుకు చెందిన బృహత్తరమైన పిరమిడుల లోపల చేతనాత్మకపరమైన మార్పు యొక్క అనుభూతిని కలిగించే కొన్ని చారిత్రక సంఘటనలు కూడా సంఘటిల్లాయి. 1798 వ సంవత్సరంలో నెపోలియన్ ఈజిప్టు మీద విజయాన్ని సాధించాడు. అతను ఈజిప్టుకు చెందిన ఈ పిరమిడుల లోపల కొంత సమయాన్ని ఏకాంతంగా గడిపాడు. 'సీక్రెట్ ఆఫ్ గ్రేట్ పిరమిడ్' పుస్తకంలో పీటర్ హాప్‌కిన్ ఈ సంఘటనను గురించి వివరిస్తూ ఇలా వ్రాశాడు. 'బయటకు వచ్చిన నెపోలియన్ ముఖం మీద అద్భుతమైన దీర్ఘాలోచన పొడసూపింది.' 1930 వ దశకంలో సంకల్పనిధి, దార్శనికుడు, రచయిత అయిన డా॥ పాల్‌బ్రంటన్ పిరమిడుల యొక్క మధ్య గదిలో ఒక రాత్రి గడిపాడు. అక్కడ అతనికి గుప్త శక్తుల అనుభూతి కలిగింది. అనుభూతుల వివరణ "ఏ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఈజిప్టు" అనే పుస్తకంలోను, "ఎ విజ్‌డమ్ ఆఫ్ ఓవర్‌సెల్ఫ్" అను పేరు గల తన రచనలోను అతను పిరమిడులకు చెందిన కొన్ని రహస్యాలను గూర్చిన సంకేతాలనిచ్చాడు. పిరమిడుల రహస్యంలో నిజానికి మానవుని యొక్క అతని అస్తిత్వ రహస్యమే ఉంది. వీటి రహస్యమైన గదులు మరియు పురాతనమైన దస్తావేజు (డాక్యుమెంటు) లన్నీ మానవీయ ప్రకృతిలో వెలుగొంది ఉన్నాయి.

పిరమిడుల రహస్యాన్వేషణలో పలు ప్రశ్నలు రేకెత్తు తున్నాయి. పిరమిడుల పొరల(తలాల)లో ఏ విజ్ఞానం కప్పబడి ఉంది? వీనిలో ఉన్న శక్తి యొక్క స్వరూపమేమిటి? వీనిలోని శక్తికి – బ్రహ్మాండంలోని శక్తితో సంబంధమున్నదా? ఒకవేళ ఉంటే మానవీయ చేతనను వృద్ధిచేయుటలో అది ఎంతవరకు సహాయపడుతుంది? పిరమిడులలో ఇంకా ఎన్ని రహస్యాలు వెలుగుచూడవల్సి ఉన్నాయి? మానవీయ చేతన యొక్క సమగ్ర మైన అన్వేషణ చెయ్యకుండా వీటి పరిశోధన అసంపూర్ణంగానే మిగిలిపోతుందనిపిస్తుంది. పిరమిడుల అధ్యయనం లేక రహస్యాల ప్రకటీకరణలో కూడా మానవీయ చేతన యొక్క ప్రభావోత్పాదక సామర్థ్యం లేక దాని అంశం ఒక మహత్త్వ పూర్ణమైన మాధ్యమం. వీటి రహస్యాల మూలం మానవీయ చేతన యొక్క రహస్యాలలో దాగి ఉంది. ఎంత వేగంతో మనం మానవీయ చేతన యొక్క వివిధ తలాలను అర్థం చేసుకుంటామో; అంత మోతాదులో మనం పిరమిడులలో దాగి ఉన్న రహస్యాలను అర్థం చేసుకొనగలం.

– అనువాదం: *లక్ష్మీరాజగోపాల్*

**సాధనకు అంకితమయితే మానవుడు యోగి అవుతాడు**

మహిళా జాగరణ

# మహిళ వాత్సల్యమూర్తి, మహిమాన్విత

విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ ఇలా అన్నారు. "పవిత్రురాలైన మహిళ సృష్టిలోని సర్వోత్తమ కృతి. సృష్టిలోని వాత్సల్యం, స్నేహం, మమత, ప్రేమ అనే అమృతధారలు మహిళ హృదయం నుండి వెలువడి ఈ ప్రపంచానికి అమృత దానం చేస్తున్నాయి." కవి రస్కిన్ ఇలా అన్నారు "మాత హృదయం స్నేహపు సెలయేరు." సృష్టి ప్రారంభం నుండి నిరంతరం ప్రవహిస్తూ అది మానవతను ఆర్ద్రం చేస్తోంది. మాతృదేవోభవ అని ఉపనిషత్తుల్లో మహర్షి మాతను లోకోత్తరంగా సన్మానించారు. వాస్తవానికి, మామూలు ప్రాణులతో నిండిన ఈ భూగోళానికి మాతృహృదయం ఒక వరం.

**మాతా ధరిత్రు, జననీ దయార్ద్రహృదయా శివా ।**
**దేవీ త్రిభువన శ్రేష్ఠా నిర్దోషా సర్వ దుఃఖహా ॥**
**ఆరాధనీయా పరమా దయా శాంతిః క్షమాధృతి ।**
**స్వాహా స్వధా చ గౌరీ చ పద్మాచ విజయా జయా ॥**

వేదవ్యాసుడు మహిళను పై 21 పేర్లతో సంబోధిస్తూ ఆమె గుణాలను గానం చేశాడు. ఆయన ఇంకా ఇలా అన్నారు.

**నాస్తి గంగా సమం తీర్థం నాస్తి విష్ణు సమః ప్రభుః ।**
**నాస్తి శంభు సమః పూజ్యో నాస్తి మాతృసమో గురుః ॥**

అనగా – గంగతో సమానమైన తీర్థం లేదు. విష్ణుమూర్తితో సమానుడైన ప్రభువు లేడు. శివునితో సమానమైన పూజ్యుడు లేడు. మాతతో సమానమైన గురువు లేడు.

బ్రహ్మ ఈ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. విష్ణుమూర్తి దానిని పెంచి పోషిస్తాడు. సూక్ష్మమైన ఈ ఆధ్యాత్మిక రహస్యాన్ని స్థూలరూపంలో మాతలో చూడవచ్చు. త్రిమూర్తుల దైవీశక్తులు ఈ భూమిపై మాతరూపంలో తమ పనులు చేస్తున్నాయి.

**యాదేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా ।**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥**

అనగా – సృష్టి రచన, పోషణ చేసే దైవీశక్తి ఈ స్థూల జగత్తులో మాతరూపంలో తన పనిచేస్తోంది. కనుక మాతృరూపి అయిన మహిళకు పలుమార్లు నమస్కరిస్తున్నాను.

ఈ సత్యాన్ని ద్రష్ట, మనీషి అయిన ఒక వ్యక్తి ఇలా వర్ణించాడు – "పరమేశ్వరుని తర్వాత మనం అత్యధికంగా ఋణపడి ఉన్నది మహిళకే. మొదట జన్మ ఇచ్చినందుకు, ఆ తర్వాత దీనిని జీవించడానికి యోగ్యంగా చేసినందుకు. "సారాంశం ఏమంటే –మానవజీవనంలోని అవకాశాలన్నింటికీ మూలం తల్లి ప్రేమ, ఆమె త్యాగం, ఆమెలోని మహత్తరసేవలలో ఇమిడి ఉంది.

మహిళ ఈ గొప్పతనాన్ని మానవజాతి ఆమెకు ఎంతగానో ఋణపడి ఉండడాన్ని గుర్తించి అనాది నుండి మనిషి ఆమెను ఆదరణీయంగా, పూజనీయంగా పరిగణించాడు. ఆమెను తగు విధంగా ఆదరించాడు, సత్కరించాడు. కాళి, సరస్వతి, లక్ష్మి ఇతర దైవీశక్తుల రూపంలో మహిళను పూజించడం అనేది ఘనంగా సన్మానించడానికే.

**పిల్లలకు మొదటి గురువు తల్లి:** మహిళ తల్లి రూపంలో పిల్లలకు మొదటి గురువు. తల్లికి వివిధ విషయాలలో లభించిన అవగాహన, అనుభవం పిల్లల జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. తల్లి ఉచ్చారణ నుండే, ఆమె భాష నుండే వారు భాషాజ్ఞానాన్ని పొందుతారు. జ్ఞానం జీవితమంతటిలో సంపాదించే భాషాజ్ఞానానికి మూలాధారం అవుతుంది. ఈవిధంగా పిల్లల చదువు సంధ్యలకు వారిని యోగ్యులుగా రూపొందించేందుకు పునాదిని నిర్మిస్తుంది. ఆ పునాది మీద పిల్లల యోగ్యత, విద్య, జ్ఞానం అనే భవనం నిర్మాణం అవుతుంది. తల్లి పాత్ర చనుబాలు ఇవ్వడం, స్నేహం అందించడం వరకే పరిమితం కాదు. వాటితోపాటు ఆమె పిల్లలకు వికసించడానికి, ఉన్నతి పొందడానికి, పురోగమించడానికి సూక్ష్మమైన ప్రేరణాశక్తిని కూడా ఇస్తుంది. తల్లి బోధించే ఉన్నత ఆదర్శాలు, త్యాగ బలిదానాల కథలు, ఉపదేశాలు, మామూలు భాషలో అందించే జ్ఞానం పిల్లల జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయి. జీవితమంతా పెద్ద పుస్తకాలు చదివినా, డిగ్రీలు సంపాదించినా అంతటి జ్ఞానం లభించదు. తల్లి ప్రసాదించిన ప్రాథమికమైన

**మంచి అలవాట్లే ఆరోగ్యానికి పునాదులు**

జ్ఞానప్రేరణ ఆధారంగా పిల్లలు అనంతర కాలంలో వివిధ విషయాలలో విస్తృతమైన జ్ఞానాన్ని పొందుతారు.

పిల్లల పట్ల తల్లి స్నేహం, ఆమె మమత దయామయుడైన పరమాత్మ ప్రకాశకిరణాలు. శిశువు పట్ల మాత హృదయంలో పొంగిపొరలే స్నేహం ప్రకృతి ద్వారా జీవన రక్షణకు పరమేశ్వరుడు ప్రసాదించే వరం. తల్లి ఈ స్నేహాన్ని, మమతను సహజంగా పిల్లల పోషణలో వినియోగిస్తుంది. మాతృ ఋణం అన్నింటినీ మించిన ఋణమని మహర్షులు ప్రవచించారు. వారు మహిళకు సమాజంలో గౌరవస్థానాన్ని, పూజ్యస్థానాన్ని ఇచ్చారు. ఆమెను ఆదరించారు, సత్కరించారు. ఆవిధంగా మాతృ ఋణం తీర్చుకున్నారు. మాతృ ఋణం తీర్చుకోవాలని భావితరాలకు సందేశం ఇచ్చారు. మహిళ ప్రతిష్ఠను, గౌరవాన్ని చిరస్థాయిగా ఉంచాలని మతగ్రంథాలన్నీ ఉపదేశిస్తున్నాయి.


**మాతృశ్చ యుద్ధితం కించిత్ కురుతే భక్తినః పుమాన్ ।**
**తద్ధర్మహి విజానీయా దేవం ధర్మవిదో విదుః ॥**

అనగా మాతృశక్తి హితం కోసం పురుషుడు చేసే కర్మ అతడి ధర్మమే. మహిళాజాతిలో దైవీశక్తిని దర్శించి ఆ జాతిని సేవించడం గృహస్థుడు చేసే మహా తపస్సు.


**భారతీయ సంస్కృతిలో మహిళకు గౌరవస్థానం:** భారతీయ సంస్కృతి మహిళకు ఇచ్చిన ఈ గౌరవస్థానం మాటలకు పరిమితం కాలేదు. అడుగడుగునా అది ఆచరణలో ప్రతిబింబించింది. భారతీయ సమాజం మహిళాశక్తి చేసిన మహోపకారాలను గుర్తించింది. మాతృశక్తిని పూజించింది, సత్కరించింది. మాతృశక్తి ఉన్నతస్థానం ఇచ్చింది. ఫలితంగా మహిళ హృదయం నుండి సహజంగా స్నేహం, వాత్సల్యం, మమత అనే త్రివేణి భారతభూమిలో ఉప్పొంగి ప్రవహించింది. దానిని త్రాగి భారతీయజీవనం అజరామరం అయింది. భారతీయులు లౌకిక జీవనంలో, పారలౌకిక జీవనంలో అద్భుతమైన ప్రగతి సాధించారు. చరిత్ర అందుకు సాక్ష్యం ఇస్తోంది.

పత్నిగా, పుత్రికగా, సోదరిగా మాతృతత్వం మనకు నలు వైపులా వ్యాపించి ఉంది. అది శ్రద్ధతో పూజింపదగినది. దేవత్వపు ఈ ప్రత్యక్ష ప్రతిమను గౌరవించడం అభినందనీయం. ఈ రహస్యాన్ని గ్రహించినంతవరకు పురుషుడు తన దేవత్వాన్ని నిలుపుకోగలిగాడు. కానీ, నేడు అతడు మహిళను భోగవస్తువుగా పరిగణిస్తున్నాడు. దాసిగా ఆమెను పాశవికబంధనాలతో బంధిస్తున్నాడు. ఆమెను నిస్సహాయురాలుగా చేస్తున్నాడు. ఆమెపై అత్యాచారాలు జరుపుతున్నాడు. ఆమెను తన ఆస్తిగా పరిగణిస్తున్నాడు. ఫలితంగా–పురుషుడు పురుషుడు కాకుండా పోయాడు. అతడి తపస్సు, తేజస్సు నశించిపోయాయి. అతడు ఒక క్షుద్రప్రాణిగా మిగిలిపోయాడు. అతడి గౌరవం మంట గలిసింది. అతడు నీచస్థాయిలో బ్రతుకును వెళ్ళదీస్తున్నాడు. ఈ పృథ్వీ మీద దైవీతత్త్వానికి ఒకే ప్రతీక మాతృత్వం. దానిపట్ల ఉన్నతోన్నతమైన శ్రద్ధ చూడనిదే దేవత్వాన్ని పూజించడం, సాధన చేయడం జరుగదు. ఆ శ్రద్ధ లోపిస్తే పురుషుడు దైవత్వాన్ని కోల్పోతాడు. మహిళ ఒక కామధేనువు. అయితే ఆమెను వాసనగా, ఆస్తిగా, దాసిగా చూస్తే ఆ కామధేనువు మనకు శాపంగా పరిణమిస్తుంది. మన దుర్బుద్ధి ఎప్పుడు తొలగుతుందో! మనం మహిళలోని దివ్యశక్తిని గుర్తించి ఆమె చరణాలను శ్రద్ధతో కన్నీరు అర్పించడం ఎప్పుడు నేర్చుకుంటామో! ఈ లోపం కారణంగా మనం ఎంతకాలం దైవత్వాన్ని కోల్పోయి బ్రతుకుతామో!



## గాయత్రి పరివార్ 2017 వార్షిక క్యాలెండర్ (అశ్వమేధ మహాయజ్ఞం-2018)



**యథావిధిగా గాయత్రీ పరివార్ (తెలుగు) 2017 వార్షిక క్యాలెండర్ అశ్వమేధ మహాయజ్ఞమును కథా వస్తువుగా స్వీకరించి పంచరంగులలో తయారగుచున్నది.**

**నమూనా క్యాలెండర్ 5 డిసెంబర్ 2016 నాటికి మీకందించబడును.**

**15 డిసెంబర్ 2016 నాటికి ఇది అమ్మకమునకు సిద్ధముగా ఉండును.**

కావలసిన వారు ఈ క్రింది చిరునామాలో సంప్రదించండి.

**గాయత్రీ చేతనా కేంద్రము, హెచ్.పి.రోడ్.,**

**మూసాపేట, హైదరాబాద్-500018.**


**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**


**చెడ్డ అలవాట్లే అనారోగ్యానికి మూలం**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే-4

*ఆధ్యాత్మికత అనేది రొక్కబేరం వంటిదని చెప్తూ అటువంటి ఆధ్యాత్మికతకు చెందిన ఐదు మూలసూత్రములు ఆచరణలో పెట్టేవారికి గాయత్రి యొక్క ఐదు సిద్ధులు హస్తగతమౌతూంటాయని పరమపూజ్య గురుదేవులు తమ ప్రవచనము ద్వారా ప్రబోధించినట్లు తాము గత సంచికలో చదివియున్నారు. ఆధ్యాత్మిక వ్యక్తిత్వము కలిగినవారు ఆప్తకాములై ఉంటారు. అంతేకాదు, వారు తమ కోర్కెలను నెరవేర్చుకొనటము కోసము ఆధ్యాత్మిక పథమున ఆశ్రయించరు సరిగదా అసలు వారి ఆశయములు, లక్ష్యములే ఉన్నతముగా ఉంటాయి. దృష్టికోణమును సంస్కరించుకొనటమే ఆధ్యాత్మికత యొక్క మూల ఉద్దేశ్యము. ఈ సంస్కరణ అనేది జీవితములో అమలు జరుపగలిగిన వ్యక్తి ఇక తాను అనుభవించటానికి కాకుండా, లోకోపకారము కోసమే సంపాదించటము ప్రారంభిస్తాడు. పూజ్యగురుదేవులు తమను తామే ఇందుకు ఒక ఉదాహరణగా ప్రకటిస్తూ తాము ఆర్జించిన తపోశక్తినంతటినీ లోక కళ్యాణము కోసమే వినియోగించామని, తత్ఫలితముగా తమకు ప్రజల యొక్క గౌరవాభిమానములు, దైవీ-అనుగ్రహవరముగా లభించాయని తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!!*



### యువకులు వర్తమానములో జీవిస్తారు

వృద్ధులు గతమును గరించి తలపోస్తూ ఉంటే, పిల్లలు భవిష్యత్తును గురించి ఊహిస్తూ ఉంటారు. యువకులు మాత్రము పూర్తిగా వర్తమానములోనే జీవిస్తుంటారు. ఈరోజు మనకున్న స్థితిని బట్టి మనము చెయ్యదగిన పనులను నిర్ధారించుకోవాలి. మీకు ఒక ఆడపిల్ల ఉన్నది. అంతగా చదువుకోలేదు. మీరు పెద్దగా కట్నకానుకలు ఇచ్చుకోలేరు. కాబట్టి ఏ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునికో కట్టబెడతారు. అలాకాక అమ్మాయిని మంచి కళాశాల అధ్యాపకునికి ఇచ్చి చెయ్యాలని చూస్తే అది సాధ్యమవుతుందా? మనకున్న సాధనోపకరణములు తక్కువ, శక్తి తక్కువ. పరిస్థితులకు అనుగుణముగా కార్యాచరణను ఏర్పరచుకొనటము మనకు చేతకావాలి. దానిపైన దృష్టి పెట్టకుండా భవిష్యత్తును గురించి వ్యర్థమైన కలలు కంటూ ఉంటే సమయము వృథా కావటము తప్ప ఫలితమేమీ ఉండదు. ఇలాంటి వారి బారినపడకుండా మమ్మల్ని మేము కాపాడుకొనగలిగాము కాబట్టే మేము 'ఆప్త కాములము' కాగలిగాము.

### ఆప్తకాములైన వారికి ఆకాంక్షలేవి ఉండవు

మాకు రెండు పూటల ఆహారము, కట్టుకొనటానికి బట్టలు, నివసించటానికి ఇల్లు లభించినాయి. చాలు! సంతానము కూడా కలిగింది. మరీ సంతోషము! ఆప్తకాములుగా జీవనము సాగించవచ్చు. కొన్ని లక్షలమందిచేత మేము ఈ సాధనను చేయించాము. వారికి పుత్రులు, పౌత్రులు కలిగి ఉండవచ్చు. వారంతా కూడా ఇదే మార్గములో జీవించగలిగితే ఒక కావలసినదేముంది? కాబట్టి ప్రతి సాధకుడు తన జీవిత కాలములో పదిమంది సాధకులను తయారుచెయ్యవలసి ఉన్నది' అని మేము గతములో చెప్పాము. అలాగే అఖండజ్యోతి పాఠకులు కూడా ఒకరి నుండి ఒకరు, మరొకరు ఇలా అఖండముగా వృద్ధి చెందుతూనే ఉన్నారు.

ఇవన్నీ మన ఆలోచనల తాలుకు సంతానమే! ఇంకా ఇంకా వృద్ధి చెందుతూనే ఉంటుంది. మేము ఆప్తకాములైన క్షణము నుండి మా సంతానము యొక్క సంఖ్య పెరగటము ప్రారంభించినది. 'మాకు ఇద్దరు బిడ్డలు చాలు' అని మీరు హద్దులు గీసుకుని; 'వీరే మా వంశోద్ధారకులు, మాకు పిండప్రదానము చేసి ఉత్తమగతులు కల్పించగలరు' అని

**ఇతరులలో మంచి చూసినప్పుడు నీలోని గొప్పతనం తెలుస్తుంది**

అనుకుంటే అది చాలా తెలివితక్కువ తనము. వాళ్ళు మీ రక్త మాంసములను పిండి మీ సర్వస్వాన్నీ స్వాధీనము చేసుకొని అప్పుడు మీకు పిండి ప్రదానము చేస్తారు.

### మా జీవనము ఆప్తకాముల జీవితము

'ఆప్తకాములు'గా మారాము అంటే జీవితము సంతోష ముగా, ఉల్లాసభరితముగా, ఆనందమయముగా ఉంటుంది. మరణించిన పిదప శాంతి లభిస్తుందో లేదో తెలియదు గానీ ఈ జీవితములో లభించిన శాంతి అపూర్వమైనది. మున్నెన్నడు ఎరుగనిది, మీరు కోరుకున్న ఏదైనా కోరిక నెరవేరినప్పుడు క్షణకాలముపాటు లభించిన సంతోషము ఉందే... అది తాత్కాలికమైనది మాత్రమే. శాశ్వతమైనది కాదు. కానీ స్థిరమైన, శాశ్వతమైన సంతోషము ఆప్తకాముడైన వ్యక్తికి మాత్రమే లభిస్తుంది.

మన అవసరాలు చాలా పరిమితమైనవి. సంపాదించినది మనము అనుభవించటానికి కాకుండా, ఇతరులకు ఉపయోగపడేందుకు మాత్రమే మనము ధనోపార్జన చెయ్యాలి.

అసలు అనుభవించడము అన్న పదమే మిమ్మల్ని ఆపదలలోనికి నెట్టివేస్తుంది. 'అనుభవించడము' అనేది మీలో జ్వాలను రగుల్చుతుంది. పాపమును ఉత్పన్నము చేస్తుంది. కలహములు, కార్పణ్యములు తలెత్తుతాయి. అది మీ సంతానమును, వారి భవిష్యత్తును నాశనము చేస్తుంది. కానీ ఉపయోగపడటమనేది ఎటువంటి పరిస్థితులలోను మీ భవిష్యత్తును పాడుచెయ్యలేదు.

### అజాత శత్రువుగా ఉండటము - ఆధ్యాత్మికత యొక్క రెండవ సిద్ధి

ఆధ్యాత్మికత యొక్క మొదటి సిద్ధి ఆప్తకాములు కావటమైతే; మాకు లభించిన రెండవ సిద్ధి తాలూకు లాభమును, అద్భుతమును మీరు కూడా పొంది ప్రశాంతి నిండిన జీవనమును గడపాలనే ఆశయముతో దీనిని మీకు తెలియజేస్తున్నాను. సామ్రాట్ అశోకుడు అజాతశత్రువుగా కీర్తించబడ్డాడు. అలాగే భారతదేశ రాష్ట్రపతియైన బాబు రాజేంద్రప్రసాద్ కూడా అజాతశత్రువుగా మన్నలందుకున్నారు. 'శత్రువు' అనబడే వారెవ్వరు లేనివారిని అజాతశత్రువు అంటారు. మాకు శత్రువులెవ్వరు లేరని మీరనుకో వద్దు. మేము ఆడపిల్లలకు జంధ్యం వేశామని, గాయత్రీ మంత్రము స్త్రీలకు నేర్పించామని, వారిని యజ్ఞకుండం దగ్గర కూర్చోనిచ్చామని... ఇలా మమ్మల్ని ఎంతోమంది నిందించారు. ప్రజలను ధర్మభ్రష్టులను గావించామని మమ్మల్ని తూలనాడారు కూడా!

### మీ ద్వేషమే పెద్ద శత్రువు

గాయత్రీ మంత్రమును పండితులకు, బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమైనది, కానీ ఇప్పుడు అది సార్వజనీనమైనది. ఎంత అన్యాయం జరిగిపోయింది?' అని చాలామంది మమ్మల్ని నిందించారు. మమ్మల్ని ఇబ్బందిపెట్టాలని, బాధపెట్టాలని ప్రయత్నించినప్పటికి మాకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. ఎందుకంటే ఇతరుల శత్రుత్వము వల్ల మనకు కష్టము ఎప్పుడు కలుగుతుందంటే మనము వారి శత్రుత్వమును అంగీకరించి నప్పుడు. అసలు మనము వారితో శత్రుత్వమునే నిరాకరించి నప్పుడు ఇక వాళ్ళు మనల్ని బాధపెట్టగలిగేదేముంది?

మీ యొక్క శత్రుత్వము మాలో వైరభావముగా రూపుదిద్దు కున్నప్పుడు, అది ద్వేషముగా మారినప్పుడే మాత్రమే మాకు కష్టము కలిగించగలదు. మీరు మా లోపల ద్వేషమున ఉత్పన్నము చెయ్యగలిగినప్పుడే కష్టము కలుగుతుంది. అలా చేయలేనప్పుడు మీ శత్రుత్వము వల్ల మాకేమి నష్టము? మహా అయితే మా శరీరమునకేమన్నా ఇబ్బంది కలిగించగలరేమో? డబ్బు నష్టము చెయ్యగలరేమో? దానివల్ల వచ్చే ప్రమాదమేమీ లేదు.

'జాకో రాఖో సాయియా మారిసకైనకోయ్: బయట ఉన్న శత్రువులు అనగా బహిరంగ శత్రువులు మనలను ఏమి చెయ్య గలరు? మహాయైతే నిందించగలరు, మన పేరు ప్రఖ్యాతులు చెడగొట్టగలరు లేదా కొంత ధననష్టము చెయ్యగలరు. అంతకు మించి మరేమీ చెయ్యలేరు.

కానీ అంతరంగా శత్రువైన ద్వేషమనేది ఉందే అది మనకు భారీనష్టమును తెచ్చిపెట్టగలదు. ద్వేషమనే అగ్ని ఉన్న ప్రదేశ మంతా కాలి బూడిదైపోతుంది. మన హృదయము లోపల ద్వేషము, వైరము, శత్రుత్వము... మొదలైనవి ఉత్పన్నమైనప్పుడు అవి భౌతికమైన శత్రువుల కన్నా ఎక్కువ కష్టమును కలిగించ గలవు.

**జాకో రాఖో సాయి యా మారిసకైనకోయా ।**
**బాల్ న బాంకా కర్‌సకై జో జగవైరీ హోయ్ ॥**

శత్రువులు తమ కోర్కెలన్నింటినీ నెరవేర్చుకుంటూ పోతుంటే ఇక జనానికి ఈ ప్రపంచములో మనుగడ సాగించటము ఎంతో కష్టమవుతుంది.

శత్రువు ప్రత్యేకముగా మనకు ఏవిధమైన నష్టమును కలిగించలేదు. వాడు చెయ్యగలిగిందల్లా మనలో ద్వేషమును, భయమును, అసహ్యమును ఉత్పన్నము చెయ్యటమే. మనము గనుక మనలో ద్వేషమును, భయమును ఉత్పన్నము

సఫలతకు లిఫ్ట్ ఏమి ఉండదు, మెట్లు ఎక్కిపోవలసినదే

చెయ్యనీకపోతే ఇక మనము శత్రువు బారి నుండి బయటపడ్డట్లే! వేటివల్లనైతే మనకు ఇబ్బంది ఏముంటుంది? దృష్టికోణమును మార్చుకొనటము వల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుంది. దీనినే ఆధ్యాత్మికత అంటారు. ఆలోచనా విధానమును మార్చుకొనటము, దృష్టికోణమును సంస్కరించుకొనుటయే ఆధ్యాత్మికత యొక్క అసలు లక్ష్యము. ప్రాణాయామము, పూజ, ఉపాసన, ధ్యానము, భజన, సత్సంగము, ధర్మశాస్త్ర–పఠనము, బ్రహ్మవిద్య నేర్వటము మొదలైన కర్మకాండలన్నీ మనిషి యొక్క ఆలోచన, విశ్వాసము, శ్రద్ధ మొదలైన వాటన్నింటినీ సరిచెయ్యటానికే నిర్దేశించబడినాయి. మనిషి యొక్క ఆలోచనా విధానము చక్కబడిన వెంటనే అతడికి శాంతి లభిస్తుంది. తక్షణమే అతడికి భగవంతుని అనుగ్రహము ప్రాప్తిస్తుంది.

**భగవంతుడు సర్వదా మనలను వెన్నంటే ఉంటాడు:** భగవంతుడు మనకు దూరముగా ఎక్కడో లేడు. మన ముక్కు రంధ్రము నుండి గాలితోపాటు మన అంతరాత్మలోనికి ప్రవేశిస్తుంటాడు. హృదయస్పందనలైన లబ్–డబ్‌లలో శంకర భగవానుని ఢమరుకనాదం ప్రతిక్షణము వినిపిస్తూనే ఉంటుంది. భగవంతుడు సకల జనుల హృదయములలోనూ సర్వదా నివసిస్తుంటాడు. మన ఆలోచనావిధానమును, దృష్టికోణమును సంస్కరించుకున్న వెంటనే ఆయన మన అంతరాత్మలో గోచరిస్తాడు. దీనినే ఆధ్యాత్మికత అంటారు. ఇటువంటి ఆధ్యాత్మికత మనకు అర్థమైన మరుక్షణము మనము మనకున్న శత్రువులందరినీ వెంటనే అంతము చెయ్యాలి. పరశు రాముడు తన శత్రురాజులందరి పైన 21సార్లు దండయాత్ర చేసి వధించినట్లుగా; మనము కూడా మన అంతరంగ శత్రువులను పదే పదే అంతం చేస్తుండాలి.

'జనం తప్పు చేస్తూనే ఉంటారు. వాళ్ళు పసివాళ్ళు, అమాయకులు, భ్రమలో పడిన రోగులు. రోగులను దయతో చూడాలి, రోగమును వదిలించాలి, రోగిని బ్రతికించాలి. రోగి మనకు మిత్రుడు. మన పొరుగువాడు. రోగము మన శత్రువు' అనే రీతిలో మన ఆలోచనా విధానము ఉండాలి. అప్పుడే మనము మన అంతరంగ శత్రువులను జయించగలము.

పిల్లలు రోజంతా మనల్ని విసిగిస్తుంటారు. ఇల్లంతా వస్తువులు విసిరేసి చిందరవందర చేస్తారు. ఏమి చేస్తాం? కొట్టి చంపుతామా? లేదుకదా! పోనీలే పసివాడు, పెద్దైతే మంచీ చెడూ వాడే తెలుసుకుంటాడు అని ఊరుకుంటాము. అలాగే మతిభ్రమించినవాళ్ళు, పిచ్చివాళ్ళ పట్ల మన దృష్టికోణము ఎలా ఉండాలి? పోనీలే పిచ్చివాడు, తెలియక ఏదో వాగుతున్నాడు అనుకుంటాము. కుక్క మనల్ని కరుస్తుంది. తిరిగి మనం కుక్కను కరుస్తామా? అదేవిధముగా తప్పు చేసే వాళ్ళంతా మూర్ఖులు, పిచ్చివాళ్ళు, తెలివిలేనివాళ్ళు. తెలుసు కోలేనివాళ్ళకు తెలియజెప్పేందుకు చాలా పద్ధతులుంటాయి. వాళ్ళకు ప్రేమతో, మంచితనముతో చెప్పవచ్చు. గట్టిగా అరచి, మందలించి కూడా తెలియచెప్పవచ్చు. కానీ వాళ్ళతో వైరం పెట్టుకోవలసిన పనిలేదు. వైద్యుడు రోగి శరీరమును కోస్తాడు. శస్త్రచికిత్స చేస్తాడు, కానీ శత్రుత్వముతో కాదు, వాడి శరీరములోని వ్యాధిని తగ్గించటానికి కత్తిని ప్రయోగిస్తాడు.

దయ, ప్రేమ, కరుణ, స్నేహములతో ప్రజలను వశీభూతం చేసుకొని వారిని చక్కదిద్దవచ్చు. దండించినా, ప్రేమతో చేరదీసినా... ఎలాగైనా సరే వారిని సంస్కరించవచ్చు. అయితే మన దృష్టికోణము మటుకు 'ప్రజలు భ్రమతోనో, అజ్ఞానముతోనో, మానసికవ్యథతోనో మళ్ళీ మళ్ళీ తప్పులు చేస్తుంటారు. కాబట్టి మనము వారిని చక్కదిద్దాలి' అన్న రీతిలోనే ఉండాలి.

**మన వృత్తులే మన శత్రువులు:** తరుచుగా మేము మీకు ఒక కథ చెప్తూ ఉంటాము. మొదటిసారి విక్టోరియారాణిని తీసుకొని రైలుబండి బయలుదేరింది. బండి బయలుదేరిన వెంటనే ఒక ఏనుగు ముందర పరుగెత్తసాగింది. బండి ఆపి ఎన్నోసార్లు తుపాకి పేల్చారు. బండి ఆగినప్పుడు ఏనుగు ఆగుతోంది. బండి కదలిన వెంటనే అదీ కదులుతోంది. చివరకు ఎన్నోవిధాలుగా పరీక్షించగా తేలినదేమిటంటే బండి ముందరి ఫ్లడ్‌లైట్ మీద తూనీగ వంటి ఒక కీటకం కూర్చుని ఉన్నది. ఆ కీటకం యొక్క నీడ రైలుపట్టాల మీద పడినప్పుడు అది ఏనుగులాగా కనిపించింది, శత్రువులాగా కనిపించింది.

శత్రువులంటే ఎవరో కాదు, మన మనస్సు యొక్క వృత్తులే, కొందరు మానసికంగా రోగులైతే, మరికొందరు శారీరికముగా జబ్బుపడతారు, వాళ్ళు పెద్దవాళ్ళు కావచ్చు. చిన్నపిల్లలు కావచ్చు. తేడా అంతా మనిషి యొక్క ప్రవృత్తులతోనే. అవి అతడిని మంచివాడిగా చేస్తాయి–చెడ్డవాడిగా చూపిస్తాయి. అవే ఒకరికి మిత్రుడిని చేస్తాయి. మరొకరికి శత్రువును గావిస్తాయి. కాబట్టి ముందర మనము మనలోని శత్రువులకు చికిత్స చెయ్యాలి, ఈర్ష్య, ద్వేషము, లోభమోహములు, కోరికలు ఇవన్నీ మన అంతరంగ శత్రువులు, మోహం అన్నింటికన్నా పెద్ద శత్రువు. *(సశేషం)*


– *అఖండజ్యోతి, ఏప్రిల్ 2016*

అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

**ఆర్తిలేని వాడు జ్ఞాని కాలేడు**

నావారితో నా మాట

# నివేదన - ఈ జ్ఞానగంగ నిరంతరంగా ప్రవహించాలి



ఒక ప్రత్యేకమైన ఉద్దేశంతో అఖండజ్యోతి పరిజనులు పృథ్విపై అవతరించారు. సామాన్యమైన ప్రాపంచిక దృష్టికోణంతో సాధారణ జీవితం గడపడానికి రాలేదు. ప్రత్యేకమైనవి చేయాలి, ప్రత్యేకంగా మారాలి. దృష్టికోణంలో మార్పు తీసుకొచ్చి చుట్టుపక్కల పరిస్థితులను మార్చాలి. స్వచ్ఛమైన, దృఢమైన మానసిక స్థితి ఉంటే పరిస్థితులు కూడా మారతాయి. అఖండజ్యోతి పత్రికకు ఇదే ఇరుసు – మానసిక స్థితితో పరిస్థితిని నిర్మించుట – నిరంతర సకారాత్మక స్వాధ్యాయం.

## విషమించిన పరిస్థితులు, బలపడిన బాధ్యత

అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) అంటే ముద్రించిన కాగితాల కట్ట కాదు. క్షణక్షణానికి అవసరమయ్యే నిరంతర మార్గదర్శనం. నేటి విషమించిన పరిస్థితులకు అవసరమైయ్యే విధంగా, పరమపూజ్యగురుదేవుల ఆలోచనలు మరియు సమయానుకూల మార్గదర్శనం ఇందులో పొందుపరచ బడ్డాయి. పెద్దవాళ్ళు, గొప్పవాళ్ళు అనబడేవారు కూడా నేడు మాటల్లో, జీవన విధానంలో, వ్యక్తిత్వ క్షేత్రాల్లో తటపటాయి స్తున్నారు. బుద్ధిమంతులు కూడా భ్రమలో బలంగా ఇరుక్కుంటు న్నారు. నలుదిక్కులా అపనమ్మకం కమ్ముకుంది. ప్రపంచ వ్యాప్తంగా నకారాత్మకత కనిపిస్తోంది. ఉత్తరకొరియా యొక్క ఉచ్ఛృంఖల వ్యవహారం, ఇస్లామిక దేశాల్లో పెరుగుతున్న ఉగ్రవాదం, విస్ఫోటనలు, ప్రకృతి వైపరిత్యాలు అన్నీ మనల్ని అప్పుడప్పుడు నిరాశపరుస్తుంటాయి. మరలాంటప్పుడు మనం ఏంచేయాలి, మన కర్తవ్యమేమిటి, జీవనవిధానం ఎలా ఉండాలి – అన్న విషయాలలో గురుదేవులు నిరంతరాయంగా అందించిన (1938–ఇప్పటివరకు) మార్గదర్శనంతో కోట్లమంది దిశా నిర్దేశాన్ని పొందారు. వివేకం కింకర్తవ్యవిమూఢమై, నాలుగు దారుల కూడలిపై నుంచుని ఉంటే, మనకి మార్గదర్శనాన్ని ఇచ్చేది ఒకటే–మన నిత్య ఆహారం–స్వాధ్యాయం – అఖండజ్యోతిలోని (యుగశక్తి గాయత్రి) ఆలోచనలు.

ఈ విషమ పరిస్థితుల్లో గురువుగారి మార్గదర్శనం సంజీవని వంటిది. దీనిని అందుకున్న వారికి కొత్త జీవితం లభిస్తుంది. మనందరం మహాకాలుని సహకారులం, లీలా సహచరులం అన్నది అనుభూతి చెందుతాం. గురుసత్తా అందించిన మార్గదర్శనాన్ని అందరికీ అందించాలి. ప్రపంచం లోని ప్రతి ఒక్కరికీ మంచి ఆలోచనల ప్రకాశం అందించడమే యుగధర్మం. కాబట్టి మన పరిజను లందరు ఈ జ్ఞానపుంజం యొక్క పాఠకుల సంఖ్యను పెంచడంలో ఉత్సాహాన్ని కనబరచాలి. వీళ్ళే పట్టించు కోకపోతే ఈ అపనమ్మక మేఘాలు కమ్ముకున్న మానవజాతి పరిస్థితి ఏంటి?

పవిత్రమైన జ్ఞానదీక్ష సంపన్నమగుగాక – జ్ఞాన కాగడా పట్టుకుని నిరంతరం కదిలే ఈ పత్రికను ప్రజలందరికీ అందించే బాధ్యత ఇప్పుడు మనదే. స్వయంగా చదవాలి, ఇతరులచే చదివించాలి. ఇది ఒకరకంగా గురువుగారి ద్వారా వచ్చే జ్ఞాన దీక్ష. కనీసం పదిమందికి అందించగలిగితే దానికి మనం నిమిత్తమాత్రులమవుతాం. ఈ యుగ పరమార్థంలో ఆత్మజ్ఞానమనే స్వార్థం కూడా ఉంది. ఈ పవిత్రమైన జ్ఞానదీక్షకు మనమిచ్చే దక్షిణ, ఈ పత్రిక సంవత్సర చందా. ఇప్పటివరకు ఉన్న రూ. 150, ఇక నుండి రూ. 180 కాబోతోంది (విడి ప్రతి రూ. 15). లాభం లేకుండా, నష్టపోకుండా, విజ్ఞాపనలు లేకుండా నడిపేందుకు ఈ పెంపు తప్పటం లేదు. ఈ జ్ఞానప్రవాహం ఇలాగే నిరంతరం ప్రవహిస్తూ ఉండుగాక. పత్రికకు వాడే కాగితం, ప్రచురణ వ్యయం, పాకింగ్, పోస్టింగ్ వగైరాలలో పెరిగిన ఖర్చుతో పోలిస్తే పెరిగిన చందా తక్కువే.

అసలు చందా పెంచాల్సిన అవసరమేంటి? ఈ విషయమై పరిజనులు తెలుసుకోవలసిన కొన్ని తథ్యాలు.

1. చాలాకాలంగా సంవత్సరపు చందా పెంచినప్పుడల్లా రూ. 12 పెరుగుతూ వచ్చింది.
2. కిందటి సంవత్సరం రూ. 120 నుండి రూ. 150 చేసినప్పుడు కాగితం నాణ్యత రెట్టింపు చేయబడింది. అప్పుడే రూ. 180

**అవసరం అయితే ఎవరి నుండి అయినా డబ్బు తీసుకోవడం తప్పుకాదు**

చేయాలని ప్రస్తావించబడ్డా చేయకుండా మరో రెండు సంవత్సరాలు నష్టం భరించడం జరిగింది. ఇకపై ఈ నష్టం భరించడం భారమవుతుంది.

3. ఇప్పుడు పెంచిన చందా వల్ల 365 రోజుల స్వాధ్యాయానికి లభించే సామాగ్రి ఖర్చు రోజుకు 49.5 పైసలు. ఇదివరకు అది 41 పైసలు. ఈ మాత్రం రోజు ఖర్చుతో పరమపూజ్య గురుదేవుల నిత్య సాక్షాత్కారం లభిస్తే లాభసాటి బేరమేగా!

4. సమాజంలో నేడు అన్నింటి ధరలు పెరగడం చూస్తూనే ఉన్నాం. ముద్రణ వ్యయం, కాగితం ధరలు, కార్మికుల జీతాలు అన్నీ పెరిగాయి. కాబట్టి 2017 నుండి వార్షిక చందా రూ. 180 చేయడం సబబే అనిపిస్తోంది.

5. పోల్చి చూస్తే ప్రఖ్యాత పత్రిక 'కళ్యాణ్' వార్షిక చందా రూ. 220. వాళ్ళు ఎప్పుడు పెంచినా రూ. 20 పెంచారు, మనది మాత్రం రూ. 12 పెంచాం. నెలకి 48 పేజీల పత్రిక అయిన కళ్యాణ్, సంవత్సరానికి 528 పేజీలతో పాటు ఒక విశేష సంచిక ప్రచురిస్తుంది. కానీ అఖండ జ్యోతిలో నెలకు 64 పేజీల లెక్కన మొత్తం 778 పేజీలు ముద్రిస్తాం. కాబట్టి 240 పేజీలు ఎక్కువ ప్రచురిస్తున్నా రూ. 40 తక్కువ చందా తీసుకుంటున్నాం. ప్రత్యేక సంచిక మినహా వారికి మిగిలే రూ. 40 ఇక్కడ మిగలదు. పేజీల సంఖ్య పెంచకపోయినప్పటికీ ఒక ప్రత్యేక సంచిక ప్రతి సంవత్సరం లేదా రెండేళ్ళకొకసారి ప్రచురించే ప్రయత్నం చేస్తాం.

అఖండజ్యోతి యొక్క జ్ఞానగంగ నేటి సమయానికి చాలా అవసరం. మనిషి మరియు సమాజం చిక్కుకున్న అనేక సమస్యలకు ఇది ఏకైక పరిష్కారం. మనుష్యుల మనస్సులలో విషంలా ప్రవేశించిన వికృత ఆలోచనలకు సమాధానం దీనిలో మాత్రమే దొరుకుతుంది. ఆలోచనలను పరమపూజ్య గురుదేవులుగారు అస్త్రాలు, శస్త్రాలు అన్నారు. నిజానికి దీని ఆధారంగానే గాయత్రీ పరివార్ - అఖండజ్యోతి పరివార్ నిలబడ్డాయి. ఈ పత్రిక యొక్క ఆలోచనా ప్రవాహంలో కొన్ని ప్రత్యేకతలు చేర్చబడుతున్నాయి.

### ఇకనుండి కనపడబోయే ప్రత్యేకతలు

1. మహాపురుషుల జీవితానుభవాలు. వీటితో అందరికీ మార్గదర్శనం కలుగుతుంది.

2. వైజ్ఞానిక ఆధ్యాత్మవాదంపై జరిగే పరిశోధనల ఆధారంగా సరికొత్త చింతన.

3. అసలైన ఆధ్యాత్మ విలువలపై సర్వతోముఖ చింతన. నియంత్రణ, విద్య, దైనందిన వ్యవస్థ, గృహస్థ జీవనం వంటి క్షేత్రాల్లో ఆధ్యాత్మికతను వ్యావహారికంగా ఎలా అమలుపరచవచ్చు.

4. గీత, దర్శనాలు, ప్రస్థానత్రయం అందరికీ అర్థమయ్యే భాషలో అందించడం.

5. విద్యాలయాల్లో బాల సంస్కారశాలల్లో చదివే పిల్లల నుండి ఐ.ఐ.ఎమ్, ఐ.ఐ.టీలలో చదివే విద్యార్థుల వరకు అందరు దీనిని ఎలా ఉపయోగించుకోగలరో విస్తారంగా తెలపడం.

6. స్త్రీ పురుషుల సంబంధాలను వివరిస్తూ మహిళా సాధికారత గురించిన పూర్ణ అధునాతన చింతన.

7. దేవ సంస్కృతి విశ్వ విద్యాలయంలో వ్రాయబడ్డ 125కన్నా ఎక్కువ పరిశోధన గ్రంధాల ఆధారంగా ధారావాహిక కథనాలతో పరిశోధనల పరిణామాల కొత్త కోణాలను పాఠకులకు అందించడం.

8. జీవించేకళను నేర్చుకుని, నేర్పి, సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అన్న వాటిపై సమగ్ర ఆలోచనాసరళి.

9. విద్యాశాస్త్రంలో నూతన విప్లవాత్మక ఆలోచనాసరళి సమర్పించబడుతుంది. దేశంలోని విద్యా వ్యవస్థ నిపుణులందరికీ మార్గదర్శనం కలుగుతుంది.

10. సనాతనమైన భారతీయ సంస్కృతి యొక్క విభిన్న పక్షాలు, పండగలు, పర్వాలు మొదలైనవాటి మీద అధునాతన ఆలోచనాసరళి.

11. వైద్య విజ్ఞానం, ఆయుర్వేదం, ఆల్టర్నేట్ మెడిసెన్ కి సంబంధించిన కొత్త కోణాలు. "రీ ఇన్వెంటింగ్ మెడిసెన్" పై సరికొత్త చింతన.

12. ప్రతి వ్యాసంలో కొత్త ప్రేరణాత్మక అనుభవాలు జోడించడం వల్ల, సంక్షిప్తంగా అఖండజ్యోతి స్వాధ్యాయం చేసుకుని ముందుకు సాగి, మొత్తం చదవాలనే కోరిక కలిగించడం.

### యువక్రాంతి సంవత్సరం

ఈ సంవత్సరం కూడా సమయానికి చందా పంపి ఈ జ్ఞానం నిరంతరం ప్రవహింపజేస్తారని భావిస్తున్నాం. ఒంటి

**తీసుకోవడం తేలిక, ఇవ్వడమే కష్టం**

చేత్తో నవనిర్మాణం కుదరదు. ఇదొక భాగీరథ ప్రయత్నం. 'యువ క్రాంతి సంవత్సరం'తో కొత్త శక్తి చేజిక్కింది. కొత్త యువ స్నేహితులు కలిసారు. వారి అనుభవాలు తెలిసాయి. ఇప్పుడు దీనిని 2017లో కూడా జరుపుకోవాలని ఈ శరన్నవరాత్రులలో ప్రకటించడం జరుగుతోంది. మార్పు యువత వల్లనే సాధ్యం. దీనికి సంబంధించిన కొత్త ఆలోచనలు ప్రతినెల యువత, పాఠకులు, పరిజనులు చదువగలరు. మన పంచ మహా అభియానాలు దేశమంతట్లో వేగం పుంజుకుంటు న్నాయి. వీటి గురించి తెలుసుకోవాలను కునేవారు, పాల్గొనాలి అనుకునేవారు, పుణ్యం సంపాదించాలి అనుకునే వారు మొట్టమొదట ఈ పుస్తకం చదవాలి, అందరితో చదివించాలి.

**సప్తవిప్లవాల ఆధారంగా దేశంలో నవనిర్మాణం కోసం నిర్ధారించిన ఐదు ప్రణాలికలు:**

1. **యువజాగృతి అభియానం:** ఆరోగ్యం, సదాచరణ, సాక్షరత, స్వావలంబన, సేవాభావం, యువతను జాగృత పరిచి సృజనాత్మక ధారలో నడిపించుట.
2. **వృక్షగంగా అభియానం:** పరిశుభ్ర పర్యావరణం, ఆరోగ్య కరమైన జీవితం కోసం ప్రతి సంవత్సరం కోటి కన్నా ఎక్కువ చెట్లు నాటడం.
3. **గ్రామతీర్థ ప్రణాళిక:** గ్రామాలను దత్తత తీసుకుని, సంస్కార వంతమైన, వ్యసనరహితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్య కరమైన, స్వావలంబనతో, సహాయ సహకారాలతో ఉండే గ్రామాల నిర్మాణం.
4. **బాల సంస్కారశాల అభియానం**
5. **భగీరథ జలాభిషేక అభియానం:** ఈ కాలానికి తగ్గ విలక్షణ కృషి. జలాశాయాల శుభ్రత, తటాకాల శుభ్రత, సంరక్షణ, తీరాల పరిశుభ్రతతో పాటు వాటిని పచ్చగా మార్చడం వంటి అసంభవంగా కనిపించే పనులు. ఈ పని మొదలై పోయింది. 2026 అఖండజ్యోతి మరియు వందనీయ మాతాజీల శతాబ్ది ఉత్సవాల వరకు ఇది కొనసాగుతుంది.

ఈ సంవత్సరం అఖండజ్యోతిలో (యుగశక్తి గాయత్రి) – ఈ కార్యక్రమాల వివరణలు, ప్రణాళికలు, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో జరిగే అధునాతన మార్పుల గురించిన చర్చలు. దైవీసంపదను అనేకరెట్లు పెంచే దృక్పథంతో నడుస్తుంది అఖండజ్యోతి. వినిమయతత్వమే ప్రధానంగా కొలిచే సమాజంలో ప్రతినెల నమ్మకంతో, ఆస్తికవాద ఆలోచనలతో, ఆశావాదానికి హామీగా ఈ పత్రిక మీ ముందుకు వస్తుంటుంది. ఈ పత్రిక ద్వారా లోకశిక్షణ అనే అద్భుత ప్రక్రియ నిర్వహించ బడుతోంది. రాబోయేది విప్లవాత్మక కాలం. అధునాతన విధానాలతోనే రాబోయే పది సంవత్సరాలు గడపవలసి ఉంది. అందుకు ఈ 2017 జనవరి నుంచి సిద్ధంగా ఉండాలి.

*– అఖండజ్యోతి, నవంబరు 2016*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

## మానవులంతా సమానమే

*ఈ ప్రపంచంలో అంతులేని జ్ఞానం ఇమిడి ఉంది. దానిని ఎవరైనా పొందవచ్చు. కానీ జ్ఞానం పొందాలంటే ముందుగా తనలోని అహంకారాన్ని దూరం చేసుకోవాలి. సిక్కు సంప్రదాయంలో రెండవ గురువు అమరదాసు. ఒకే ఈశ్వరుని బిడ్డలైన మానవులంతా సమానమే. మనిషి మనిషికీ మధ్య ఉచ్చ-నీచ్చ భేదాలుండటం ఆయనకు రుచించలేదు. ఆ కాలంలో అంటరానితనం వెర్రితలలు వేస్తున్నది. అందువలన ఆయన తన శిష్యులందరికీ ఒక సూత్రం వర్తింపచేశాడు. తన ఆశ్రమంలో అందరు పంక్తి భోజనం చెయ్యాలి.*

*అవారదాసును గురించి అక్బరు చక్రవర్తి చాలా విన్నాడు. ఆయన దర్శనం చేసికొని జ్ఞానం పొందాలని ఆశ్రమానికి వచ్చాడు. శిష్యులా విషయం గురువుగారికి చేరవేశారు.*

*"మంచిది. ఇక్కడ మానవులంతా ఒక్కటే. భేదభావం లేదు. అక్బరు ఒక చక్రవర్తిగాకాక సామాన్య మానవునిగా వస్తే మాకెలాంటి అభ్యంతరము లేదు. ఆశ్రమంలో అందరితో కలసి సహపంక్తి భోజనం చెయ్యాల్సి ఉంటుంది. తాను చక్రవర్తినన్న అహంకారాన్ని పూర్తిగా త్యజించి రావాలి. అలా అయితేనే అమరదాసును దర్శించగలుగుతారు. ఇదే విషయం చెప్పండి" అని సందేశం పంపాడు. అక్బరు కూడా అదే విధంగా ప్రవర్తించాడు.*

*– అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**ప్రతి అవరోధం వెనుక ఒక అవకాశం ఉంటుంది**

ఆయుర్వేద వైద్యం-21

# నిత్య జీవితములో మంచినీరు త్రాగెడి విధానం - దాని ప్రయోజనం

మన నిత్యజీవితంలో మంచి నీటిని ఎట్లు, ఎంత ఏవిధంగా సేవించిన అత్యధిక లాభాలు కలిగి, రోగరహిత, సుఖప్రదమైన జీవితాన్ని పొందగలమనెడి దానిని శ్రీ రాజీవ్ దీక్షిత్‌గారు చక్కగా వివరించారు.

రోగాల బారిన పడి చికిత్స చేయించుకొనుట కన్నా, రోగాల బారినపడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలతో కూడిన జీవనవిధానాన్ని అవలంభించుట ఉత్తమమని మహర్షి వాగ్భటా చార్యుల వారు అన్నారు.

భోజనానంతరము వెనువెంటనే నీటిని సేవించుట విషంతో సమానం అన్నారు మహర్షి. మనం నోటిద్వారా తీసుకొన్న ఆహారం, అన్నవాహిక ద్వారా (పొట్టలోనికి) జీర్ణాశయంలోనికి చేరి అచ్చట జఠర రసంతో కలిసి ప్రదీప్తమై పచనం కాబడుతుంది. ఇట్టి స్థితిలో భోజనం చేసిన వెనువెంటనే నీరు త్రాగినచో, పొట్టలోని జఠరాగ్ని చల్లబడిపోతుంది. దీనితో జఠర రసం పల్చబడి (అగ్నిచల్లబడి) తిన్న ఆహారం చక్కగా పచనం కానందున, అజీర్ణానికి దారితీస్తుంది. జీర్ణముకాని ఆహారము లోపల కుళ్ళిపోయి, విషవాయువుల ఉత్పత్తికి దారితీస్తుంది. ఈ వాయువు శరీరమంతటా వ్యాపించి 103 రకాలైన రోగాలకు దారితీస్తుంది. ఈ స్థితిలో శరీరంలోని రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ఉత్పత్తి జరిగి తదుపరి అనారోగ్యానికి దారితీస్తుంది. మనము మంచినీటిని త్రాగెడి విధివిధానంలో ఈ క్రింది జాగ్రత్తలు పాటించినచో మనము ఆరోగ్యంగా జీవించుటకు తోడ్పాటునందిస్తుంది.

**నీటిని త్రాగే విధానం:** ఉదయం ఉపాహారానంతరం, మధ్యాహ్నం భోజనానంతరం, రాత్రి భోజనానంతరం వెనువెంటనే మంచినీటిని త్రాగరాదు. అట్లే భోజనం మధ్యలో కూడా త్రాగరాదు. ఒకవేళ త్రాగవలసిన అవసరం కలిగినచో, రెండు-మూడు గుటకల నీరు త్రాగాలి. దీనివలన అన్నవాహిక చక్కగా తెరచుకొని, ఆహారంలోనికి పోవుటకు మార్గం, సుగమమవుతుంది.

ఉదయం అల్పాహారం / భోజనం తదుపరి పండ్ల రసాన్ని, పండ్లను తినుట మంచిది. అట్లే మధ్యాహ్న భోజనానంతరము మజ్జిగను సేవించుట ఉత్తమం. రాత్రి భోజనానంతరము పాలు త్రాగుట మంచిది.

ఉపాహారానికి, భోజనానికి గంట ముందు మంచి నీటిని త్రాగుట మంచిది. అదేవిధంగా ఉపాహారం, భోజనం చేసిన తర్వాత గంటన్నరకు మంచినీటిని సేవించుట అత్యంత లాభదాయకం. దీనివలన ఆహారం, జీర్ణాశయంలో చక్కగా పచనమగుటకు తగినంత సమయం లభించి, శరీరానికి మంచి శక్తి, ఆరోగ్యం లభిస్తాయి.

అట్లు కానిచో కుళ్ళిన ఆహారం ద్వారా జనించిన విష వాయువులు గ్యాస్ ట్రబుల్, గొంతులో, గుండెలో మంట, ఎసిడిటి, హైపవర్ ఎసిడిటి, అల్సర్ (పుండ్లు) మున్నగు వ్యాధులకు దారితీస్తాయి.

ఈ విధానాన్ని మార్చరాదు. ఏలనన తిన్న ఆహారం జీర్ణ మగుటకు ఆయావేళలందు మాత్రమే ఆయా ఎంజైములు శరీరంలో ఉత్పత్తి జరిగి ఆహారం సంపూర్ణంగా జీర్ణమగుటకు తోడ్పడతాయి.

**మంచి నీటిని త్రాగే విధానం:** మంచి నీటిని చక్కగా స్థిరమైన సుఖాసనంలో కూర్చొని, గుటకలు గుటకలుగా చప్పరిస్తూ త్రాగాలి. (సృష్టిలోని జంతువులన్నీ గుటకలు, గుటకలుగా నీరు త్రాగుతాయి. నిలబడి త్రాగరాదు.) చల్లని నీటికన్నా గోరువెచ్చని నీరు త్రాగిన అధికలాభం. వేసవికాలమందు (మార్చి నుండి జూన్ మాసముల) మట్టికుండలోని నీటిని త్రాగుట అత్యంత లాభదాయకం – రిఫ్రిజిరేటర్ (శీతలీకరణ యంత్రము)లోని నీటిని త్రాగుట మంచిది కాదు. పై పెచ్చు అనర్థదాయకం.

మూత్ర విసర్జన తర్వాత వెనువెంటనే నీరు త్రాగిన మూత్రసంబంధిత వ్యాధులు, మల విసర్జనానంతరం వెనువెంటనే త్రాగిన మలబద్ధకం, స్నానానంతరం వెంటనే త్రాగిన చర్మ వ్యాధులు సంక్రమించెడి అవకాశమున్నది. అట్లే ఎండలో తిరిగి వచ్చినవారు నీడలోనికి రాగానే వెనువెంటనే అధిక జలాన్ని సేవించిన ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

**రోజుకు ఎంత నీరు త్రాగాలి:** మన శరీర బరువులో 10వ వంతు బరువు నీటిలో నుండి '2' తీసివేసి వచ్చిన బరువుగల జలాన్ని త్రాగాలి. ఉదాహరణకు 60 కిలోల బరువున్న మనిషి $60 \div 10 = 6 - 2 = 4$ కిలోల నీటిని రోజుకు త్రాగాలి.

పై విధివిధానం చక్కని ఆరోగ్యాన్ని, శక్తిని మనకు ప్రసాదిస్తుంది.

చెరువులేని ఊరు ఊరేనా?

## సుప్రసిద్ధ పుణ్యతీర్థము మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది




*శ్రీలక్ష్మీనృసింహ్మస్వామి మరియు పానకాల నృసింహ్మ స్వాములు కొలువైయున్న రెండువేల సంవత్సరాల పైచిలుకు చరిత్ర కలిగి పుణ్యతీర్థముగా పేరుగాంచిన మంగళగిరి పట్టణం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో జనవరి 2018లో అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహించుటకు అఖిల విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులైన ఆదరణీయ డా॥ ప్రణవ్‌పండ్యాగారు, ఆదరణీయ శైలాబాలా దీదీగార్లు తమ అంగీకారాన్ని తెలిపినారని తెలియజేయుటకు సంతసించుచున్నాం. అతి త్వరలో యజ్ఞం జరిగెడి తేదీలు ప్రకటింపబడతాయి.*

*ఇప్పటికే దాదాపు ఏడువేల జపసామాగ్రి ఆయా కార్యకర్తలకు పంపిణి కొరకై పంపడమైనది. మన లక్ష్యం లక్షమంది సాధకులకు ఈ జపసామాగ్రిని చేర్చవలసి ఉంది. ఈ లక్ష్య సాధనకై కార్యకర్తలంతా మరియు సాధకులు కూడా కార్యకర్తల బాధ్యతను స్వీకరించి జపసామాగ్రి కొరకై అభ్యర్థనలను పంపవలసిందిగా కోరుచున్నాం. మీ అభ్యర్థనతో పాటు మీ సెల్ ఫోన్ నంబరు మరియు సమీప వస్తు రవాణా (పార్సిల్ ఆఫీసు పేరు) కంపెనీ పేరును కూడా వ్రాసి పంప వలసిందిగా మిమ్ముల కోరుచున్నాం.)*

*పరమపూజ్య గురుదేవులచే ప్రారంభింపబడిన ఈ అశ్వ మేధ శృంఖల యజ్ఞములో భాగస్వాములై, పూజ్య గురుదేవుల యుగనిర్మాణ కార్యక్రమంలో మీ కర్తవ్యాన్ని పోషించండి. భగవంతుని కృపకు పాత్రుల కండి. ధర్మస్థాపనలో భాగస్వాములు కండి.*



ఎగువ సన్నిధి - శ్రీ పానకాల నృసింహ్మస్వామి (మంగళగిరి)



దిగువ సన్నిధి - శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి (మంగళగిరి)

**ఇతరులకు "ఇచ్చిన మాటను" చేసి తీరవలసినదే**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 31

### శ్రీ యిసునూరు వెంకట తాతారావు, మంగళగిరి, గుంటూరు జిల్లా

శ్రీ యిసునూరు కోటిరత్నం – కోటి రత్నమ్మ దంపతులకు 1973లో మంగళగిరి పట్టణంలో శ్రీ వెంకట తాతారావుగారు జన్మించారు. వీరి తండ్రిగారు సివిల్ కాంట్రాక్టు పనులు మరియు భవన నిర్మాణ పనులు చేపట్టి నిర్వహిస్తూ ఉండేవారు. యుక్త వయస్సులోనే శ్రీ తాతారావుగారు వస్త్రవ్యాపారంలో అడుగిడినారు. మంగళగిరి పట్టణం అనాది నుండి చేనేత వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి గాంచింది.

మంగళగిరిలోనే ఉన్నత పాఠశాల విద్యను (SSLC) వరకు చదివి అంతటితో విద్యాభ్యాసానికి స్వస్తి పలికారు. చేయాలనెడి కాని వీరిలోని విద్యాభ్యాసకాంక్ష చల్లారలేదు.

శ్రీ తాతారావుగారు వ్యాపారంలోని మెళకువలు త్వరితగతిన అందిపుచ్చుకొని అన్ని విధాల ఎదిగారు. ఒక పర్యాయం శ్రీ పేర్ల వెంకటేశ్వరరావు, గాయత్రీ పరివార్ మంగళగిరిలో వారి ఇంటిలో జరుగుచున్న జన్మదినోత్సవ కార్యక్రమ వేడుకల్లో పాల్గొని, అచ్చట జరిగిన గాయత్రీ యజ్ఞం ద్వారా ప్రభావితులైనారు. ఆనాటి నుండి శ్రీ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డిగారితో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకొని వారితో అనేక గాయత్రీ యజ్ఞాలు, దీపయజ్ఞాలు చేస్తూ వస్తున్నారు. పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుల విరచిత సాహిత్యాన్ని చదివి మరింత ప్రభావితులై, నాటు– కోసుకో" అనెడి సూత్రాన్ని తన నిత్య జీవితంలో ఆచరణలోనికి తెచ్చారు. అట్లే యజ్ఞము యొక్క మూడవ లక్ష్యమైన దానగుణాన్ని తన నిత్యజీవితంలో ఆచరణలోనికి తెచ్చుకొని చెప్పింది చెయ్యాలి" అనెడి సత్యాన్ని కూడా ఆచరించసాగారు. దీనిలో భాగంగా మంగళగిరి పట్టణములో తాను చిన్ననాట విద్యనభ్యసించిన చింతక్రింది కనకయ్య హైస్కూలుకు అనుబంధంగా స్థాపించిన చింతక్రింది కనకయ్య డిగ్రీకాలేజికి అలనాడు రూ. 25 లక్షల రూపాయిలను చందాగా ఇచ్చి విద్యపట్ల తనకుగల ప్రగాఢ గౌరవాన్ని అభిమానాన్ని దాన రూపంలో చాటుకొన్నారు. అనేక మంది విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్ళకుండానే కళాశాల విద్యను మంగళగిరిలోనే అభ్యసించుటకు తగిన అవకాశాన్ని తన శక్తిమేరకు కల్పించుట మిగుల ప్రశంసనీయం.

ఇదేవిధంగా గాయత్రీ ఉపాసన, సంఘటీకరణ మరియు దానము వీని మూడింటిని తన నిత్యజీవితంలో ఆచరిస్తూ, పూజ్యగురుదేవులు చూపించిన మార్గంలో నడచుట వీరి ప్రత్యేకత. ఇదే రీతిలో తన కుమారుడైన శ్రీ చందూకు కూడా పరమ పూజ్యగురుదేవుల మార్గంలో నడిచేలా ప్రేరణను అందిస్తూ 84వ పడిలో కూడా అలుపెరగని స్థితిలో సమాజ ప్రగతికి తన వంతు కృషిని కొనసాగిస్తున్నారు. తన కుటుంబంతోపాటు, సమాజానికి తగిన ప్రేరణను అందించుట అత్యంత ముదావహం.

ఇట్టి వీరికి వీరి కుటుంబానికి వందనీయ గురుసత్తా ఆశీస్సులు లభించాలని యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

### శ్రీమతి పోలే రమాదేవి, ఎర్రబాలెం గ్రా॥ గుంటూరు జిల్లా

శ్రీ అంబటి వరహాలరావు – పరమేశ్వరి దంపతులకు రమాదేవిగారు 1974 నవంబరు 6న ఎర్రబాలెం గ్రామం, మంగళగిరి (మం॥) గుంటూరు జిల్లాలో జన్మించారు. తండ్రి రైల్వేశాఖలో ఉద్యోగి, శ్రీమతి రమాదేవిగారి బాల్యమంతా ఎర్రబాలెంలోనే గడిచింది. సమీపంలోనున్న మంగళగిరి పట్టణంలో ఎమ్.ఎ. (ఆంగ్లభాష)లో నాగార్జున విశ్వ విద్యాలయం, కాజ, గుంటూరు జిల్లా నుండి 2004లో పట్టా పొందారు.

వీరి వివాహం 1989లో పోలె ప్రసన్నకుమార్‌గారితో జరిగింది. వీరు ప్రసిద్ధ రిలయన్స్ కంపెనీ అస్యూరెన్స్ విభాగంలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. శ్రీమతి రమాదేవిగారు శ్రీ చైతన్య కళాశాలలో ఆంగ్లోపన్యాసకురాలిగా 1993 నుండి 2015 వరకు పనిచేస్తూ, పదవీ విరమణ చేశారు.

తన స్వగ్రామమైన ఎర్రబాలెంలో పనిచేస్తున్న శ్రీ కృష్ణానంద ఆశ్రమం, ప్రధాన ట్రస్టీ అయిన శ్రీ శర్మగారి ద్వారా గాయత్రీ పరివార్‌తో పరిచయమేర్పడింది. శ్రీ శర్మగారి ప్రేరణతో పరమ పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య విరచిత సాహిత్యాన్ని విస్తృతంగా పఠించి తద్వారా మరింత ప్రభావితులైనారు. వీనికి తోడు అప్పటి నుండి మంగళగిరి మండలం

**కఠోరమైన మాట కఠినమైన రాయితో సమానం**

చుట్టు ప్రక్కలనున్న అనేక గ్రామాలలో గాయత్రీ యజ్ఞాలను, దీపయజ్ఞాలను నిర్వహిస్తూ గాయత్రీ పరివార్ వ్యాప్తికై, పరమ పూజ్య గురుదేవుల ఆలోచనలను సమాజంలో విస్తృతంగా వ్యాపింపజేస్తూ వస్తున్నారు.

దీనిలో భాగంగా 2002లో శ్రీకృష్ణానంద ఆశ్రమ బాలురు తదితర కార్యకర్తలతో కలసి గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ హరిద్వార్‌ను మొట్టమొదటిసారిగా సందర్శించారు. 9 రోజుల సంజీవిని సాధనా శిబిరంలో పాల్గొని శిక్షణను పూర్తి చేశారు.

తదుపరి 2016లో తిరిగి శాంతికుంజ్‌ను సందర్శించారు. అట్లే తిరుపతి, మధురై, బెంగుళూరు మరియు కన్యాకుమారి పట్టణాలలో జరిగిన అశ్వమేధ యజ్ఞాలలో పాల్గొని సమయ దానమిచ్చారు.

పై అశ్వమేధాల స్ఫూర్తితో మంగళగిరిలో అశ్వమేధ యజ్ఞాన్ని 2018లో నిర్వహింపజేయాలనెడి సత్సంకల్పంతో తదితర గాయత్రీ పరివార్ సభ్యులతో కలిసి మంగళగిరిలో అశ్వమేధం జరపాలని గట్టిగా సంకల్పించారు.

ఇప్పుడు దాదాపు 2500 ఇళ్ళలో దేవస్థాపన జరిపి మంత్రజప సాధకులను తయారు చేయాలనె దృఢ సంకల్పాన్ని గైకొని దీనికై తన వంతు కృషిని ప్రారంభించారు. ఈ లక్ష్యసాధనలో వీరిభర్త చక్కని సహకారాన్ని అందిస్తున్నారు.

ఇట్టి ఈ దంపతులకు ఆ పూజ్య గురుసత్తా ఆశీస్సులు లభించాలని కోరుతూ యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

## కనువిప్పు

*సర్వమిత్ర మహారాజుకు మద్యం లేకుండా శాంతి లభించేది కాదు. రాజమహలైనా, రాజదర్బారైనా నిస్సంకోచంగా మద్యాన్ని సేవించేవాడు. తనతోపాటు ఇతరులను కూడా త్రాగించేవాడు. అనతి కాలంలోనే రాచకార్యాలు అస్తవ్యస్తంగా తయారైనాయి. అధికారులు ప్రజలను హింసించసాగారు. ప్రజలు కన్నీళ్ళతో విలపించారు. రాజే ఆచరణహీనుడైతే ప్రజల గోడు పట్టించుకునేదెవ్వరు? ప్రజల దుస్థితిని చూసి ఒక బ్రాహ్మణుడు రాజుగారి వ్యసనాన్ని దూరం చేయాలని సంకల్పించుకొన్నాడు.*

*ఒకరోజు రాజుగారి సవారి వెళుతూ మార్గమధ్యంలో గుంపులు, గుంపులుగా మూగి ఉన్న జనాన్ని చూసి కారణమేమిటని ప్రశ్నించాడు. ఎవరో మద్యాన్ని అమ్ముతున్నాడని, దానిలో ఏదో విశేషం ఉండి ఉంటుందని, లేకపోతే ఇంతమంది జనం చుట్టూ చేరరనే విషయాన్ని విన్నవించారు. రాజు సవారి ఆపి, అక్కడకు సమీపంచేసరికి బ్రాహ్మణుని గొంతు వినపడింది. "ఎవరైతే పతనం పరాకాష్టకు చేరుకోవాలని ఆశిస్తున్నారో వారు తక్షణం ఈ మద్యాన్ని సేవించండి. ఇది త్రాగగానే ఒళ్ళు మరిచిపోతారు. మురికి కాలవలో ముఖం కడుగుకొంటారు. పురుగులు ముఖం మీద స్వైర విహారం చేస్తాయి. కుక్కలు మీ ముఖాన్ని భయం లేకుండా నాకుతాయి. దీన్ని తాగిన భర్తలను భార్యలు చితకబాదుతారు. ఐశ్వర్యవంతుడు దరిద్రుడై చిప్ప పట్టుకుని అడుక్కొంటాడు. ఇది త్రాగిన తక్షణం లక్ష్యాలను, కర్తవ్యాలను మరచి యథేచ్ఛగా రోడ్లవెంట తిరుగుతారు. వ్యక్తిలో ఇంతటి పరివర్తనను తీసుకుని రాగల మద్యం కొరకు రండి, త్వరపడండి, ఆలస్యమైతే ఆశాభంగం" అంటూ బిగ్గరగా బ్రాహ్మణుడు అరుస్తున్నాడు. రాజు నిశ్చేష్టుడై "ఇన్ని అవగుణాలను ఇంత స్పష్టంగా చెపితే ఎవరు కొంటారయ్యా? నీ దగ్గర వ్యాపారం చేసుకొనే లక్షణాలున్నాయా?" అని రాజు ప్రశ్నించాడు. దానికి బ్రాహ్మణుడు, "రాజా! నేను సత్యవాది అయిన బ్రాహ్మణుణ్ణి. దీనిలో ఉన్న గుణాలే తప్ప లేని గుణాలని ఎక్కడ చెప్పగలను? ఏది సత్యమో అదే చెపుతున్నా" అన్నాడు. "ఇలాగైతే నీకు అమ్మడం రాదు." అని హెచ్చరించాడు రాజు. దానికి బ్రాహ్మణుడు నిశ్చింతగా "పతనానికి భయపడే సాధారణ ప్రజలు కొనకపోవచ్చు. కానీ శాసకులు, అధికారులు కొంటారు. ఇది త్రాగటం వలన వారు ప్రజలపై మరిన్ని అత్యాచారాలు చేసి సంపదను గడించుకోవచ్చు" అన్నాడు. ఆ మాటలు రాజును ఆలోచింపచేశాయి. తన రాజ్యపు పూర్తి స్వరూపం అతనికి కళ్ళకు కట్టినట్లు కన్పించింది. బ్రాహ్మణునిలోని దివ్య తేజస్సు అతనిలో పరివర్తనను తీసికొని వచ్చింది. సవారి దిగి ఆయన పాదాలమీద వ్రాలి, "ఓ మహానుభావా! నీవు నన్ను పతనం నుండి ఉద్ధరించటానికి వచ్చిన దైవానివిగానీ మద్యం అమ్ముకొనే బ్రాహ్మణుడవు కావు. నా కళ్ళు తెరచుకున్నాయి. నేను ఈ రోజు నుండి ఈ పాపాన్ని తాకను" అని ప్రతిజ్ఞ చేశాడు. బ్రాహ్మణుడు ఆనందించి "నీకు శుభం కల్గుగాక" అని రాజుని ఆశీర్వదించి, ఆనందంతో రాజ్యం నుండి నిష్క్రమించాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఇతరులను మనవాళ్ళుగా చేసుకోవాలంటే వంచనలేని తియ్యని మాటలు మాట్లాడగలగాలి**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గాయత్రీ పరివార్ తెలుగు క్యాలండర్ విశిష్టత

యుగశక్తి గాయత్రి మాసపత్రిక పాఠకులకు మరియు గాయత్రీ పరివార్ సభ్యులకు తెలియజేయునది.

2017 వార్షిక పంచాంగంతో పంచరంగులతో క్యాలండర్ 15, డిసెంబరు 2016 నాటికి అమ్మకానికి సిద్ధము.

క్రీ.శ.1555లో నోస్టర్‌డామస్ చెప్పినది నిజమని ఋజువైనది నేడు. 2016 వార్షిక క్యాలండర్‌లో ఫ్రాన్స్ దేశపు జ్యోతిష్య శాస్త్రవేత్త శ్రీ నోస్ట్రాడమస్ భారతదేశాన్ని గురించి క్రీ.శ.1555 లో వెల్లడించి జ్యోతిషమును ముద్రించాం. ఇది అక్షర సత్యమని నేడు నిర్ధారణ అయ్యింది.

**భవిష్యవాణి:** ఫ్రాన్స్‌దేశపు భవిష్యద్రష్ట నోస్ట్రాడమస్ ఇప్పటికి 460 సంవత్సరాల క్రితం (క్రీ.శ.1555లో) భారతదేశ భవిష్యత్తును గురించి జోస్యం చెప్తూచూ 2014 నుంచి 2026 మధ్య భారతదేశాన్ని ఒక సాధారణ పురుషుడు నడిపిస్తాడు. ఇతనిని దేశ ప్రజలు తొలుత నిరాదరించెదరు. తదుపరి ప్రజలు ఆయనను గాఢంగా ప్రేమిస్తారు. **అతడు దేశం యొక్క దశను మరియు దిశను కూడా మార్చుతాడు.** ఇది 8 నవంబరు, 2016న నిజమని తేలింది. ఆరోజు రాత్రి 8 గం॥లకు ప్రధాని శ్రీ నరేంద్రమోడి అతడు చేసిన ప్రకటనతో (రూ.500/- మరియు రూ.1000/- కరెన్సీ నోట్ల రద్దు) భారతదేశ దశ మరియు దిశమారి దేశగమ్యం వినూత్నపంథాను అనుసరించ బోవుచున్నది.

మధ్య వయస్కుడు, ప్రతిభాశాలి, రాజనీతిజ్ఞుడైన పాలనా దక్షుని మాధ్యమంగా దైవీశక్తులు భారతదేశంలో స్వర్ణయుగాన్ని పునరావృతం గావిస్తూ దీనిని యావత్ భూమండలానికి వ్యాపింపచేస్తాయి. తద్వారా సనాతన భారతీయధర్మాన్ని పునరుద్ధరింపజేసి యావత్ప్రపంచాన్ని అత్యంత ధార్మిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాయి. భారతావని స్వావలంబనగా ఎదుగు తుంది. ఇతని మాధ్యమంగా భారతదేశం విశ్వంలో కీలక స్థానాన్ని అలంకరిస్తుంది. దీనితో అనేక దేశాలను భారతదేశం ప్రభావితం చేస్తుంది.

గాయత్రీ పరివార్ తెలుగు క్యాలండర్ ఒక విశిష్టతతో ఒక విశిష్ట లక్ష్యముతో ప్రచురించబడుచున్నది. పాఠకులకు చక్కని మార్గనిర్దేశనాన్ని ఇస్తూ జీవన దేవతా సాధనా ఆరాధనా క్రమంలో ప్రతివారిని ముందుకు నడిపిస్తుంది. ఇది ప్రతి ఇంటిలో ఉండవలసి వార్షిక పంచాగం క్యాలండర్. ఇప్పుడే మీ కాపీని బుక్ చేసికోండి.

## గాయత్రీ ప్రజ్ఞాపీఠం, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు

అశ్వమేధ యజ్ఞం 2018 జనవరి, కార్యక్రమ సఫలతకై కార్యకర్తలను మరియు సాధకులను సంసిద్ధం చేయుటకై ప్రఖర ప్రజ్ఞ గాయత్రీ మండలి, 12 మంది పురుషులతో, సజల శ్రద్ధ మహిళామండలి 12 మంది స్త్రీలతో రెండు మండళ్ళను ఏర్పాటు చేయడమైనది. ఈ 24 మంది కార్యకర్తలు వారి సమయాన్ని, అంశదానాన్ని, ప్రతిభా పాటవాలను వినియోగిస్తూ పదివేల మంది సాధకులను తయారుచేసి, జనవరి 2018 మంగళగిరి గుంటూరు జిల్లాలో జరిగే అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికి పంపించే బాధ్యతను సూక్ష్మరూపంలో ఉపస్థితులై ఉన్న గురుసత్తా సమక్షంలో సంకల్పం తీసుకున్నారు. వీరందరి మధ్య సయోధ్యను సాధించి పై కార్యక్రమాన్ని చూసే బాధ్యతను ఏడుగురి సభ్యులతో కూడిన పాలకమండలి శ్రీమతి భువనగారి నాయకత్వంలో తీసికొన్నారు.

ఇదే రీతిలో గూడూరు పట్టణము, నెల్లూరు జిల్లాలో కూడా ఏర్పాటు చేయ సంకల్పించారు. శ్రీ సి.హెచ్. తిరుమలయ్య గూడూరు వారు దీనికి బాధ్యతను తీసికొన్నారు. సూళ్ళూరుపేట, వెంకటగిరి, కావలి, ఉదయగిరి, తదితర ప్రధాన పట్టణాలలో, గ్రామాలలో ప్రచారాన్ని చేపట్టుటకు నిర్ణయించారు.

500 సెట్లు (జపం) నెల్లూరు ప్రథమంగా పంపుటకు నిర్ణయించడమైనది.

దివంగతులైన శ్రీ తిరునారాయణగారు (కన్వీనరు) నెల్లూరు వారి బాధ్యతలను వారి కుమారుడైన శ్రీ అరవింద్‌గారు స్వీకరిం

ఎవరిని తక్కువగా చూడవద్దు

చుటకు పరివార్ సభ్యులంతా వారి సమ్మతిని తెలియజేయడమైనది. పంచకుండీ యజ్ఞం జరిగింది. 60-70 మంది పాల్గొన్నారు.

## సాందీపని మహర్షి గాయత్రీ శక్తిపీఠము

కుందూరువారిపాలెం, ముప్పాళ్ళ మం॥, గుంటూరు జిల్లాలో శ్రీ సైకం చిన్న యోగిరెడ్డి, శ్రీమతి సామ్రాజ్యం దంపతులు గాయత్రీ పరివార్ షష్ఠిపూర్తి మహోత్సవం చాలా మనోరంజకంగా కన్నుల పండువగా ఆహుతులైన 400 మంది గాయత్రీ పరివార్ సభ్యుల మధ్య నిర్వహింపబడింది. శ్రీ బ్రహ్మారెడ్డిగారు నంబూరు గాయత్రీ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా శ్రీ భాస్కరరెడ్డిగారు వ్యవహరించారు. గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్త అయిన శ్రీమతి రాజ్యలక్ష్మి ఒంగోలు వారు వచ్చి, గాయత్రీ సహస్ర నామావళిని మూడుసార్లు పఠింపజేసి, యోగిరెడ్డి, సామ్రాజ్యం దంపతుల ఆశీర్వదించారు.

శ్రీ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం జనవరి 2018, మంగళగిరి పట్టణము, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధాని 'అమరావతి' ప్రాంతంలో నిర్వహించుటకు గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ యాజమాన్యం, తమ అంగీకారాన్ని తెలియజేసినదని అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వెనువెంటనే శ్రీ చిన్నయోగిరెడ్డి దంపతులు యజ్ఞానికి తమ అంశదానంగా రూ. 5000/-లు ప్రకటించారు.

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం- జనవరి 2018 పరిజనులకు శుభవార్త

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞాన్ని జనవరి 2018లో నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని “అమరావతి” పరిధిలోని “మంగళగిరి” తీర్థ పట్టణ పొలిమేరలో ఎన్.ఆర్.ఐ. వైద్యశాల ప్రాంగణమందు నిర్వహించుటకు గాయత్రీ పరివార్ అధినేత డా॥ ప్రణవ్‌పండ్యాగారు తమ అంగీకారాన్ని 4 నవంబరు 2016 శుక్రవారం ఉదయం 8.40 గం॥లకు ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీ, శ్రీ ఉమేశ్‌శర్మ, శ్రీ రాఘవయ్య, నాగార్జున హైస్కూల్ డైరెక్టరు, పెదవడ్లపూడి శ్రీ భోజనపల్లి ప్రసాద్, మంగళగిరి శ్రీ ఎ.వేణుగోపాలరెడ్డిగార్ల సమక్షంలో తెలియజేశారు. యజ్ఞనిర్వహణ తేదీలు కూడా త్వరలో ప్రకటింపబడతాయి.

ఇట్లు - ప్రధాన సంచాలకులు
*గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాద్*

## ఆత్మవత్ సర్వభూతేషు

*మహావీరస్వామి అరణ్యంలో ఘోరతపస్సు చేసేవారు. పశువుల్ని కాసే గొల్లపిల్లలు కొందరు సమాధిలోనున్న ఈయనను అపహాస్యం చేయటం, అనేక విధాలుగా కష్టపెట్టటం చేసేవారు. ఈయన మాత్రం ఏ మాత్రము చలించక తపస్సులో నిమగ్నమై వుండేవారు. ఈ సంగతి దగ్గరలోనున్న గ్రామాల పెద్దలకు తెలిసింది. వారు మహావీరుని వద్దకు వచ్చి, 'స్వామీ! ఈ పాపిష్టివాళ్ళు ఎంత చెప్పినా వినక మీకు కష్టం కల్గిస్తూ వున్నారు. అందువల్ల మీ కోసం మేమొక పక్కా భవనాన్ని నిర్మించాలని నిశ్చయించుకొన్నాము. దానిలో సురక్షితంగా మీరు తపోసాధన చేసికోవచ్చు'నని నివేదించారు. దానికి మహావీరుడు, 'ఓ సజ్జనులారా! మీ ప్రేమకు సర్వదా కృతజ్ఞుణ్ణి. అజ్ఞానులైన పసిబిడ్డలు తల్లిదండ్రులకు అనేక విధాల కష్టాలు కల్గిస్తారు. అంతమాత్రాన తల్లిదండ్రులు పిల్లలను ప్రేమించక, ద్వేషించి దూరం చేసుకొంటున్నారా? అలాగే ఈ పిల్లలు కూడా ఎవరో కాదు నావాళ్ళే. అనేకమంది ఆశ్రయం లేనివారికి ఆశ్రయాన్ని కల్గించటానికి ఉపయోగపడే పక్కా భవనాన్ని నా సౌఖ్యం కోసం ఉపయోగించుకొని కర్మలో ఇరుక్కోలేన'ని వారి కోర్కెను నిరాకరించాడు. విషయాన్ని విన్న గొల్ల పిల్లలు సిగ్గుపడి మహావీరుని పాదాలమీద వాలి క్షమార్పణను కోరుకొన్నారు. ఎవరి అంతరంగంలోనైతే సమాజం పట్ల ప్రేమ, కర్తవ్యనిష్ఠ అనేవి జాగృతమవుతాయో వారికి స్వపరబేధం వుండదు. అంతా ఒకటిగానే కనిపిస్తుంది. అందరూ తనవారుగానే కనిపిస్తారు. సత్కరించినవాడిని, మరణదండన విధించినవారిని ఒకలాగే ప్రేమించగల్గుతాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో మనకు ఈ విధమైన ఉదాహరణలు అనేకం ఉన్నాయి.*

- ప్రజ్ఞాపురాణ కథల నుండి

**అత్యాశ మనుష్యులను వేరు చేస్తుంది**